



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...


తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 346 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 2 సెప్టెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-

## కష్టకాలంలోనూ కలిసే ఉన్నాం

- మన బంధం ప్రాంతీయ సుస్థిరతకు మూలస్తంభం: మోదీ
- భారత ప్రధానిని తన కారులో తీసుకువెళ్లిన పుతిన్
- అందులోనే ముప్పావుగంట ఏకాంత భేటీ
- భారత్‌తో అనుబంధం పార్టీలకు అతీతమన్న రష్యా అధినేత
- ఒకే వేదికపై భారత్, చైనా, రష్యా సారథులు

6

## వచ్చే ఎన్నికల్లోనూ

# ఎన్డీఏదే గెలుపు

### అభివృద్ధి ఎవరిదో.. విధ్వంసం ఎవరిదో చర్చిద్దాం

### అసెంబ్లీకి రాకుండా తప్పుడు ప్రచారాలా?



- వైసీపీకి చంద్రబాబు సవాల్.. అదో ఫేక్ పార్టీ అని ధ్వజం
- సూపర్‌సిక్స్ పథకాల నుంచి ప్రాజెక్టుల దాకా..
- బాబాయ్ హత్య, దళిత డ్రైవర్ శవం డోర్ డెలివరీ కోడికత్తి డ్రామా, గులకరాయి ఎపిసోడ్ వరకూ
- వీటన్నిటిపైనా మాట్లాడదాం సిద్ధమా?
- నాడు సిద్ధం సిద్ధం అని ఎగిరిపడ్డారు కదా!
- పులివెందులలో కూడా విజయం సాధిస్తాం
- రాజంపేట సభలో ముఖ్యమంత్రి ఉద్ఘాటన
- ములక్కాయలపల్లెలో మహిళకు రూ.15 వేల దివ్యాంగ పెన్షన్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

"మీకు ధైర్యం ఉంటే.. చిత్తశుద్ధి ఉంటే.. మీ 11 మంది ఎమ్మెల్యేలూ అసెంబ్లీకి రండి.. పింఛన్లు సహా ఏ అంశంపైనైనా చర్చిద్దాం. నాడు సిద్ధం సిద్ధం అని ఎగిరిపడ్డారు కదా! నేడు సూటిగా అడుగుతున్నా.. అసెంబ్లీకి సిద్ధమా? ఎవరిది సంక్షోభ పాలనో? ఎవరిది సంక్షేమ రాజ్యమో తేల్చేద్దాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీకి సవాల్ విసిరారు. ఎవరిది విధ్వంసమో ఎవరిది అభివృద్ధి పాలనో. శాసనసభ సాక్షిగా తేల్చేద్దామన్నారు. సూపర్ - మిగతా 2లో

## ధైర్యంగా ఉండండి...

# అండగా నిలుస్తా



- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మాజీ సీఎం వైఎస్ జగన్ భరోసా
- పులివెందుల క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్
- కార్యకర్తలు, ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్న వైఎస్ జగన్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలోని భాకరాపురంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో మమేకమయ్యారు. సోమవారం మధ్యాహ్నం పులివెందులలోని క్యాంపు కార్యాలయానికి చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కూటమి ప్రభుత్వంలో పడుతున్న బాధలు, సమస్యలను ప్రజలు వివరించారు. ప్రజల బాధలు, కష్టాలు, సమస్యలు వింటూ 'నేనున్నాను...' అంటూ భరోసా ఇవ్వడంతోపాటు ధైర్యాన్ని నింపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు తెలుసుకుని, వారి సమస్యలు ఓపిగ్గా విని, వారికి వెన్నుదన్నుగా ఉంటానని మాటిచ్చారు. కూటమి ప్రభుత్వం చాలా దారుణంగా - మిగతా 2లో



## చేయని చదునుకు సాయం

- కూటమిలోనూ వైసీపీ నేతలదే రాజ్యం
- జగనన్న కాలనీల్లో నాడు ఉత్తుత్తి చదును
- ఆ పనులపై తనిఖీలకు కూటమి ఆదేశం
- అయినా, వారికి బిల్లులు ఇప్పించేందుకు హౌసింగ్‌లోని కొందరు అధికారుల ఉత్సాహం
- కోర్టుకు వెళ్లే వైసీపీ నేతలకు పూర్తి సహకారం
- తనిఖీల విషయం కావాలనే దాస్తున్న వైనం
- దీంతో కోర్టుల్లో నేతలకు అనుకూలంగా తీర్పులు

వివరాలు 2లో..


## హైడ్రోజన్ బాంబు త్వరలో పేలుస్తా!



- ఓట్ల చోరీపై మరిన్ని నిజాలు బయటపెడతా
- 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు సభలో రాహుల్
- ఓట్ల దొంగతనంపై మరిన్ని నిజాలు బయటపెట్టిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ముఖం చూపించలేని పరిస్థితి వస్తుంది
- ఓట్ల చోరీని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని విప్లవాత్మక రాష్ట్రమైన బిహార్ యావత్ దేశానికి స్పష్టమైన సందేశం ఇచ్చింది

6

## హిమాచల్, ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సం



- కొండచరియలు విరిగి ఏడుగురు మృత్యువాత
- ఛార్‌ధామ్, హేమ్‌కుండ్ యాత్రలు నిలిపివేత

6

## 99.5% ఓటర్లు సరైన ధ్రువీకరణలను సమర్పించారు

అనర్హుల తొలగింపులో ఆ రెండు పార్టీలు మాత్రమే సహకరించాయి



## శిథిలాల దిబ్బగా

# అఫ్గానిస్థాన్

- 6.0 తీవ్రతతో భూకంపం.. 800 మందికి పైగా దుర్మరణం
- 2,500 మందికి పైగా క్షతగాత్రులు
- గ్రామాలకు గ్రామాలే ధ్వంసం
- కూలిన ఇళ్ల కింద ఇంకా చాలా మంది
- మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం
- ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి
- అన్ని రకాలుగా ఆ దేశాన్ని ఆదుకుంటామని హామీ

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

యుద్ధాలు, అంతర్యుద్ధాలు, క్షామాలతో తరచూ అతలాకుతలమయ్యే అఫ్గానిస్థాన్‌లో మరో ఘోర విషాదం. ఆదివారం రాత్రి రిక్టర్ స్కేల్‌పై 6.0 తీవ్రతతో నమోదైన భూకంపం ఆ దేశానికి కాళరాత్రిని మిగిల్చింది. ఏకంగా 800 మందికి పైగా ప్రాణాలను బలిగొంది. 2,500 మందికి పైగా పౌరులను క్షతగాత్రులను చేసింది. భూకంప తాకిడికి గ్రామాలకు గ్రామాలే ధ్వంసమయ్యాయి. శిథిలాల కింద చిక్కుకున్న ఆప్తులను రక్షించుకొనేందుకు చేతులతోనే చాలా మంది మట్టిని తవ్వితీస్తున్న దృశ్యాలు కంటతడి పెట్టిస్తున్నాయి. తాలిబన్ ప్రభుత్వం - మిగతా 2లో

# వచ్చే ఎన్నికల్లోనూ ఎన్డీఏదే గెలుపు

-మొదటిపేజీ తరువాయి

సిక్స్ పథకాల నుంచి సాగునీటి ప్రాజెక్టుల వరకూ, పెట్టుబడుల నుంచి పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల వరకూ, బాబాయ్ హత్య నుంచి దళిత డ్రైవర్ శవం డోర్ డెలివరీ దాకా, కోడికత్తి డ్రామా నుంచి గులకరాయి ఎపిసోడ్ వరకు చర్చిద్దామని సవాల్ చేశారు. సభకు రాకుండా.. ఫేక్ మీడియాతో తప్పుడు ప్రచారాలు చేస్తామంటే మాత్రం కుదరదన్నారు. 'పేదలకు సేవ' కార్యక్రమంలో భాగంగా సోమవారం అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఆయన పర్యటించారు. తొలుత ములక్కాయలపల్లె వెళ్లి అనారోగ్యంతో 14 ఏళ్లుగా మంచంపైనే జీవనం సాగిస్తున్న మహిళకు రూ.15 వేలు వికలాంగ పింఛను అందజేశారు. తర్వాత బోయనపల్లెలో రజకులతో మాట్లాడారు. అనంతరం తాళ్లపాకలో ఏర్పాటుచేసిన ప్రజావేదికలో మాట్లాడారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో ముచ్చటించారు.

కార్యకర్తల సమావేశంలో, తర్వాత బహిరంగ సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో ఒక ఫేక్ పార్టీ ఉందని.. అవినీతితో పేపర్, టీవీ పెట్టుకుని అన్నీ తప్పులే రాస్తున్నారని మండిపడ్డారు. 'పోలవరం మేం కడితే దానిని కూలుస్తారు.. ప్రజా రాజధాని అమరావతి ఉండాలని మనం ఆకాంక్షిస్తే అమరావతిని ఎడారి చేశారు.. మనం రోడ్లు వేస్తే.. రోడ్లన్నీ గుంతలు పెట్టారు.. అలాంటి పార్టీకి నేను సవాల్ విసురుతున్నా.. అసెంబ్లీకి రండి.. అసెంబ్లీలో చర్చిద్దాం.. అసెంబ్లీలో సమాధానం చెప్పే ధైర్యం సత్తా మాకుంది. మీరు చేసిన తప్పుడు పనులు.. ఫేక్ మీడియాలో రాసే తప్పుడు కథనాలకు మేం సమాధానం చెప్పాలా..' అని నిలదీశారు. రానున్న ఎన్నికల్లోనూ ఎన్డీఏ ప్రభుత్వమే ఏర్పడుతుందని చెప్పారు. పులివెందులలో కూడా కూటమి గెలుస్తుందన్నారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

**అప్పు చేసి బాగుపడిన వాళ్లు ఎవరైనా ఉన్నారా?**

గత ప్రభుత్వం అప్పులు చేసి ప్రజలను మోసం చేసింది. ఎక్కడైనా అప్పులు చేసిన కుటుంబం బాగుపడిందా? అందుకే ఆదాయాన్ని పెంచి.. అభివృద్ధి చేసి అందులో పేదవాడిని ఆదుకుంటున్నాను. గతంలో హైదరాబాద్‌లో నేను ఐటీ అంటే అందరూ ఎగతాళి చేశారు. ఈ రోజు చూస్తే నేను ప్రారంభించిన ఐటీ ప్రపంచంలో తెలుగువారికి గుర్తింపు తెస్తోంది.. ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా అక్కడ తెలుగులో మాట్లాడితే వంద మంది చేరతారు. తెలుగు మాట్లాడే వారు అన్ని దేశాలకూ వెళ్తున్నారు. 30 ఏళ్లలో హైదరాబాద్ విశ్వనగరంగా తయారైంది.

**భయం నుంచి స్వేచ్ఛ..**

2019–24 మధ్య వైసీపీ ప్రభుత్వంలో అన్ని రంగాల్లోనూ విధ్వంసం జరిగింది. ప్రజలు భయం భయంగా బతికారు. ఐదేళ్లు వారి ముఖాల్లో నవ్వులు లేవు. ఏమీ మాట్లాడలేని పరిస్థితి. ఈ తరుణంలో నేను, పవన్ కల్యాణ్ కలిసి పోటీ చేయాలనుకున్నాం. బీజేపీ కూడా ముందుకు వచ్చింది. ముగ్గురం 94 శాతం స్ట్రైక్ రేట్‌తో.. ఎప్పుడూ లేనంత మెజారిటీతో గెలిచాం ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. భయం లేకుండా మాట్లాడగలుగుతున్నారు. ఎమ్మెల్యేలు తప్పుచేసినా నిలదీయగలుగుతున్నారు. ఇదీ మేం కల్పించిన స్వేచ్ఛ. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలే తిప్పికొట్టాలి. మంచి ప్రభుత్వానికి అండగా నిలబడాలి. గత ఏడాది విజయం మన సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతోంది. ప్రధాని మోదీ దేశాభివృద్ధికి అనేక సంస్కరణలకు నాంది పలికారు. నేను మొదటి నుంచీ సంస్కరణలు అమలు చేశాను. దేశం అభివృద్ధి కావాలి.. మనం కూడా దేశంలో ఒక భాగం. టీడీపీ ఎప్పుడూ ప్రజల కోసమే అధికారాన్ని ఉపయోగిస్తుంది. ఆ రోజుల్లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేశారు. నేను సీఎం అయ్యాక.. నాడు యునైటెడ్ ఫ్రంట్, నేడు ఎన్డీఏలో భాగస్వామిగా ఉంటూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్నాను.

**జీవితానికి ఇంకేం కావాలి..?**

గతంలో బావులు, వాగులు, వంకలు వద్దకు రజకులు వెళ్లి దుస్తులు ఉతికి తీసుకొచ్చేవారు. వారి కష్టాలను చూసి.. ఊళ్ల మధ్యలో దోభీ ఘాట్లను కట్టి బోర్లు వేయించాం. ఇప్పుడు దోభీఘాట్లలో వృద్ధ రజకులు నన్ను చూసి 20 ఏళ్ల క్రితం మీరే కట్టించారు సార్ అని చెబితే నాకెంతో ఆనందంగా ఉంది. ఒకచోట రజకుడు.. ఇస్త్రీ పెట్టె మీరే ఇచ్చారు సార్ అని చెప్పడం చూస్తే.. జీవితంలో ఇంకేం కావాలని అనిపించింది. టీడీపీ, ఎన్డీఏ బీసీలకు అన్ని విధాలా న్యాయం చేస్తున్నాయి. సమైక్య రాష్ట్రంలో ఆదరణ–1, ఆదరణ–2 పథకాలు ప్రవేశపెట్టాను.

**రాబోయే రోజుల్లో సంజీవని ప్రాజెక్టు**

ఆరోగ్య, ఆనంద సమాజం కోసం ప్రయత్నిస్తున్నాను. దీనిని దృష్టిలో ఉంచుకుని రాబోయే రోజుల్లో సంజీవని అనే ప్రాజెక్టు తీసుకొస్తున్నాను. ఇది వినూత్నమైన ప్రాజెక్టు. టెక్నాలజీ సాయంతో విజయవంతమవుతుంది. పేదవాడి ఆరోగ్యం కాపాడే విధంగా.. ఏ మందు అవసరమో ఆ మందు తీసుకొస్తాం. ఎక్కువ బియ్యం తినడం వల్ల కార్బోహైడ్రేట్స్ పెరిగి బీపీ, షుగర్ వస్తున్నాయి. భవిష్యత్‌లో రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడానికి సంజీవని ఎంతో ఉపయోగపడుతుంది. అంతకుముందు మధ్యాహ్నం 12.20 గంటలకు హెలికాప్టర్లో రాజంపేటలోని హెలిప్యాడ్ వద్ద సీఎం దిగారు. జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అరవ శ్రీ?ధర్, షాజహాన్‌బాషా తదితరులు స్వాగతం పలికారు.

**14 ఏళ్లుగా మంచంలోనే..!**

రాజంపేట మండలం ములక్కాయలపల్లెలో సుమారు 14 ఏళ్లుగా మంచంలోనే జీవనం సాగిస్తున్న యడబల్లి సుమిత్రమ్మ(54)కు ముఖ్యమంత్రి స్వయంగా రూ.15 వేలు దివ్యాంగ పింఛనుగా అందజేశారు. ఆమె అనారోగ్య సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆమె భర్త వెంకటేశ్వర్‌రాజుతో మాట్లాడారు. తాను ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నానని.. భార్య అనారోగ్యంపాలై మంచానికే పరిమితమవడంతో అష్టకష్టాలు పడుతున్నామని రాజు చెప్పాడు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. అనంతరం బోయనపల్లె గ్రామంలో దోభీఘాట్‌కు చేరుకుని రజకులతో మాట్లాడారు. టి.ఆదిలక్ష్మి, బి.లక్ష్మీదేవి, టి.లక్ష్మీదేవి, హరిప్రసాద్, జయరాం, నరసింహులు, పెంచలయ్య, సంటయ్య తదితరులతో ఆప్యాయంగా మాట్లాడారు. వృత్తి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బోయనపల్లె ప్రజలు ఆయనకు మంగళ హారతులు పడుతూ నీరాజనాలు పలికారు.

# చేయని చదునుకు సాయం

అమరావతి

గత వైసీపీ హయాంలో కొందరు కాంట్రాక్టర్లు 'జగనన్న కాలనీల' చదును వంకతో డబ్బులు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వంలోనూ ఇప్పుడు తిరిగి వారే బిల్లులు చేసుకుంటున్నారు. ఆ ప్రభుత్వంలో వీరంతా అడ్డగోలుగా జేబులు నింపుకొన్నారు. ఈ ప్రభుత్వంలో ఇప్పుడు కూడా వారే యమజోరును ప్రదర్శిస్తున్నారు. అధికారుల సహకారంతో కోర్టులో కేసులు వేసి అనుకూల తీర్పులు పొందుతున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో చదును పనులను ఉపాధి హామీ పథకం నిధులతో సాగించింది. కాంట్రాక్టర్లుగా మారిన వైసీపీ నాయకుల్లో చాలామంది ఈ పనులు దక్కించుకున్నారు. అయితే, ఉపాధిలో అనుమతి లేని పనులుగా వీటిని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తేల్చింది. జగన్ సర్కారుకు మొట్టికాయలు వేసింది. ఆ తర్వాత గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి హౌసింగ్ విభాగానికి ఈ పనులను అప్పటి ప్రభుత్వం బదిలీ చేసింది. అప్పటినుంచి హౌసింగ్‌లో ఇష్టారాజ్యంగా దోపిడీ కొనసాగింది. జగనన్న కాలనీల్లో చదును పనులు చేపట్టకుండానే బిల్లులను వైసీపీ నేతలకు ఇప్పించేందుకు హౌసింగ్‌లోని కొందరు అధికారులు తీవ్రంగా కష్టపడుతున్నారు. ఫలితంగా పనుల్లేకుండానే జగనన్న ఇళ్ల కాలనీ బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ఈ అక్రమాలను నివారించలేని పరిస్థితి ఏర్పడింది.

**సాగు.. తున్న తనిఖీలు**

గత ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఇంటి స్థలాల లెవలింగ్‌పై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ విచారణకు చంద్రబాబు ప్రభుత్వం ఆదేశించింది. అసెంబ్లీ జీరో అవర్‌లో లెవలింగ్ అవకతవకలపై చర్చ రావడం, పలు పత్రికల్లో కథనాలు రావడం, రాష్ట్ర వ్యాప్తంగా ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణ తేజ రంగంలోకి దిగారు. ఆ పనులు తనిఖీ చేసిన తర్వాతే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని నిర్దేశించారు. ప్రతి జిల్లాలో ఎక్కడికక్కడ పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఈఈలు, ఉపాధి పథకం సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు, అవసరమైన చోట ఇతర శాఖల ఇంజనీర్లతో తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి సమగ్రమైన విచారణ చేసి సిఫారసులు చేయాలని జిల్లా కలెక్టర్లుకు కృష్ణతేజ సూచించారు. ఆయా జిల్లాల్లో ఆయా పనులకు సంబంధించి 25 శాతం పెండింగ్ చెల్లింపుల పనుల జాబితాను ఆయా డ్వామా పీడీల నుంచి సేకరించాలని, నిబంధనల ప్రకారం పనులు జరిగాయా? లేదా?, గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన సీనరేజ్ చార్జీలు ఆయా పనులు చేసిన వెండర్లు చెల్లించారా లేదా? తదితర నిబంధనలను తనిఖీ సందర్భంగా పాటించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు ఆయా పనులకు సంబంధించి పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత ఇంటి స్థలాల లెవలింగ్ పనుల బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అయితే కమిషనర్ ఆదేశించి 8 నెలలవుతున్నా ఇంకా తనిఖీలు కొన...సాగుతూనే ఉన్నాయి. జిల్లాల్లో కొన్ని చోట్ల గతంలో పనులు నిర్వహించిన సందర్భంలో ఉన్న అధికారులే ఇప్పటికీ ఉన్నారు. దీంతో విచారణ తూతూ మంత్రంగా సాగుతున్నదన్న విమర్శలు వస్తున్నాయి.

**వైసీపీ నేతలకు దోచిపెట్టారు..**

స్థానిక నేతలకు అప్పనంగా దోచిపెట్టేందుకు ఇంటి స్థలాల లెవలింగ్ పనులను గత ప్రభుత్వం ఎంచుకుంది. ఉపాధి హామీ పథకంలో చేపట్టేందుకు అనుమతి లేకపోయినప్పటికీ.... పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదీ సహకారంతో అడ్డగోలుగా పనులు చేపట్టారు. సుమారు రూ.1125 కోట్ల పనులు చేపట్టి సుమారు రూ.1500 కోట్లకు పైగా బిల్లులను వైసీపీ నేతలు బిల్లులు అప్‌లోడ్ చేశారు. అయితే, ఉపాధిలో ఈ పనులకు అనుమతి లేదని.... చెల్లింపులు చేయరాదని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీంతో ఎలాగైనా వైసీపీ నేతలకు ఈ బిల్లులు చెల్లించాలన్న ఉద్దేశంతో ఈ బిల్లులు చెల్లింపుల ప్రక్రియ హౌసింగ్ ద్వారా చేపట్టాలని నిర్ణయించారు. గ్రామీణాభివృద్ధిశాఖ వద్ద ఉన్న పనులు బిల్లులను హౌసింగ్‌కు మార్చారు. ఈ క్రమంలో పలు పనులకు సంబంధించి మొత్తం కొలతలను మార్చేసి భారీ స్కాంకు తెరదీశారు. సుమారు రూ.460 కోట్ల ఉపాధి నిధులను సర్దేశారని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది.

**రికవరీ చేస్తాం : ప్రభుత్వం**

క్వాలిటీ కంట్రోల్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో చాలా చోట్ల రికార్డు చేసిన మేర పనులు లేవని తేలింది. అయినా, అప్పటి వైసీపీ నేతలను బిల్లులు ఇప్పించేందుకు హౌసింగ్‌లోని కొందరు అధికారులు అమిత ఉత్సాహం చూపుతున్నారు. వైసీపీ నేతలకు ఇవ్వాల్సిన మొత్తం బిల్లులు చెల్లిస్తామని ఎంపీడీఓలతో కోర్టులకు స్టేట్‌మెంట్‌లు ఇప్పిస్తున్నారు. ఇప్పటివరకు 23 మంది వైసీపీ నేతలు కోర్టును ఆశ్రయించారు. ఏలూరు నుంచి ఇద్దరు, నెల్లూరు నుంచి ఐదుగురు, బాపట్ల నుంచి ఆరుగురు, ప్రకాశం నుంచి ఒకరు, పల్నాడు నుంచి ఆరుగురు, ఎన్టీఆర్ జిల్లాలో ముగ్గురు వైసీపీ నేతలు కోర్టుకెళ్లారు. కాగా, క్వాలిటీ కంట్రోల్ నివేదికను కోర్టు దృష్టికి తీసుకెళ్లకుండా కొందరు ఎంపీడీవోలు పూర్తిబిల్లులు చెల్లించినట్టు ప్రభుత్వం గుర్తించింది. ఆ ఎంపీడీవోల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేస్తామని ఉపాధి హామీ డైరక్టర్ షణ్ముక్‌కుమార్ సోమవారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ సందర్భంగా హెచ్చరించారు

## వాహనదారులకు ఆర్టీఏ మెసేజ్ లు

విజయవాడ

"ఏపీలోని వాహనదారులకు ముఖ్యమైన గమనిక.. మీకు డ్రైవింగ్ లైసెన్స్ , వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ) ఉందా.. అయితే వెంటనే అందులోని మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేసుకోండి. ఆధార్ ధ్రువీకరణ ద్వారా సెల్ ఫోన్ నంబర్లను అప్‌డేట్ చేసుకోండి.." అంటూ ఏపీ రవాణా శాఖ నుంచి వాహనదారులకు మెసేజులు వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ఎవరికి వారే వ్యక్తిగతంగా ఈ పని చేసుకోవచ్చని.. ఇందుకోసం జూజీతీతిలజీష్ట్రజీని.ఐనీల.తిని పోర్టల్‌ను సందర్శించాలని రవాణాశాఖ సంక్షిప్త సందేశాలు పంపిస్తోంది. ఆ పోర్టల్‌లో ఆర్సీ, లైసెన్సు వివరాలను మొబైల్ నంబరుతో అప్‌డేట్ చేసుకోవాలని సూచిస్తోంది.ఇదంతా ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం పరివాహన్ సేవ అనే పోర్టల్ అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. అన్ని రాష్ట్రాల రవాణాశాఖ సేవలను ఇందులోకి మారుస్తున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి రవాణా శాఖ సేవలు ఈ ప్రగతి.ఓఆర్‌జీలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇందులోని వివరాలను కూడా పరివాహన్‌లోకి మార్చారు. అయితే కొన్ని డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ల వివరాలు అప్‌డేట్ కాలేదు. ఈ నేపథ్యంలో ఇలాంటి వాటిని వాహనదారులు సొంతంగా ఆధార్ ధ్రువీకరణ ద్వారా అప్‌డేట్ చేసుకోవాలని రవాణా శాఖ సూచిస్తోంది.మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేసుకోవాలనుకుంటే వాహనదారులు ముందుగా పరివాహనసేవాస్ అనే పోర్టల్‌లోకి వెళ్లాలి. ఆ తర్వాత పరివాహన్ పేజీలోకి వెళ్లాలి. ఆ పేజీలో పలు రకాల సేవలు ఉంటాయి. అందులో ఏదో ఒక సేవ పైన క్లిక్ చేయగానే అప్‌డేట్ యువర్ మొబైల్ నంబర్ అంటూ స్క్రీన్ మీద వస్తుంది. ఇందులో వాహన్, సారథి అంటూ క్యూఆర్ కోడ్లు, వెబ్‌సైట్ లింకులు దర్శనమిస్తాయి. మొబైల్‌లో అప్‌డేట్ చేసుకునే వారు.. ఖీఖీ కోడ్ స్కాన్ చేసి అప్ డేట్ చేసుకోవచ్చు. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్ ద్వారా అయితే లింక్‌లను క్లిక్ చేసి అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక వాహన్, సారథి రెండింటిలోనూ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది.వాహన్‌లో అయితే.. వాహనాల ఆర్సీలను మొబైల్ నంబర్‌తో లింక్ చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్, ఛాసిస్, ఇంజిన్ నంబర్ల వివరాలను నింపి.. ఆర్సీలోని వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత క్యాప్చా నమోదు చేసి.. వ్యాలిడేట్ మీద క్లిక్ చేయాల్సి ఉంటుంది. అనంతరం ఆధార్ కార్డు నంబరు, ఆధార్ కార్డులో ఉన్నట్టుగానే పేరు నమోజు చేయాలి. మొబైల్ నంబరు నమోదు చేసి వెరిఫై మీద క్లిక్ చేయాలి. దీంతో మొబైల్ నంబరు.. ఆర్సీకి లింక్ అవుతుంది. అప్పటికే మొబైల్ నంబర్ లింక్ చేసినవారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదు.మరోవైపు సారథిలో అయితే డ్రైవింగ్ లైసెన్సులను మొబైల్ నంబర్‌తో అప్‌డేట్ చేసుకోవాలి. డ్రైవింగ్ లైసెన్సు నంబరు, పుట్టినరోజు, ఇతరత్రా వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత క్యాప్చా నమోదు చేసి.. ఆధార్ కార్డు వివరాలు ఎంటర్ చేస్తే.. ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని నమోదు చేసి సబ్మిట్ బటన్ నొక్కితే.. డ్రైవింగ్ లైసెన్సు వివరాలు మొబైల్ నంబర్‌తో లింక్ అవుతాయి. ఇలా చేస్తే భవిష్యత్తులో డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ బదిలీ సులువుగా ఉంటుందని అధికారులు చెప్తున్నారు

## ధైర్యంగా ఉండండి... అండగా నిలుస్తా

-మొదటిపేజీ తరువాయి

వ్యవహరిస్తోందని, అరాచక పాలన సాగిస్తోందని, అకారణంగా దాడులు చేస్తున్నారని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్ద వాపోయారు. దీనికి ఆయన స్పందిస్తూ... ఎవరూ అధైర్యపడొద్దని సూచించారు. టీడీపీ అరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పోరాట పంథాను ఎంచుకుని ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. ఇటీవల హింసాత్మక రాజకీయాలకు పాల్పడుతున్న కూటమి నేతల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక్క పోలీసు వ్యవస్థనే కాకుండా అన్ని వ్యవస్థలను ఈ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందని వైఎస్ జగనమండిపడ్డారు. ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు చేయాలిగానీ కీడు చేయకూడదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు కులం, మతం, పార్టీ అని చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ మంచి చేశామని ఆయన గుర్తుచేశారు.

**కక్ష సాధించడమే పనిగా పెట్టుకున్న ప్రభుత్వం**

టీడీపీ కూటమి సర్కార్ ప్రజలకు మేలు చేయడం పక్కనపెట్టి వైఎస్సార్‌సీపీ నేతులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడుమే పనిగా పెట్టుకుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశురు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు నేతలు అండగా నిలబడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పులివెందులలోని క్యాంపు కార్యాలయం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా, జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందురెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, రమేష్‌యాదవ్, కడప మేయర్ సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్.రఘురామిరెడ్డి, ఎస్‌బీ అంజాద్‌బాషా, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నేడు వైఎస్సార్ ఘాట్‌లో నివాళులు**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు మంగళవారం వైఎస్ కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో నివాళులు అర్పించనున్నారు. మత పెద్దలు నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొననున్నారు. అనంతరం

లింగాల మండలంలోని అంబకపల్లె చేరుకోనున్నారు. నూతనంగా నిర్మించిన చెరువుకు కృష్ణా జలాలు చేరిన నేపథ్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జలహారతి ఇస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## త్రిశూల వ్యూహంలో పవన్

విజయవాడ

జనసేన ఫ్యూచర్ రాజకీయాల గురించి తన అంతరంగాన్ని బయటపెట్టారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. అందుకు టైమ్ ఫిక్స్ చేసుకున్నారు. కేవలం తనకు దశాబ్దంపాటు సమయం ఇవ్వాలని పార్టీ కార్యకర్తలను ఆయన కోరారు.ఇంతకీ పవన్ అసలు టార్గెట్ వైసీపీ అని అంటున్నారు. ఇందుకు కారణాలు లేకపోలేదు. చీటికి మాటికీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పార్టీ కార్యకర్తలను ఒక్కటే కోరుతున్నారు. దశాబ్దంపాటు కూటమి బంధం బలంగా ఉంటుందని చెబుతున్నారు. దశాబ్ద కాలం తనకు సమయం ఇవ్వాలని, మిమ్మల్ని నాయకులుగా, దేశ నిర్మాణంలో కీలక వ్యక్తులుగా తీర్చిదిద్దే బాధ్యత తనది అని చెప్పుకొచ్చారు. ఈలోగా ఏపీలో అభివృద్ధి ఒక లెవల్‌కి వస్తుందన్నది కొందరు నేతల మాట. పార్టీ కూడా బలంగా తయారు అవుతుందని, అప్పుడు సొంతంగా పోటీ చేయాలన్నది జనసేనాని ఆలోచనగా చెబుతున్నారు. ఈ దశాబ్దం పాటు రాజకీయాలు ఏవిధంగా ఉంటాయన్నది కూడా వివరించారు. దసరా తర్వాత 'త్రిశూల్' కార్యక్రమం మొదలుపెడుతున్నట్లు మనసులోని మాట బయటపెట్టారు పవన్ కళ్యాణ్. ప్రతి క్రియాశీలక సభ్యుడికి గుర్తింపు, నాయకత్వం, భద్రతే ప్రధాన అంశాలుగా ఆ కార్యక్రమం ఉండబోతుందని వెల్లడించారు. మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్ దిశగా అడుగులు వేస్తున్నారు. గ్రామం మొదలు నియోజకవర్గం, పార్లమెంటు, జిల్లా, రాష్ట్ర స్థాయి బలమైన శక్తిగా పార్టీని ఎదిగించాలన్నది జనసేన ఆలోచన. బాధ్యతలు మోయడంలో కుటుంబాన్ని విస్మరించానని, సినిమాలపై సరిగా దృష్టి పెట్టలేదన్నారు పవన్ కల్యాణ్. అన్నీ వదిలేశానేమో కానీ జన సైనికులు, వీర మహిళలపై సంపూర్ణ దృష్టి పెట్టానన్నారు. దాని ఫలితం దేశంలో ఘనమైన విషయం సాధించామన్నారు. 100 శాతం విజయం సాధించడమంటే ఆశామాషీ కాదన్నారు. నాయకులు కావాలనే ఆశయం ఉన్న ప్రతి ఒక్కరికీ దిశానిర్దేశం చేస్తానన్నారు. దేశ నిర్మాణం కోసం, బలోపేతం కోసం కలిసి అడుగులు వేద్దామన్నారు. అన్నట్లు జనసేన సభకు జాతీయ పార్టీ లుక్ వచ్చింది. పార్టీ కార్యక్రమం కోసం జనసేన కార్యకర్తలు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీగా తరలి వచ్చారు. ఒడిషా, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు. వారిలో కర్ణాటక కార్యకర్తలు ఆ రాష్ట్ర జెండాను తీసుకొచ్చారు. జనసేన జెండాలతో కలిపి ఆ జెండాను ప్రదర్శించారు. దీంతో పవన్ కల్యాణ్ ఆ జెండాతో పాటు కండువాలను తెప్పించుకుని మెడలో వేసుకుని జెండాను ఊపారు. దీంతో సభ జరుగుతున్న ప్రాంతం ఒక్కసారిగా మార్మోగిపోయింది. మనం బలహీనపడితే ఏపీలో మళ్లీ అరాచక పాలన వస్తుందని చెప్పకనే చెప్పారు. అందువల్లే కూటమి దశాబ్దంపాటు సాగాలన్నారు. అందుకే 15 ఏళ్ల పాటు రాజకీయ స్థిరత్వం అవసరమని నొక్కి వక్కానించారు. భాగస్వామ్య పక్షాలతో సమస్యలు తలెత్తితే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. గడచిన ఐదేళ్లు తమ పార్టీ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా ఏనాడూ కేంద్రం సహాయం కోరలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. దసరా తర్వాత త్రిశూల్ కార్యక్రమం: పవన్ కళ్యాణ్. ప్రతి క్రియాశీలక సభ్యుడికి గుర్తింపు, నాయకత్వం, భద్రతే ప్రధాన అంశాలుగా త్రిశూల్ కార్యక్రమం. నాయకులు కావాలనే ఆశయం ఉన్న ప్రతి ఒక్కరికీ దిశానిర్దేశం చేస్తాను. ?

## తాడిపత్రికి పెద్దిరెడ్డి

అనంతపురం

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మరోసారి నియోజకవర్గంలోకి అడుగు పెట్టాలని ప్రయత్నిస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తనను తాడిపత్రి నియోజకవర్గంలోకి అడుగు పెట్టేందుకు పోలీసులు అనుమతించాలని కోరుతున్నారు. ఇప్పటి వరకూ తాను తాడిపత్రికి వెళ్లితీరతానని మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి చెబుతున్నారు. ఆయన హైకోర్టుకు వెళ్లారు. అక్కడ సింగిల్ బెంచ్ తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతించినా తర్వాత డివిజన్ బెంచ్ కు పోలీసులు వెళ్లారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వెళితే శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశముందని చెప్పడంతో డివిజన్ బెంచ్ పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతిని నిరాకరించింది. గతంలో ఇచ్చిన సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై స్టే విధించింది. తాడిపత్రిలో టీడీపీ, వైసీపీ పార్టీల మధ్య ఒక విధంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. తాడిపత్రి నియోజకవర్గంలోకి వెళ్లేందుకు తనను అనుమతించకపోవడంపై పెద్దారెడ్డి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారంలో ఉండి పోలీసులను అడ్డం పెట్టుకుని తనకు అడ్డుకుంటున్నారని పెద్దారెడ్డి ఆరోపిస్తున్నారు. గత ఎన్నికల్ల తనకు కూడా తాడిపత్రి ప్రజలు ఓట్లు వేశారన్న విషయాన్ని ఆయన గుర్తు చేస్తున్నారు. తాను తన సొంత ఇంటికి వెళ్లేందుకు అనుమతిని కూడా ఇవ్వకుండా పోలీసులతో కుమ్మక్కై ఈ ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తుందన్న ఆరోపణలను ఆయన నేరుగా చేస్తున్నారు. ఈ సమయంలో పెద్దారెడ్డి సుప్రీంకోర్టు ఉత్తర్వులతో రెండు, మూడు రోజుల్లో తాడిపత్రికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు అయితే తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మాత్రం పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే ఆయన బాధితులే అడ్డుకుంటారని హాట్ కామెంట్స్ చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి అనేక అరాచకాలు, అక్రమాలు చేశాడని, గత ప్రభుత్వంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి కోమటికుంట్లలో 180 ఎకరాలు ఆక్రమించుకున్నాడని, తాడిపత్రి అంటే తమకు ఒక దేవాలయం, తాడిపత్రి ప్రజలు తమకు దేవుళ్ళని అంటున్నారు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

## మహాకుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాల నిర్వహణ

- భారత్ స్వతంత్రంగా బలపడాలి
- ట్రంప్ సుంకాల యుద్ధం నేపథ్యంలో స్వదేశీ స్ఫూర్తితో ముందుకెళ్లాలి..
- పర్యావరణం, పర్యాటకం, ఆధ్యాత్మికంతో అడుగులు వేయాలి
- చాయ్ పే చర్చ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** ట్రంప్ సుంకాల యుద్ధం ప్రకటించిన నేపథ్యంలో భారత్ కి కొంత ఇబ్బంది ఉన్నప్పటికీ స్వతంత్రంగా ఎదగడానికి మార్గం ఏర్పడినట్లు భావించి స్వదేశీ స్ఫూర్తితో ముందుకు వెళ్లాల్సి ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ అన్నారు.బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సారథ్యం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పర్యటన 19 జిల్లాల పర్యటన ముగిసి, 20వ జిల్లా తూర్పు గోదావరి జిల్లా చేరుకున్న సందర్భంగా స్థానిక జె ఎన్ రోడ్డులోని ఆంధ్రకేసరి కాలేజీ పక్కన గల ఎన్టీఆర్ పార్కులో సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన 'చాయ్ పే చర్చ' కార్యక్రమం లో పాల్గొన్నారు. వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు. అత్యంత ప్రాశస్త్యం, తెలుగు భాషకు పుట్టినిల్లు,కందుకూరి వీరేశలింగం లాంటి వ్యక్తులు నడయాడిన నేల రాజమహేంద్రవరం...కి రావడం అదృష్టమైన భావిస్తున్నానని అన్నారు సాహిత్య స్వాతంత్ర్య సమయోధులు వారందరినీ గుర్తు చేసుకుంటూ అనేక చోట్ల సారథ్యం కార్యక్రమం లో చేపడుతున్నామన్నారు. క్షేత్ర స్థాయిలోనే చిన్న చిన్నగా మొదలైన అంశాలు ఆతర్వాత తీవ్ర ప్రభావంగా మారతాయని, ప్రపంచ యుద్ధాలు కూడా అలా జరిగినవేనని మాధవ్ చెబుతూ పల్నాటి యుద్ధం కూడా కోడి పందాల దగ్గర మాటా మాటా పెరగడం కారణంగా సంభవించిందని పేర్కొన్నారు. పరిపాలన విషయంలో గానీ మరో అంశంలో గానీ ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాల్సి ఉందని, అందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొంటూ చర్చకు ఆహ్వానించారు. చాయ్ పే చర్చ కార్యక్రమంలో పాల్గొని పలు విషయాలపై ప్రస్తావించారు. వాటిపై మాధవ్ స్పందించారు.

ఎపి రాష్ట్ర క్రెడాయ్ చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్ చర్చకు శ్రీకారం చుడుతూ ట్రంప్ సుంకాల యుద్ధం కారణం గా మనదేశంపై అలాగే



అమెరికాల స్థిరపడిన భారతీయులపై , చదువుకుంటున్న భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపించేలా ఉందని, దీన్ని ఎలా అధిగమిస్తారని అడిగారు. దీనిపై మాధవ్ స్పందిస్తూ పోక్రాన్ అణు పరీక్షల సమయంలో కూడా అమెరికా ఆంక్షలు పెట్టినప్పటికీ అప్పటి ప్రధాని వాజపేయి లెక్కచేయలేదని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా ట్రంప్ 25శాతం టాక్స్ వేసి, ఆతర్వాత 50శాతానికి పెంచేశారని, ఎక్కువగా మన ఎగుమతుల లక్ష్యంగా సుంకాలు పెంచిన నేపథ్యంలో మనం కూడా వాళ్ళ ఎగుమతుల లక్ష్యంగా మనం కూడా యోచన చేసే ఉంటుందని అన్నారు. ముఖ్యంగా దీన్నొక అవకాశంగా తీసుకుని మనదేశం స్వతంత్రంగా బలపడేందుకు మార్గంగా మలచుకోవాల్సి ఉందన్నారు.

ఆతరువాత భారత్ రైజింగ్ తరపున చైతన్య, బ్యాంకు ఎంప్లాయిస్ తరపున బివివి కొండలరావు,నూర్ భాషా సంఘం తరపున షేక్ సుభాన్,సూర్యారావు, శ్రీరామమూర్తి, తదితరులు అడిగిన ప్రశ్నలపై మాధవ్ స్పందిస్తూ మహా కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. అలాగే దేవాలయాల్లో పుణ్య తిథుల్లో అధిక రేట్లు వసూలు చేయడం గురించి దృష్టిపెట్టాల్సి ఉందని మాధవ్ అన్నారు. హైందవ శంఖారావంలో ఆలయాలకు ప్రభుత్వం నుంచి విముక్తి కల్పించాలన్న డిమాండ్ పెట్టామని ఆయన గుర్తుచేసారు. రుసుము ఎంతైనా పర్వాలేదు దర్శనం త్వరగా అయిపోతే చాలు అనే విధానం కూడా మారాలని, కాలినడకన వచ్చే భక్తులకు, నిజంగా భక్తితో వచ్చేవారికి ప్రాధాన్యత ఇచ్చేలా మార్పులు రావాలని అన్నారు. అందుకు అనుగుణంగా అయోధ్య రామ మందిర దర్శనం, ఉచిత ప్రసాద వితరణ అంశాలను ఆయన ప్రస్తావించారు. మన జీవన శైలిలో, ఆహారపు అలవాట్లలో మార్పులు రావాలన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులు పెంచుకుని, వాడుకోవాలన్నారు. అలాగే మన నదులను ప్రవిత్రంగా ఉంచుకోవా లన్నారు. పర్యావరణం, పర్యాటకం, ఆధ్యాత్మికం ఈ మూడు అంశాలతో ప్రణాళిక బద్ధంగా అడుగులు వేయాలన్నారు. అన్నిచోట్లా స్పోర్ట్స్ స్టేడియంలు ఉన్నాయని, రాజమండ్రిలో కూడా స్పోర్ట్స్ స్టేడియం కోసం కృషి సాగిస్తామని అన్నారు. ఒలంపిక్స్ కి క్రీడాకారులను ముందస్తు సిద్ధం చేసేలా కార్యక్రమాలు ఉండాలన్నారు. పోలీసు వ్యవస్థలో సంఖ్య పెరగాల్సి ఉందని, అలాగే సెక్యూరిటీ గార్డులకు వేతన విషయంలో న్యాయం జరగాల్సి ఉందని అన్నారు. కేసులు ఉన్నవాళ్లు బీజేపీలో చేరినంత మాత్రాన కేసులు పోవని, కేసులు అలాగే ఉంటాయని ఆయన చెప్పారు. కురగంటి సతీష్ స్వాగతం పలుకగా, యెనుముల రంగబాబు వందన సమర్పణ చేసారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బిజెపి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, హరిశ్చంద్ర ప్రసాద్, వేదికపై ఉన్నారు. క్రెడాయ్ ప్రతినిధులు చల్లా బాలమురళి,మన్యం సంతోష్ ఫణి కుమార్, టివిఎల్ నరసింహారావు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అలాగే బిజెపి ఓబిసి మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి గోపి, లక్ష్మీనారాయణ జవ్వార్, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్,అడబాల రామకృష్ణ, డా అనూరాధ,నీరుకొండ వీరన్న చౌదరి,అడపా వరప్రసాద్,వీరా వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## 10వార్డులో సామాజిక పెన్షన్లు పెంపిణీ


**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** సామాజిక పెన్షన్లకు శ్రీకారం చుట్టిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు.1984లో రూ.30తో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు పెన్షన్లు ప్రారంభించారని ఆయన గుర్తుచేశారు.10వ వార్డుచక్రధర్ హాస్పిటల్ పక్క వీధి...వీ.ఎల్ పురం గొయ్యి వద్ద దుర్గమ్మ అమ్మవారి ఆలయం దగ్గర సోమవారం ఉదయం సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ 1989నుంచి అయితే 1994వరకు కాంగ్రెసు పాలనలో పెన్షన్ పెంచలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2004వరకు 75 రూపాయలకు పెన్షన్ పెంచి ఇచ్చారని, 2004 నుంచి 2014వరకు కాంగ్రెస్ హయాంలో 125 రూపాయలు, ఆతర్వాత రూ 200చేసారని, అయితే 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రూ 2000లకు పెంచారని ఎమ్మెల్యే వాసు వివరించారు. 2019నుంచి 2024వరకు సీఎంగా ఉన్న జగన్మోహన్ రెడ్డి వెయ్యి రూపాయలు పెంచి రూ 3000చేస్తానని చెప్పి, ఏడాదికి రూ 250చొప్పున పెంచారని ఆయన అన్నారు. అయితే పెన్షన్ రూ 4000 చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం వెంటనే రూ 1000పెంచి నాలుగు వేల రూపాయలు చేసారని, వైసిపి మాదిరిగా మోసం చేసి, ఏడాదికి రూ 250చొప్పున పెంచలేదని ఎమ్మెల్యే వాసు వివరించారు. అలాగే వికలాంగ పెన్షన్లు రూ 3000నుంచి రూ 6000, సంపూర్ణ వైకల్యం ఉంటె రూ 5000నుంచి రూ 15000చేసి, కూటమి ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించిందని ఎమ్మెల్యే వాసు చెప్పారు. అయితే రీ వెరిఫికేషన్ పేరుతా పరిశీలించి సర్టిఫికెట్లు ఇస్తూ, ఒకవేళ ఎక్కడైనా తేడా జరిగితే మళ్ళీ అప్పీల్ చేసుకోమని అవకాశం కల్పించిన విషయం



గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. అయితే దీనిపై గత 15రోజులుగా పెన్షన్ పోయింది, పెన్షన్ తీశారు అంటూ వైసిపి వాళు ళ దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే వాసు విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి ఓటు వేయడం వలన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పెన్షన్ తీసేశారని దిగజారుడు రాజకీయం ఆడుతూ, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన వైసిపి తీరుని ఎండగట్టారు. సిటీ నియోజకవర్గంలో సుమారు 95 సచివాలయాల్లో 28వేల పెన్షన్లలో కేవలం 513పెన్షన్లు అనర్హత కింద్ నోటీసు ఇచ్చి అందులో 18ఏళ్లలోపు వయసు గల వికలాంగత్వం, మానసిక వైకల్యం గల 135మందికి నోటీసు ఉపసంహరించామని మిగిలిన 376మందిని అప్పీల్ చేయమని చెప్పమని ఎమ్మెల్యే వాసు వివరించారు. వెరిఫికేషన్ చేసి అర్హత గల ప్రతిఒక్కరికీ కూటమి ప్రభుత్వం పెన్సషన్ యిస్తుందని, ఎవరికీ అన్యాయం జరగదని ఆయన స్పష్టం చేసారు. ఇది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం అని ఆయన అన్నారు. వైసిపిలో పెన్షన్లు అదనంగా పెంచలేదు సరికదా ఉన్నవి తీసేస్తే, కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంటిపెద్ద మరణిస్తే వెంటనే అతడి భార్యకు పెన్షన్ ఇచ్చామని, ఆవిధంగా 400మందికి సిటీలో పెన్షన్లు ఇచ్చామని ఆయన అన్నారు. పెన్షన్ రాదనీ 513మందిని వైసిపి హయాంలో తిరస్కరిస్తే, మా హయాంలో అందులో ఇద్దరికి తప్ప అందరికీ ఇచ్చామని ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సిటీలో కొత్తగా 5100రైస్ కార్డులు ఇచ్చామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. వైసిపి హయాంలో కొత్తగా ఒక్క కార్డు కూడా ఇవ్వలేదన్నారు. వైసిపి అనేది అబ్బద్ధమనే పునాదులపై స్థాపించిన పార్టీ అని, అబద్ధాలు ప్రచారం చేసి భయభ్రాంతులకు గురిచేయడం వారి నైజమని చివరకు వైకల్యం ఉన్నవారితో కూడా రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే వాసు ధ్వజమెత్తారు. పెన్షన్ రాదని దుష్ప్రచారం చేయడం వలన వాళ్ళు ఎంతక్షోభ అనుభవించారో తెలీదని ఆయన ఆవేదన చెందారు. ఉచిత బస్సు ప్రయాణం కూడా మహిళలకు అమలు చేశామని ఆయన చెబుతూ దీనిపై కూడా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇచ్చిన ప్రతిహామీ కూటమి ప్రభుత్వం అమలుచేసుకుంటూ ముందుకు వెళ్తోందని ఆయన అన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం అబద్ధాన్ని నిజం చేయాలనుకునేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, కూటమి ప్రభుత్వ మేలుని గుర్తించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేసారు. కూటమి నాయకులు వై శ్రీను, చొప్పర్ల వీరభద్రరావు, వాసిరెడ్డి బాబీ, జామి సత్యనారాయణ, ఉప్పులూరి జానకి రామయ్య, బుడ్డిగ రవి, పంచికట్ల శివ ప్రసాద్, అప్పారావు, సచివాలయం సిబ్బంది, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## గందరగోళంలో రాహుల్ గాంధీ

- ఓటుచోరి చేసిన పార్టీ కాంగ్రెస్సే
- మీడియాతో చిట్ చాట్ లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** 'ఏం చేయాలో తెలియని గందరగోళంలో రాహుల్ గాంధీ ఉన్నారు.అందుకే ఓటుచోరి అంటున్నారు. నిజానికి స్వాతంత్ర్యం వచ్చాక ఓటు చోరీ చేసింది కాంగ్రెస్సే' అని మీడియా తో చిట్ చాట్ ఏపీ బీజేపీ చీఫ్ పివిఎన్ మాధవ్ అన్నారు. స్థానిక క్వారీ మార్కెట్ సెంటర్ లోని జిల్లా బిజెపి కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి,ఎమ్మెల్సీ సోము వీర్రాజు,అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బిజెపి రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, తదితరులతో కల్సి ఆయన మీడియాతో చిట్ చాట్ కార్యక్రమంలో పాల్గొని పరిచయం చేసుకున్నారు. ఎక్కువ ఓట్లు వచ్చిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ని కాదని నెహ్రూ ప్రధాని అయ్యారని, ఓటుచోరీ ఆ పార్టీకే అలవాటని ఆయన వ్యాఖ్యానించారు.ఓటు చోరీ అనడమే తప్పు ఎన్నికల సంఘం ఛాలెంజ్ చేస్తే సమాధానం లేదని మాధవ్ అన్నారు. ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లకు 10లక్షల నుంచి రూ 10కోట్ల వరకు రుణాలు ఇచ్చే ఏర్పాటు చేయడం ద్వారా పారిశ్రామిక ప్రోత్సాహం అందిస్తున్నట్లు మాధవ్ తెలిపారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 9లక్షల 70వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. ఈసందర్భంగా ట్రంప్ సుంకాల పెంపు, జీఎస్టీ స్లాబులు,చైనాతో మైత్రి వంటి అంశాలపై మీడియా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన స్పందించారు.పార్టీ నాయకులు క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్, కురగంటి సతీష్, యెనుముల రంగబాబు, నీరుకొండ వీరన్న చౌదరి, నర్శిపల్లి హారిక,రొంగలి గోపి,అడబాల రామకృష్ణ, డా అనూరాధ,అడపా వరప్రసాద్, వీరా వీరాంజనేయులు,మోది సత్తిబాబు,తదితరులు పాల్గొన్నారు.

## చిట్టి చిన్నారులకు ఆట మైదానం. నారాయణ ఇ-టెక్నోలో ప్రారంభం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఆర్యాపురం నారాయణ ఇ-టెక్నో ఆంగ్ల మాధ్యమిక పాఠశాలలో చిన్నారులకు క్రీడా ప్రాంగణం ప్రారంభోత్సవం ఎ.జి.ఎమ్ అలీషా అధ్యక్షతన ఘనంగా జరిగింది.ఈ ప్రారంభోత్సవంలో తల్లిదండ్రులు చిన్నారులతో రకరకాల ఆటలు ఆడించారు. పిల్లలు ఆటలు ఆడటంవల్లవారుశారీరక దృఢత్వంతోపాటు మానసికంగానుఅభివృద్ధి చెంది ఉత్సాహం,ఆసక్తితో పాఠశాలకు వస్తారని పేర్కొన్నారు.ఆటలు వల్ల వారిలోచిన్నతనం నుండే సహాయం చేసే తత్వం, నాయకత్వలక్షణాలు అలవడుతాయని తెలియజేసారు.విద్యార్థులు తల్లిదండ్రులు ప్రస్తుత పాఠశాలలు ర్యాంకుల కోసం పరుగులుపెడుతున్న తరుణంలో నారాయణ ఇ- టెక్నో ఆటలకు ప్రాముఖ్యం ఇవ్వడం ఆనందంగా ఉందని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శైలజ. ఆర్ అండ్. డి. హెడ్ సుశ్మిత, హస్టల్ ప్రిన్సిపల్ శేషుబాబు, జోనల్ కో- ఆర్డినేటర్ హరిత,ఈ కిడ్జ్ వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం పాల్గోన్నారు.

## ఆదిత్య కళాశాలలో వ్యాసరచన పోటీలు

- విజేతలకు సత్కారాలు
- విద్యార్థులకు నెహ్రూ యువ కేంద్రం ద్వారా సర్టిఫికెట్లు బహుకరణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** గుడ్ కేర్ హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపకురాలు మరియు చైర్‌పర్సన్ కావూరి వరలక్ష్మి తన బృందంతో కలిసి ఆదిత్య డిగ్రీ కాలేజ్ మరియు ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల లైబ్రరీ హాళ్లలో వ్యాసరచన,వాగ్వాద పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమం మై భారత్ %-%ఈస్ట్ గోదావరి "ఎక్ పెడ్ మా కె నామ్" క్యాంపైన్ 2025%-%26లో భాగంగా జరిగింది. పాల్గొన్న విద్యార్థులకు నెహ్రూ యువ కేంద్రం ద్వారా సర్టిఫికెట్లు అందజేయగా,మొదటి, రెండవ,మూడవ స్థానాల్లో విజేతలకు మిమెంటోలు అందజేశారు.ఈ కార్యక్రమాన్ని రక్తదాత ప్రభాకర్,సొసైటీ సభ్యులు కుసుమ,కె.సురేశ్ కుమార్ సమన్వయం చేయగా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. జి.వి.ఎస్.నాగేశ్వర రావు,పోలుకొండ సాయి, ఎ.సిరిషా,డా.బి.హెచ్.వి. రామదేవి పర్యవేక్షించారు.

## కన్నులపండువగా శ్రీవెంకటేశ్వరస్వామివారి కల్యాణం



**రాజమహేంద్రవరం విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక 23వ వార్డు నందివాడవారి వీధిలోని శ్రీ వజ్ర గణపతి ఆలయ మందిరం శ్రీ లక్ష్మీ గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగాసోమవారం రాత్రి శ్రీ వెంకటేశ్వరస్వామివారి కల్యాణం కన్నులపండువగా జరిగింది.పూసరపు వీరేంద్రకుమార్ ఆషా దంపతులు, పొత్తూరి వెంకట సత్యనారాయణ సుమ దంపతులచే పురోహితులు శ్రీవారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.అనంతరం శ్రీనిధి భజన మండలిచే గానామృతం,భజన కార్యక్రమం జరిగింది. ఉదయం నాగుమిల్లి గుప్తా (రాంబాబు)శిరీష దంపతులు, నాగుమిల్లి శ్రీనివాస్ హేమలత దంపతులు, వి.ఎం.రామ్మూర్తి విజయలక్ష్మి దంపతులు నిత్య పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కన్నులపండువగా జరిగిన కల్యాణాన్ని తిలకించారు. స్వామివారికి ఏకదశ హారతులు ఇచ్చిన అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు చందా సత్రం మాజీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ,పేరూరి మహేంద్రనాథ్ సరిదే ధన వెంకటేశ్వరరావు కనమర్లపూడి చంద్రకాంత్ మారడుగుల సుబ్బయ్య వానపల్లి మురళీకృష్ణ నంబూరి కృష్ణ చైతన్య సోమిశెట్టి భీమేశ్వరరావు జ్యోతిరామ్ విఠల్ మోరే,వాకచర్ల భరత్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భుజం నొప్పికి కండరాల అసమతుల్యత కారణం కావచ్చు

-ఫిజియోథెరఫిస్ట్ డాక్టర్ భరత్



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** భుజం నొప్పికి ఎముక,కీళ్ల సమస్యల నుండి కండరాల అసమతుల్యత , కాలేయం పతనం కారణం కావచ్చని ప్రముఖ ఫిజియోథెరఫిస్ట్ డాక్టర్ భారత్ ఊటాల అన్నారు. నొప్పిని తాత్కాలికంగా తగ్గించుకోవడం కాకుండా, అసలు మూల కారణాన్నిగుర్తించి చికిత్స చేయడం ముఖ్యమని ఆయన సూచించారు.డాక్టర్ ఆచార్యులు వరద మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజమండ్రి లోని హోటల్ మంజీరలో ఆదివారం నిర్వహించిన వైద్య సదస్సులో మధుమేహంలో ఫిజియోథెరపీ ఇన్ ఫ్రోజెన్ షోల్డర్ " అనే అంశం పై డాక్టర్ భారత్ ఊటాల ప్రసంగించారు. ఫ్రోజెన్ షోల్డర్ సమస్య ఎడ్హెసివ్ క్యాప్సులైటిస్ వలన వస్తుందని, కానీ కండరాల ట్రిగ్గర్ పాయింట్లతో సహితం ఇలాంటి ప్రభావాలను చూడవచ్చునని , ప్రతి భుజం సమస్య ఫ్రోజెన్ షోల్డర్ లేదా రొటేటర్ కఫ్ టియర్గా ఉండనవసర%శీ% లేదని భరత్ స్పష్టం చేసారు. ఓవర్ హెడ్ కదలిక (వెనకకు చేతిని ఎత్తడం) పరిమితమవటం తప్పనిసరిగా గ్లెనోహ్యూమరల్ జాయింట్ ఫిక్సేషన్ వల్ల మాత్రమే కాదని ఎసి జాయింట్ డిస్‌ఫంక్షన్, ఎస్ సి జాయింట్ డిస్‌ఫంక్షన్, పెక్టోరాలిస్ మైనర్ కండరాల ట్రిగ్గర్ పాయింట్లు, కొరాకోబ్రాచియాలిస్ కండరాల టైట్‌నెస్, సబ్‌స్కేపులారిస్ కండరాల ట్రిగ్గర్ పాయింట్లు, లాటిస్సిమస్ డోర్సీ కండరాల టైట్‌నెస్, లివర్ ప్టోసిస్ (కాలేయం పతనం) తదితర కారణాలు కావచ్చని ఆయనపేర్కొన్నారు.ఆధునిక చికిత్స విధానంలో ఫిజియోథెరపీ సమర్థవంతమైన పాత్ర వహిస్తున్నదని భవిష్యత్ లోనూ ఇది కీలకం కానుందని భరత్ అన్నారు. ప్రముఖ ఎముకుల వైద్య నిపుణులు డాక్టర్ దుద్దుపూడి రామారావు ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించారు. నగరంలోని పలువురు వైద్యులు, వైద్యవిద్యార్థులు ఈ సస్సులో పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ....




**కాకినాడక్రైమ్ :విశ్వం వాయిస్ న్యూస్** పిజిఆర్ఎస్ కార్యక్రమమునకు 48 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను జిల్లా ఎస్పీకి స్వయంగా తెలియచేసుకున్నారు. ప్రజల నుండి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించవలసిందిగా ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాలలోను, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని, ఆ ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి, సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

మంగళవారం 2 సెప్టెంబర్ 2025
www.viswamvoice.com
ఎడిటోరియల్
విశ్వంవాయిస్
VISWAMVOICE TELUGU DAILY

## ఎడిటర్ వాయిస్

# సంప్రదాయానికి ప్రతీక కొబ్బరి

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 2న ప్రపంచ కొబ్బరి దినోత్సవం నిర్వహిస్తారు. జీవన వృక్షం అని ప్రసిద్ధి చెందిన కొబ్బరి చెట్టు ప్రాధాన్యతను చాటడం, దాని ఆధారంగా జీవనోపాధి సాగిస్తున్న కోట్లాది మంది రైతుల కృషిని గుర్తించడం, పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడడం ఈ దినోత్సవం వెనుక ప్రధాన ఉద్దేశ్యం. ఆసియా పసిఫిక్ కొబ్బరి సమాజం అనే అంతర్జాతీయ సంస్థ 1999లో స్థాపించ బడింది. దీనిని పురస్కరించుకుని 2009లో మొదటి.సారిగా ప్రపంచ కొబ్బరి దినోత్సవం జరుపు కున్నారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ 2న దీన్ని గుర్తుగా పాటిస్తున్నారు. ఈ సంస్థలో ఆసియా పసిఫిక్ ప్రాంతానికి చెందిన 18 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. కొబ్బరి పంట ఉత్పత్తి, వినియోగం, అంతర్జాతీయ మార్కెట్ విస్తరణ, రైతుల ఆదాయాభివృద్ధి లక్ష్యాలతో ఈ వేదిక ఏర్పడింది. కొబ్బరి చెట్టును కల్పవృక్షం అని పిలవడానికి కారణం దాని ప్రతి భాగం ఉపయోగకరమై ఉండడమే. వేర్లు, కాండం, ఆకులు, పండు అన్నీ మానవ జీవితానికి ఉపయోగ పడతాయి. కొబ్బరి నీరు సహజమైన ఎలక్ట్రోలైట్‌లకు నిలయం. 100 మిల్లీ లీటర్ల కొబ్బరి నీటిలో సుమారు 19 క్యాలరీలు, 4 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 250 మిల్లీ గ్రాముల పొటాషియం, 25 మిల్లీ గ్రాముల సోడియం ఉంటాయి. క్రీడాకారులకు, శ్రమతో జీవించే వారికి ఇది సహజ శక్తినిస్తుంది. కొబ్బరి నూనెలో 90 శాతం మధ్యస్థ శృంఖల కొవ్వు ఆమ్లాలు (%వీజుం%) ఉంటాయి. వీటిలో లౌరిక్ ఆమ్లం శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. కొబ్బరి పాలు విటమిన్ సి, ఇ, బి కంప్లెక్స్, ఇనుము, మగ్నీషియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలతో నిండిపోయి ఉంటాయి. కొబ్బరి తురుము మిఠాయిలు, వంటకాల్లో రుచిని పెంచడమే కాకుండా అధిక ఫైబర్‌తో జీర్ణక్రియకు తోడ్పడుతుంది. కొబ్బరి చెట్టు ఆకులను గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల పైకప్పుల కోసం, చాపలు, ముట్టెలు తయారీకి ఉపయోగిస్తారు. పీచు నుండి తాడులు, గోనె సంచులు, పరుపులు, బ్రష్‌లు తయారవుతాయి. తాటి కాండంతో గృహోపకరణాలు, ఫర్నిచర్ తయారు చేస్తారు. చిప్పలను బయోమాస్ ఇంధనంగా వినియోగిస్తారు. కొబ్బరి చెట్టు వాణిజ్య, పారిశ్రామిక, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా అమూల్యమైన వనరుగా నిలుస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి సుమారు 6.3 కోట్ల మెట్రిక్ టన్నుల కొబ్బరి ఉత్పత్తి అవుతుంది. ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, భారతదేశం మూడు ప్రధాన ఉత్పత్తి దారులు. వీటి లోనే ప్రపంచ ఉత్పత్తిలో 70 శాతం వస్తుంది. భారత దేశం రెండవ అతిపెద్ద ఉత్పత్తిదారు. 2023 గణాంకాల ప్రకారం దేశంలో 21 లక్షల హెక్టార్లకు పైగా కొబ్బరి సాగు విస్తరించి ఉంది. సంవత్సరానికి సుమారు 1.9 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. కేరళ ఒక్కదాని లోనే దేశీయ ఉత్పత్తిలో 40 శాతం వస్తుంది. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, గోవా కూడా ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాలు. దేశ వ్యాప్తంగా సుమారు 20 కోట్ల ప్రజలు ప్రత్యక్ష, పరోక్షంగా కొబ్బరి ఆధారిత జీవనోపాధిపై ఆధారపడి ఉన్నారు. కొబ్బరి ఉత్పత్తుల ద్వారా భారత దేశం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదిస్తోంది. కోయిర్ ఉత్పత్తులు, కొబ్బరి నూనె, ఎండు కొబ్బరి, కొబ్బరి నీటితో తయారైన పానీయాలు, హ్యాండ్‌క్రాఫ్ట్ ఎగుమతుల్లో ప్రధాన భాగం. కేవలం కోయిర్ ఉత్పత్తుల ద్వారానే 2022%-%23 ఆర్థిక సంవత్సరంలో సుమారు 4,340 కోట్ల రూపాయల ఎగుమతులు జరిగాయి. ఈ పరిశ్రమలో లక్షలాది మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. అయితే కొబ్బరి పరిశ్రమకు సవాళ్లు తక్కువ కావు. దేశ వ్యాప్తంగా పంటలో 30 శాతం చెట్లు వయసు పైబడినవే. దిగుబడి తగ్గిపోవడం సహజం. కొత్తగా నాటే మొక్కలకు ప్రోత్సాహక పథకాలు అవసరం. కొబ్బరి చెట్లకు రూట్ విల్ట్, బ్లాక్ హెడ్, కీటకాల దాడి వంటి వ్యాధులు ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తాయి. మార్కెటింగ్ సౌకర్యాల లేమి, శ్రామికుల కొరత రైతుల సమస్యలలో ముఖ్యమైనవి. ఒక చెట్టుపైకి ఎక్కి కాయలు కోయగల నైపుణ్యం కలిగిన శ్రామికులు రోజురోజుకూ తగ్గిపోతున్నారు. దీంతో రైతులు అధిక ఖర్చులు పెట్టాల్సి వస్తోంది. ప్రపంచ కొబ్బరి దినోత్సవం ఈ సమస్యలను గుర్తించడానికి,



ఎడిటర్: కె. సునీల్‌కుమార్

# జలియన్ వాలాబాగ్‌ను తలపించిన పరకాల మారణ హోమం



దేశమంతా స్వాతంత్ర దినోత్సవ సంబరాలు జరుపుకుంటూ ఉంటే, తెలంగాణ రాష్ట్రం మాత్రం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతోన్న సమయమది. బానిస బతుకులతో తెలంగాణ ప్రజల రక్తం ఉడికిపోయిన కాలమది. తెలంగాణ సాయుధ పోరాటంగా మొదలైన పోరు బాట, చాకలి ఐలమ్మతో మొదలైన తిరుగుబాటు, పేద రైతులు భూమి కోసం, భుక్తి కోసం జరిగిన పోరులో ఎందరో బలైన సందర్భమది. స్వాతంత్ర్యం వచ్చాక హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం చేసే క్రమంలో ఎన్నో ఘటనలు జరిగిన నేపథ్యమది. 76 ఏళ్ళ క్రితం నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ, దేశ సాధికారికతను, సార్వభౌమాధికారికతను ప్రకటించే చర్యగా జాతీయ పతాకాన్ని ఎగుర వేసే క్రమంలో రజాకార్ల కాల్పులకు పోరాట యోధులు బలైన దుర్ఘటన అది. 1947లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చాక, నిజాం రాజ్యంలోనూ జాతీయ పతాకం ఎగురవేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. వాటిని అణగ దొక్కేందుకు రజాకార్లు ఎన్నో అకృత్యాలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో తెలంగాణ వ్యాప్తంగా వందల మంది ప్రాణాలు కోల్పోయారు. వాళ్ల వీరోచిత పోరాటానికి నిలువెత్తు నిదర్శనం వరంగల్ జిల్లా పరకాలలో రజాకార్లు జరిపిన మారణ హోమం. జలియన్ వాలాబాగ్ ఘటనను తలపించేలా, పరకాలలో జరిగిన మారణ హోమం, పోరుగడ్డ మీద పరకాల వీరులు చిందించిన నెత్తుటి జ్ఞాపకం. భారత దేశానికి 1947 ఆగస్టు 15 న స్వాతంత్ర్యం వచ్చింది.. కానీ తెలంగాణ ప్రాంతం మాత్రం నిజాం, రజాకార్ల పాలనలోనే ఉంది. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రాంతంలో తిరుగుబాటు మొదలైంది. 1945-46 ... తెలంగాణ ప్రాంతంలో సాయుధ రైతాంగ పోరాటం జరుగుతున్న కాలం అది. వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, భూమి కోసం దొరలపైన కమ్యూ నిస్టులు, కాంగ్రెస్ నేతల అధ్వర్యంలో పోరు తీవ్ర స్థాయిలో జరుగుతోంది. నిజాం తన అధికారం చేజారుతోందని భావించి, ప్రైవేటు సైన్యమైన రజాకార్లను ఖాసిం రిజ్వీ నాయకత్వంలో నియమించారు. రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా తెలంగాణ గ్రామాల్లోని ప్రజలు సాయుధ పోరు బాట పట్టారు. 1947 ఆగస్టు 15న బ్రిటీష్ పాలన నుంచి భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 2న పరకాలలో జాతీయ పతాకం ఎగుర వేయలని నిర్ణయించారు. పోలీసులు వరంగల్ జిల్లాలో అన్ని సమావేశాలను నిషేధించారు. సెప్టెంబర్ 2న జాతీయ పతాకం ఎగుర వేసేందుకు సమీప గ్రామాల నుండి 1,500 మందికి పైగా ప్రజలు వచ్చారు. వందల సంఖ్యలో జనాలు పరకాల లోని చాపల బండ చేరుకున్నారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన రజాకార్లు కత్తులు, బరిసెలు, తల్వార్లతో ఉద్యమకారులను వెంబడించి విచక్షణా రహితంగా నరికివేశారు. రజాకార్ల కాల్పుల్లో అక్కడికక్కడే 15 మంది మృతి చెందారు. 22మంది అసువులు బాసారు. వేలాదిమంది క్షత గాత్రులయ్యారు. రాత్రికి రాత్రి రజాకార్లు ఇళ్లలోకి చొరబడ్డారు. ఆడవారిపై అత్యాచారాలు చేశారు. అంతే కాదు పరకాలకు దగ్గరలోనే ఉన్న రంగాపూరు గ్రామంలో జెండా ఎగురవేసే ప్రయత్నం చేసిన ముగ్గురిని చెట్టుకు కట్టేసి కాల్చేశారు. బెహరాన్ పల్లిలో కూడా రజకార్లు మారణకాండ సృష్టించారు. ఉద్యమ కారులు ఆకుతోట మల్లయ్య, వడ్డెపల్లి వీరయ్య, రాజా మహ్మద్‌లను రంగాపురంలో చెట్టుకు కట్టి ఊచకోత కోసి కాల్చి చంపేశారు. నాటి రజాకార్ల దురాఘాతానికి వందలాదిమంది చనిపోయారని ప్రచారంలో ఉన్నా.. 96 మంది చనిపోయినట్టు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. 1947, సెప్టెంబర్ 2న జరిగిన ఈ దురాగతం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. నిజాం నిరంకుశపాలన కూల్చి వేయడానికి నాంది పలికింది. 1948 సెప్టెంబరు 13న ప్రారంభమైన ఆపరేషన్ పోలో, సెప్టెంబర్ 17న నిజాం సైన్యం లొంగిపోవడంతో ముగిసింది. హైదరాబాద్ సంస్థానాన్ని భారత ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు పరకాల ఘటనను దక్షిణాది జలియన్ వాలాబాగ్‌గా వర్ణించారు. మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న సమయంలో ఆయన తల్లి చెన్నమనేని చంద్రమ్మ జ్ఞాపకార్థంగా పరకాలలో 1998లో పరకాలలో అమరధామం పేరిట ఓ నిర్మాణం చేపట్టారు. జలియన్ వాలాబాగ్ ఘటనను తలపించే పరకాల నెత్తుటి జ్ఞాపకమే అమరధామం. దాన్ని బీజేపీ సీనియర్ నేత లాల్ కృష్ణ అద్వానీ ఆవిష్కరించారు. ఏటా అమరధామం వద్ద స్థానిక ప్రజలు అమరవీరులకు నివాళులు అర్పిస్తారు.

# జన హృదయ నేత వై.యస్



యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి (జూలై 8, 1949 - సెప్టెంబర్ 2, 2009) ఆంధ్ర ప్రదేశ్ 16వ ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ పార్టీ నాయకునిగా, ప్రత్యేక గుర్తింపు పొందిన జన హృదయ నేత. తల పండిన నేతలను తల దన్నిన వ్యూహ రచనా దురంధరుడు ఆయన. మునిగి పోతున్న కాంగ్రెస్ నావను ఒంటి చేత్తో దరికి చేర్చిన రథ సారథి ఆయన. రాజకీయాలకు సరి కొత్త అర్థం చెప్పిన చాణక్యుడు వై.యస్...రాజశేఖర్ రెడ్డి 1949 జూలై 8న జమ్మల మడుగు లోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ మిషన్ ఆసుపత్రిలో జన్మించా డు. ఆయన తల్లిదండ్రులు జయమ్మ, రాజారెడ్డి. ఆయన తండ్రి బళ్ళారిలో కాంట్రాక్టరుగా పనిచేస్తుండటం వల్ల ఆయన పాఠశాల చదువంతా బళ్ళారి లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో సాగింది. ఆ తర్వాత విజయవాడ లయోలా కళాశాలలో చేరారు. 1972లో గుల్బర్గా విశ్వ విద్యాలయం నుంచి వైద్య విద్యలో పట్టా పుచ్చు కున్నారు. గుల్బర్గాలోని మహాదేవప్ప రాంపూరే వైద్య కళాశాలలో వైద్యవృత్తిని అభ్యసిస్తుండగానే కళాశాల విద్యార్థి సంఘానికి అధ్యక్షు డిగా వ్యవహరించారు. శ్రీ వెంకటేశ్వర వైద్యకళాశాల (యెస్.వి.ఆర్.ఆర్), తిరుపతి నుంచి హౌస్ సర్జన్ పట్టా పొందారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల వైపు ఆకర్షితుడైన రాజశేఖరరెడ్డి యెస్.వి.ఆర్.ఆర్ కళాశాలలో పని చేస్తుండగానే అక్కడ హౌస్‌సర్జన్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తరువాత కొద్ది రోజుల పాటు జమ్మల మడుగులోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ ఆసుపత్రిలో వైద్య అధికారిగా పనిచేశారు. ఆ తరువాత 1973లో పులివెందులలో తండ్రి వై.ఎస్.రాజారెడ్డి పేరుతో కట్టించిన 70 పడకల ఆసుపత్రిలో వైద్యుడిగా పని చేశారు. ఆ ఆసుపత్రి ఇప్పటికీ పనిచేస్తూనే ఉంది. వాళ్ళ కుటుంబం పులివెందులలో ఒక పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాలను కూడా నెల కొల్పారు. తరువాత వాటిని లయోలా సంస్థలకు అప్పగించారు. పులివెందుల దగ్గరిలో ఉన్న సింహాద్రి పురంలో ఉన్న కళాశాలను మాత్రం ఇప్పటికీ వీరి కుటుంబమే నిర్వహిస్తోంది. కళాశాల దశ నుంచే రాజకీ యాలపై ఆసక్తి చూపిన రాజశేఖరరెడ్డి 1980-83 కాలంలో రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి పదవిని నిర్వహించారు. కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి 4 సార్లు ఎన్నికయ్యారు. పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గం నుంచి 6 సార్లు విజయం సాధించారు. రాష్ట్ర శాసన సభ ప్రతిపక్ష నేతగా, రెండు సార్లు రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రేస్ కమిటీ అధ్యక్షుడిగా పని చేశారు. 1980 నుంచి 1983 దాకా గ్రామీణాభివృద్ధి, వైద్యశాఖ, విద్యాశాఖ మొదలైన కీలకమైన మంత్రి పదవులను నిర్వహించారు. తెలుగు దేశం నేత నారా చంద్రబాబు నాయుడు మొదటగా కాంగ్రెస్ లో ఉన్నపుడు ఇరువురూ మంచి మిత్రులు. 1985 నుంచి 1998 వరకు పార్టీలో వై.ఎస్. నిత్య అసమ్మతి వాదిగా పేరు పడ్డారు. కాంగ్రెస్ ముఖ్య మంత్రులు అందరితో ఆయన పోరాటం చేయాల్సి వచ్చింది. 1989-94 మధ్య కాలంలో ముఖ్యమంత్రి కావాలని ప్రయత్నించినా సాధ్య పడలేదు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి నేతలతో ఆయన రాజకీయ యుద్ధమే చేశారు. వారికి వ్యతిరేకంగా క్యాంపులు నడిపారు. మర్రి చెన్నారెడ్డిని, నేదురుమిల్లి జనార్ధన్‌రెడ్డిని పదవినుండి తొలగించడానికి ప్రధాన కారణమైన హైదరా బాదు నగరంలో జరిగిన అల్లర్లలో రాజశేఖర్ రెడ్డి వర్గపు పాత్ర ఉందన్న ఆరోపణలు వచ్చాయి. అదే తాను ముఖ్య మంత్రి అయ్యేనాటికి అలాంటి శిబిరాలు లేని పరిస్థితిని సృష్టించు కోగలిగారు. రాజకీయాల్లో ముక్కు సూటి తనానికి, నిర్మొహమాట ధోరణికి రాజశేఖరరెడ్డి నిలువెత్తు నిదర్శనం. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి రెండు సార్లు పనిచేశారు. తొలిసారి 1983 నుంచి 1985 వరకు, రెండో పర్యాయం 1998 నుంచి 2000 వరకు ఆ పదవిలో ఉన్నారు. 1999 నుంచి 2004 వరకు 11 వ శాసన సభలో ప్రతిపక్ష నేతగానూ వ్యవహ రించారు. 2003 వేసవి కాలంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో పాద యాత్ర చేపట్టి 1,467 కిలోమీటర్లు పర్యటించారు. పాదయాత్ర వలన వ్యక్తిగతంగా వైఎస్.కు మంచి జనాదరణ లభించడమే కాకుండా ఆ తదుపరి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహద పడింది. 2004 మేలో జరిగిన 12వ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు సాధించడంతో అది వరకే పార్టీలో పేరు సంపాదిం చిన వై.ఎస్. ఆర్. ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు. పాద యాత్ర వలన జనాదరణ పొందడమే కాకుండా ఎన్నికల ప్రచారంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, పెండింగులో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తిచేయటం, జలయజ్ఞం లకు ప్రాధాన్యం ఇవ్వడంతో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన పిదప తొలి సంతకం ఉచిత విద్యుత్తు ఫైలు పైనే చేశారు. 2009 ఏప్రిల్లో జరిగిన 13వ శాసనసభ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలలో విజయం సాధించడానికి కృషిచేసి వరుసగా రెండో పర్యాయం ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. 2009 ఏప్రిల్‌లో జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముందుండి నడిపించడమే కాకుండా శాసన సభలో 156 స్థానాలతో పూర్తి మెజారిటీని సంపాదించి పెట్టారు. అదే సమయంలో లోక్‌సభ ఎన్నికలలో 33 స్థానాలలో విజయం సాధించడానికి కృషి చేశారు. వై.యస్.రాజశేఖర రెడ్డి చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సి.ఎస్.ఐ) అనే చర్చికి చెందిన ప్రొటెస్టెంటు క్రైస్తవుడు. ఆయన తొలిసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత 2004లోనూ, మరలా 2009లోనూ కుటుంబ సమేతంగా బెత్లహేము యాత్రకు వెళ్ళి వచ్చారు. క్రైస్తవులైనా పారంపరికంగా వచ్చిన హిందూ సంప్రదాయాలని వీడలేదు. రాజశేఖరరె డ్డి తిరుమలను అనేకమార్లు సందర్శించి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకొని పూజలు చేశారు. సెప్టెంబర్ 2, 2009 న చిత్తూరు జిల్లా పర్యటనకు అననుకూల వాతావరణంలో బయలు దేరగా ఉదయం గం.9.35 నిమిషాలకు హెలి కాప్టరుతో సంబంధాలు తెగిపోయాయి. ముఖ్యమంత్రి ఆచూకీ కోసం గాలించగా 25 గంటల తరువాత ప్రమాదానికి గురైన హెలికాప్టర్ ఆనవాళ్ళు లభించాయి. వై.ఎస్.తో సహా మొత్తం ఐదుగురు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. తమ అభిమాన నాయకుని మరణాన్ని జీర్ణించు కోలేక రాష్ట్ర మంతా దాదాపు 67 మంది మరణించారు. వీరిలో చాలా మంది గుండె ఆగి మరణించగా కొద్ది మంది ఆత్మహత్య చేసుకున్నారు. రాజ శేఖర్ రెడ్డి ఎన్నో పదవులు అనుభవించారు. 1975లో యవజన కాంగ్రెస్ కార్యదర్శిగాబీ 1980లో తొలి సారిగా రాష్ట్ర మంత్రి వర్గంలో గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగాబీ 1982లో రాష్ట్ర మంత్రివర్గంలో ఎక్సైజ్ శాఖా మంత్రిగాబీ 1982లో రాష్ట్ర మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా 1983లో పిసిసి అధ్యక్షుడిగా నియమించ బడ్డాడు (1985 వరకు). 1998లో రెండోసారి పిసిసి అధ్యక్షుడిగా నియామకం (2000 వరకు)బీ 1999లో శాసనసభ ప్రతిపక్ష నేతగాబీ 2004లో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. 2009లో రెండో పర్యాయం ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఇక 1978లో పులివెందుల నుంచి తొలిసారి శాసన సభ్యుడిగాబీ 1983లో పులివెందుల నుంచి రెండోసారిబీ 1985లో వరుసగా మూడవ సారి శాసనసభ్యుడిగా హాట్రిక్ విజయం సాధించారు. 1989లో కడప నియోజకవర్గం నుంచి తొలిసారి లొకసభ సభ్యుడిగాబీ 1991లో కడప నియోజకవర్గం నుంచి రెండో సారిబీ 1996లో వరుసగా మూడవసారి గెలుపొంది హాట్రిక్ సాధించారు. అలాగే 1998లో కడప నుంచి వరుసగా నాలుగవసారి ఎంపీగాబీ 1999లో పులివెందుల నుంచి నాలుగవ సారి ఎమ్మెల్యేగాబీ 2004లో పులివెందుల నుంచి ఐదవసారి శాసనసభ్యుడిగా విజయం సాధించారు. 2009లో పులివెందుల నుంచి రెండోసారి హాట్రిక్ విజయం, శాసన సభ్యుడిగా ఆరవసారి గెలుపొందారు.

విశ్వంవాయిస్ తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
మంగళవారం 2 సెప్టెంబర్ 2025
www.viswamvoice.com




## మోడీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** సోమవారం భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా మాజీ జిల్లా అధ్యక్షురాలు చిలకమర్రి కస్తూరి ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ మాతృమూర్తి ని కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భంగా అమలాపురం గడియార స్తంభం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యాజీ వేమా మాట్లాడుతూ మోడీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణలు చెప్పాలని అన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలను సమాజం కచ్చితంగా తిప్పి కొడుతుందని హెచ్చరించారు. నల్లా పవన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రధానికి ఆయా దేశ అధ్యక్షులు ప్రజలు నీరాజనం పడుతుంటే రాహుల్ గాంధీ మోడీ తల్లి పై అనుచిత వ్యాఖ్యలు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మోడీ తల్లి చాలా పేద కుటుంబంలో తన జీవితాన్ని గడిపారని, తన పిల్లలను అత్యున్నత విలువలతో పెంచారని అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దీనిని దేశ ప్రజలు ఎప్పటికీ సహించరు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అత్యంత దిగజారింది అన్నారు. రాహుల్ గాంధీ వెంటనే మోడీకి, ఆయన తల్లికి బహిరంగ క్షమాపణలు చెప్పక పోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్ లో ఎస్సై కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నారీ శక్తి కన్వీనర్ చిట్టూరి రాజేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి శ్రీనివాసరావు, అమలాపురం పట్టణ అధ్యక్షులు అయ్యల భాషా, అయినవిల్లి మండలం అధ్యక్షులు యనమదల వెంకటరమణ, మహిళా మోర్చా రాష్ట్ర సెక్రటరీ ఆకుమర్తి బేబీరాణి, రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులు యనమదల రాజ్యలక్ష్మి, జిల్లా సెక్రటరీ మోకా ఆదిలక్ష్మి, యువమోర్చ రాష్ట్ర సెక్రటరీ కాలాబత్తుల చిన్నారి, మాజీ జిల్లా ఉపాధ్యక్షురాలు తలాటం అమ్మాజి, అల్లాడి మరియమ్మ, కె.దుర్గ, వరదా మరియమ్మ, అమలాపురం పట్టణ ఉపాధ్యక్షులు కె.వెంకట్, రూరల్ అధ్యక్షులు బొంతు శివాజీ, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్ గౌడ్, కె.నారాయణ మూర్తి, ఎ.భాస్కర్ రావు, వై.శకుంతల, వరదా క్రిష్ణారావు, అల్లవరం మండల అధ్యక్షులు నారాయణ మూర్తి పాల్గొన్నారు.

## త్రిశూల వ్యూహంలో పవన్

**విజయవాడ :** జనసేన ఫ్యూచర్ రాజకీయాల గురించి తన అంతరంగాన్ని బయటపెట్టారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. అందుకు టైమ్ ఫిక్స్ చేసుకున్నారు. కేవలం తనకు దశాబ్దంపాటు సమయం ఇవ్వాలని పార్టీ కార్యకర్తలను ఆయన కోరారు. ఇంతకీ పవన్ అసలు టార్గెట్ వైసీపీ అని అంటున్నారు. ఇందుకు కారణాలు లేకపోలేదు. చీటికి మాటికీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పార్టీ కార్యకర్తలను ఒక్కటే కోరుతున్నారు. దశాబ్దంపాటు కూటమి బంధం బలంగా ఉంటుందని చెబుతున్నారు. దశాబ్ద కాలం తనకు సమయం ఇవ్వాలని, మిమ్మల్ని నాయకులుగా, దేశ నిర్మాణంలో కీలక వ్యక్తులుగా తీర్చిదిద్దే బాధ్యత తనది అని చెప్పుకొచ్చారు. ఈలోగా ఏపీలో అభివృద్ధి ఒక లెవల్‌కి వస్తుందన్నది కొందరు నేతల మాట. పార్టీ కూడా బలంగా తయారు అవుతుందని, అప్పుడు సొంతంగా పోటీ చేయాలన్నది జనసేనాని ఆలోచనగా చెబుతున్నారు. ఈ దశాబ్దం పాటు రాజకీయాలు ఏవిధంగా ఉంటాయన్నది కూడా వివరించారు. దసరా తర్వాత 'త్రిశూల్' కార్యక్రమం మొదలుపెడుతున్నట్లు మనసులోని మాట బయటపెట్టారు పవన్ కళ్యాణ్. ప్రతి క్రియాశీలక సభ్యుడికి గుర్తింపు, నాయకత్వం, భద్రతే ప్రధాన అంశాలుగా ఆ కార్యక్రమం ఉండబోతుందని వెల్లడించారు. మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్ దిశగా అడుగులు వేస్తున్నారు. గ్రామం మొదలు నియోజకవర్గం, పార్లమెంటు, జిల్లా, రాష్ట్ర స్థాయి బలమైన శక్తిగా పార్టీని ఎదిగించాలన్నది జనసేన ఆలోచన. బాధ్యతలు మోయడంలో కుటుంబాన్ని విస్మరించానని, సినిమాలపై సరిగా దృష్టి పెట్టలేదన్నారు పవన్ కల్యాణ్. అన్నీ వదిలేశానేమో కానీ జన సైనికులు, వీర మహిళలపై సంపూర్ణ దృష్టి పెట్టానన్నారు. దాని ఫలితం దేశంలో ఘనమైన విషయం సాధించామన్నారు. 100 శాతం విజయం సాధించడమంటే ఆషామాషీ కాదన్నారు. నాయకులు కావాలనే ఆశయం ఉన్న ప్రతి ఒక్కరికీ దిశానిర్దేశం చేస్తానన్నారు. దేశ నిర్మాణం కోసం, బలోపేతం కోసం కలిసి అడుగులు వేద్దామన్నారు. అన్నట్లు జనసేన సభకు జాతీయ పార్టీ లుక్ వచ్చింది. పార్టీ కార్యక్రమం కోసం జనసేన కార్యకర్తలు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీగా తరలి వచ్చారు. ఒడిషా, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు. వారిలో కర్ణాటక కార్యకర్తలు ఆ రాష్ట్ర జెండాను తీసుకొచ్చారు. జనసేన జెండాలతో

# పీజీఆర్ఎస్ అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి





### కాకినాడ జిల్లా ప్రత్యేక అధికారి జి.వీరపాండ్యన్...

**కాకినాడ కలెక్టరేట్:విశ్వం వాయిస్ న్యూస్** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారాలు అందించాలని కాకినాడ జిల్లా ప్రత్యేక అధికారి జి.వీరపాండ్యన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి జి.వీరపాండ్యన్, జేసీ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ మానీషబీ జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసు, సీపీవో పీ త్రినాథ్, ఎస్ఎస్ఏ పీవో వేణుగోపాల రావు తదితర అధికారులు హాజరై, కాకినాడ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఆన్ లైన్ సమస్యలు వంటి అంశాలకు చెందిన మొత్తం-517 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కింద ఆయా శాఖల్లో నమోదైన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆయన తెలిపారు. జిల్లా స్థాయి అధికారి ఆడిట్ చేసి నివేదిక పంపించిన తర్వాత వాటిని రాష్ట్రస్థాయిలో ఆడిట్ కి పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఒకే అంశంపై మరల మరల దరఖాస్తులు నమోదు అవుతున్న అంశాలపట్ల అధికారులు దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన అర్జీదారులు తమ అర్జీలను (మీకోసం.ఏపీ.జివోవి.ఇన్) వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీదార్లు తమ యొక్క అర్జీల నమోదు, అర్జీల ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

**.....విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్ టాప్ లను పంపిణీ చేసిన జిల్లా ప్రత్యేక అధికారి వీరపాండ్యన్...**

సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ నిధులు రూ.4,05,000 వేలతో రూ. 9 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.45 వేల ఖరీదైన ల్యాప్ టాప్ లను కాకినాడ జిల్లా ప్రత్యేక అధికారి వీరపాండ్యన్.. జేసీ రాహుల్ మీనా, డీఆర్వో వెంకటరావు, విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ ఎవై.శ్రీనివాసు ఇతర అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ద్వారా అర్హులైన డిగ్రీ చదువుతున్న దివ్యాంగులకు కొత్తగా ల్యాప్ టాప్ అందించడం గొప్ప శుభ పరిణామం అన్నారు. దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు వెంటనే ల్యాప్ టాప్ లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ డిగ్రీ ఆ పై చదువుతున్న విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ద్వారా ల్యాప్ టాప్ ను ఉచితంగా అందిస్తుందన్నారు. అర్హత కలిగిన వారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకుంటే వారి దరఖాస్తులను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ల్యాప్ టాపులు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# జనసేన అధినేత జన్మదిన వేడుకలు జయప్రదం చేయండి

**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 01** :-నేడు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు జనసేన పార్టీ ఇంచార్జ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరుగుతాయి అని అందుకు అభిమానులు రెడీగా ఉండాలని రామచంద్రపురం జనసేన పార్టీ నాయకులు మీడియా సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అధితిగా కార్మిక శాఖ మంత్రి సుభాష్ పాల్గొంటారు. అందులో భాగంగా ముందుగా ముచ్చుమెల్లి రోడ్డు నందు వున్నా రామచంద్రపురం నియోజకవర్గం జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో కేక్ కటింగ్ జరుగుతుందని, అనంతరం ట్రెండ్స్ ఎదురుగా ఆర్ఆర్ గ్రాండ్ లో మెగా రక్త ధాన శిభిరంతో ఏర్పాటు చేశామని తెలిపారు. సాయంత్రం పట్టణంలో 7వార్డ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన జెండా స్థూపం ఆవిష్కరణ జరుగుతుందన్నారు..అనంతరం స్థానిక రాజగోపాల్ సెంటర్ లో జనసముహము మధ్య భారి కేక్ కటింగ్ ఉందని అందరూ పాల్గొలన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సినిమా హీరోలుకు అనేకమంది మంది అభిమానులు ఉంటారని కాని పవన్ కళ్యాణ్ అభిమానులు మాత్రం సినిమా హీరోలా కాకుండా ఒక



అభిమాన దేవుడులా పూజిస్తామని అన్నారు. పవన్ పుట్టినరోజు సందర్భంగా నేడు జరిగే కార్యక్రమాలు అన్నిటిలో రామచంద్రపురం నియోజకవర్గం జనసైనికులు,వీర మహిళలు,కూటమి పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అక్కిరెడ్డి శ్రీను,దొడ్డ దుర్గాప్రసాద్, ఆరంకోటి ఆనంద్,తడిమల్ల సత్తిబాబు,నంబుల సురేష్ పాల్గొన్నారు.

# శ్రమ నమోదుతో సామాజిక భద్రత దొరుకుతుంది






### భవన నిర్మాణ కార్మికులు ఇ శ్రమ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి

### అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆర్.సత్యవేణి

**రాయవరం,విశ్వంవాయిస్ న్యూస్:** అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇ శ్రమ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆర్.సత్యవేణి పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాయవరం లో గల కాపుల రామాలయం వద్ద శ్రీ భక్తాంజనేయ భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు కర్రి తాతారావు అధ్యక్షతన ప్రతి నెల 1వ తేదీన నిర్వహించే సమావేశంలో ఎ.ఎల్.ఒ సత్యవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా శాఖలలో విధులు నిర్వహిస్తున్న అసంఘటిత కార్మికులను ఇ శ్రమ పోర్టల్ లో నమోదు చేయించుకుని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను ఉపయోగించుకోవాలని అన్నారు. సొంతంగా ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ ద్వారా, లేదా మీ సేవా కేంద్రాలు, దగ్గరలో ఉన్న గ్రామ సచివాలయంలో నమోదు చేసుకోవచ్చని సూచించారు. వివిద శాఖలలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు ఇ శ్రమలో నమోదు చేసుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుండి ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, పూర్తి అంగవైకల్యం కలిగిన కార్మికునికి రూ.2లక్షలు, పాక్షిక అంగ వైకల్యం పొందిన కార్మికునికి రూ.1లక్ష బీమా సౌకర్యం పొందవచ్చని వివరించారు. వ్యవసాయ కార్మికులు, ఆశా వర్కర్లు, వలస కార్మికులు, ఇళ్లు, దుకాణాలలో పనిచేసే కార్మికులు, కొరియర్ బాయ్స్, తోపుడు బండి వర్తకులు, మత్స్య కార్మికులు, పాల వ్యాపారులు, చేతివృత్తుల పనివారు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు, జీపులు, ఆటోడ్రైవర్ల తో పాటు ఇ.పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ సౌకర్యం లేని కార్మికులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల నమోదు, పునరుద్ధరణ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని ఎవరైనా నమోదు చేసుకోకపోతే లేబర్ ఆఫీసులో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ, అంతా కలిసి ప్రభుత్వానికి, అధికారులకు ఉత్తరాలు రాసి, పంపించడం ద్వారా భవన నిర్మాణ కార్మికులు తమ ఆవేదనను వెల్లడి పరిచారు.

## ఉపముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు.

**జనసేన నాయకులు -డాక్టర్ బోండా సూర్యరావు.**



**కాకినాడ రూరల్: విశ్వం వాయిస్** . జనసేన పార్టీ అధినేత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు జన్మదిన శుభాకాంక్షలు జనసేన కాకినాడ రూరల్ నాయకులు డా. బోండా సూర్యారావు తెలిపారు ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా కృషి చేస్తున్నారన్నారు ముఖ్యంగా గ్రామ స్వరాజమేధ్యేయంగా పనిచేయడం అందరికీ తెలుసు గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ఉపాధి హామీ పథకం నిధులు కేంద్రం నుండి మంజూరు చేయించి రాష్ట్రంలో ఒకేసారి అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించారన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఆయన చేసిన కృషి మిత్ర పక్షాలు మరువలేవు అన్నారు ఆయనకు భగవంతుడు ఆయుష్షు ఆరోగ్యం కలగజేయాలని రాష్ట్ర అభివృద్ధి ముందుకు సాగుతుందని పోలవరం పూర్తవుతుందని అమరావతి నిర్మాణాలు పూర్తి అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బస్ షెల్టర్ ను ప్రారంభించిన మంత్రి సుభాష్



రామచంద్రపురం మండలం విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 01 :- ప్రయాణికుల సౌకర్యార్థం జుత్తుక యేసుదాసు మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్మించిన బస్ షెల్టర్ ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ప్రారంభించారు. రామచంద్రపురం రూరల్ మండలం చోడవరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ బస్సు షెల్టర్ ప్రయాణికులకు ఎండ, వానల నుంచి రక్షణగా ఉపయోగపడుతుందని మంత్రి సుభాష్ అన్నారు. సామాజిక సేవలో భాగంగా బస్ షెల్టర్ ను నిర్మించిన జుత్తుక యేసుదాసు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పీటర్ వరప్రసాద్ ను మంత్రి సుభాష్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ సౌకర్యాన్ని ఆయా గ్రామాల ప్రయాణికులు, బాటసారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, తెలుగుదేశం పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు,పార్టీ నాయకులు బిక్కిన జగన్నాధ రావు,నూనె లక్ష్మణరావు,జుత్తుక మహాలక్ష్మి,చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డీజే సౌండ్ లు డేంజర్ డేంజర్

### డిజె కొంప ముంచుతుంది

### గణేష్ నిమజ్జనంలో అపశృతి

**ఉప్పలగుప్తం మండలం విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 01 :-** చినగాడవిల్లి గ్రామపంచాయతీ పరిధి లంకశెట్టిపేటలో గుత్తుల ప్రసాద్ అనే 37 ఏళ్ల యువకుడు గణేష్ నిమజ్జనంలో ఏర్పాటుచేసిన డిజె సౌండ్ లో డాన్స్ చేస్తూ సొమ్మసిల్లి పడిపోయాడు. అతను అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడని గ్రామస్తులు చెప్తున్నారు. ఇలాంటి ప్రమాదకర సంఘటనలు తరచూ రాష్ట్రంలోనూ దేశంలోనూ అక్కడక్కడ జరుగుతున్నాయి. ఈ కారణంగా గణేష్ నిమజ్జన మహోత్సవాలలో డిజె సౌండ్లు పెట్టినటువంటి కమిటీలు జాగ్రత్త వహించాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ ఎటువంటి అపశృతి దొర్లినను సంబంధిత కమిటీ డీజే సౌండ్లు నిర్వాహక బృందం చట్టపరంగా శిక్షార్హులని రామచంద్రపురం సిఐ వెంకటనారాయణ తదితర పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## రాష్ట్ర హ్యాండీక్రాఫ్ట్ డైరెక్టరుగా ఆర్.డి.ఎస్. ప్రసాద్.




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండీక్రాఫ్ట్ డైరెక్టరుగా ఆర్.డి.ఎస్. ప్రసాద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రజా ప్రతినిధులు, స్నేహితులు, అభిమానులు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి, కళాకారుల సంక్షేమం దిశగా ఆయన కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## అర్హులందరికీ పెన్షన్లు అందిస్తాం, ఏ ఒక్కరికి అన్యాయం జరగదు....

.....ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు.....



**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్** అర్హులైన వారందరికీ పెన్షన్లు అందిస్తామని, కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరికి అన్యాయం జరగదని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. జగన్నాధపురం స్థానిక 21 వ డివిజన్ నందు ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందించే కార్యక్రమంలో కొండబాబు పాల్గొని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను స్థానిక ప్రజలకు వివరించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 4వేల రూపాయల నుండి 15 వేల రూపాయల వరకు 24 రకాల పెన్షన్లు అందిస్తున్న, ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వాన్నిదని, గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా దివ్యాంగుల నకిలీ సర్టిఫికెట్లు పుట్టించి అర్హులకు అందవలసిన పెన్షన్ లను దారి మళ్లించారని, రాష్ట్ర వ్యాప్తంగా వారందరిని రీ వెరిఫికేషన్ చేసి అనర్హులను తొలగించి, మరి కొంత మంది అర్హులకు ఇచ్చేందుకు ప్రక్రియ జరుగుతుందని, దీనిపై వైకాపా పార్టీ తప్పుడు కథనాలతో ప్రభుత్వంపై బురద జల్లుతూ, బోగస్ ప్రచారాలను చేస్తుందని, జగన్మోహన్ రెడ్డిని ఆయన పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పసగడుగుల శేషగిరిరావు, ఇమంది చంద్రరావు, బూడి ప్రకాష్, తెప్పల రామలింగేశ్వరరావు, సయ్యేద్ అలీ, తాడిచర్ల వెంకటేశ్వరరావు, ఇమామ్ సాహెబ్, ఆయేషా, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లతో నిరుపేదలకు భరోసా

**లబ్ధిదారులకు పింఛన్లు పంపిణి చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా గండేపల్లి ప్రతి నెల ఒకటో తేదీన నిరుపేదల ఇళ్ల వద్దకే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తూ కూటమి ప్రభుత్వం నిరుపేదల కళ్ళల్లో ఆనందం నింపుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.సోమవారం గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొని మంచానికే పరిమితమైన తాండ్రంగి వీర బ్రహ్మానందం, అనుకూల విజయ్ కుమార్, పంచకట్ల కాటమరాజు లకు ఇంటింటికి వెళ్లి 15 వేల రూపాయలు పింఛన్ సొమ్ములను అందించారు. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ పథకంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ పథకం నిలిచిందని ఆయన అన్నారు.సామాజిక, ఆర్థిక భద్రత కోసం పింఛన్లు అందిస్తున్నామన్నారు. పెన్షన్ల పంపిణీతో పేదల జీవితాలకు భద్రత, భరోసా లభిస్తుందన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛను అందే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్ర మంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, అడబాల భాస్కరరావు, కుంచే రాజా, సొసైటీ చైర్మన్ కంటిపూడి సత్యనారా యణ, ఎండిఓ కర్రి చందర్రావు, య ర్రంశెట్టి బాబ్జి, దిడ్డి చిన్న శ్రీను, రామకుర్తి నరసింహ, కొల్లు త్రిమూర్తులు, కాటేపల్లి భద్రం, తెలగ రెడ్డి భద్రం, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేళంగిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమం.



**కాకినాడ రూరల్ (కరప ): విశ్వం వాయిస్ న్యూస్.** కాకినాడ రూరల్ కరప మండలం వేళంగి గ్రామంలో పేదలకు, వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ ను అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి వేళంగి గ్రామం పంచాయతీ సెక్రటరీ పి.వీరభద్రరావు మరియు పంచాయతీ సిబ్బంది కలిసి సోమవారం ఉదయం 7 గంటల నుండి వేళంగి గ్రామంలో ఉన్నఅందరి ఇంటింటికి వెళ్లి పింఛన్ సొమ్ములను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పురం సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేసిన చంద్రబాబు

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కితాబు



**శంఖవరం, విశ్వం వాఐయిస్ న్యూస్** 30 ఏళ్లుగా సంపద సృష్టి, సంస్కరణలు, దార్శనికత, అభివృద్ధి, ఆత్మవిశ్వాసం పదాలకు తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా నిర్వచనంగా నిలిచారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తం చేసారని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రశంసించారు. ఈ మేరకు ఆమె పత్రికా ప్రకటనను సోమవారం విడుదల చేశారు. వివరాలు ఇవీ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు గర్వ కారణమైన రోజు ఇది. చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన చంద్రబాబు నాయుడు రాజకీంగా అంచెలంచెలుగా ఒక్కో మెట్టెక్కుతూ దేశ రాజకీయాలనే శాసించే స్థాయికి ఎదిగారు. తన రాజకీయ ప్రస్థానంలో ఓ కీలక మైలురాయికి చేరుకున్నారు. 1995 సెప్టెంబరు 1 న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలి సారి ప్రమాణ స్వీకారం చేసి నేటికి 30 ఏళ్లు పూర్తయింది. నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తు పల్లాలు చూసిన ఆయన ప్రస్తుతం నాలుగోసారి సీఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆ నాటి నుంచి రాజకీయాల్లో ఎన్నో కష్టాలు, నష్టాలు, అపోహలు, అవరోధాలను ఎదుర్కొని తెలుగు జాతి ఉన్నతి కోసం శ్రమించిన మహోన్నత నాయకుడని ఎమ్మెల్యే కొనియాడారు. 1994 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించిన తర్వాత పార్టీలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎన్టీఆర్ స్థానంలో చంద్రబాబు నాయుడు శాసన సభాపక్ష నేతగా ఎన్నిక అయ్యారు. ఆ క్రమంలో 1995 సెప్టెంబర్ 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన తొలిసారి ప్రమాణ స్వీకారం చేశారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పరిపాలనలో వినూత్నమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రజల వద్దకే పాలన, జన్మభూమి, శ్రమదానం వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజలకు చేరువ చేశారని ఎమ్మెల్యే సత్యప్రభ పేర్కొన్నారు.

**టెక్నాలజీ అంటేనే బాబు..**

సాంకేతికతపై ఆయనకున్న ముందు చూపుతో హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మాణానికి పునాదులు వేశారు. ఇది ఐటీ రంగంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో నిలబెట్టింది. ప్రతి సందర్భంలోనూ ఆయన ఈ విషయాన్ని గుర్తు చేస్తుంటారు. అదే తీరుగా అమరావతిని కూడా తీర్చిదిద్దాలని తపన పడుతున్నారు. ఏపీని పునర్నిర్మించాలని తాను సంకల్పించినట్లు చెబుతుంటారు. రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కాకుండా జాతీయ స్థాయిలోనూ చంద్రబాబు కీలక పాత్ర పోషించారు. కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటులో, ఇద్దరు ప్రధానుల ఎంపికలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. ఏపీజే అబ్దుల్ కలాంను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదించడంలోనూ చంద్రబాబు ముఖ్యపాత్ర వహించారని సత్యప్రభ ప్రశంసించారు.

**పదేళ్ల ప్రతిపక్ష నేతగా ...**

2004, 2009 ఎన్నికల్లో వరుస ఓటముల తర్వాత పదేళ్లపాటు ప్రతిపక్ష నేతగా కొనసాగారు. ఆ సమయంలో ప్రజా సమస్యలపై పోరాడుతూ, పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 లో నవ్యాంధ్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి, రాజధాని అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఘన విజయంతో నాలుగోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. ప్రస్తుతం నవ్యాంధ్ర పునర్నిర్మాణ బాధ్యతలను భుజాన వేసుకుని ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే సత్యప్రభ కీర్తించారు.

**చంద్రబాబు దూరదృష్టి స్ఫూర్తిదాయకం ...**

అభివృద్ధిపై మీ అంకితభావం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని, రాష్ట్రాన్ని సమగ్రంగా తీర్చిదిద్దాలన్న ఆయన దూరదృష్టి భావి తరాలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే అన్నారు. ఈ 30 ఏళ్ల కాలంలో చంద్రబాబు చేపట్టిన 30 అతి కీలకమైన పథకాలు, సంస్కరణలు, కార్యక్రమాలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వివరించారు. ప్రజల వద్దకే (ప్రత్యక్ష) పరిపాలన, ప్రజల భాగస్వామ్య పాలనగా జన్మభూమి కార్యక్రమం, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం, బాలికా విద్యా ప్రోత్సాహక దీపం పథకం, బిసిలకు కులవృత్తుల ప్రోత్సాహానికి ఆదరణ, ఎస్సీల రక్షణకు పున్నయ్య కమిషన్ సిఫారసుల అమలు, స్థానిక సంస్థల్లో బిసిలు, మహిళలకు రిజర్వేషన్లు, మైనారిటీలకు ప్రత్యేక సంక్షేమ పథకాలు, తొలి సారి డ్వాక్రా మహిళా సంఘాలు, విద్యుత్ రంగ సంస్కరణలు, తొలి ప్రైవేట్ విమానాశ్రయం, టెలికాం సంస్కరణలకు సూచనలు, పిపిపి మోడల్‌తో నేషనల్ హైవేస్, గ్రామ రోడ్లు, హైటెక్ సిటీ నిర్మాణం (ఐటీ విప్లవం), ఇంజనీరింగ్ కాలేజీల విస్తరణ, ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీలు, విజన్ 2020 రూపకల్పన, విద్యా రంగ సంస్కరణలు (1.80 లక్షల టీచర్ల నియామకం), టూరిజం ప్రోత్సాహం - దేవాలయాల పరిరక్షణ, డిజిటల్ గవర్నెన్స్, డిజిటల్ కరెన్సీ కమిటీ చైర్మన్‌గా సేవలు, స్వచ్ఛ భారత్ కమిటీకి నేతృత్వం, అన్నా క్యాంటీన్‌లు, రైతులకు డ్రిప్ ఇరిగేషన్ టెక్నాలజీ, రైతులకు సబ్సిడీలు, యాంత్రీకరణ, సాగునీటి ప్రాజెక్టులతో నదుల అనుసంధానం, ఎస్సీ వర్గీకరణ అమలు, రియల్ టైం గవర్నెన్స్, అమరావతి రాజధాని నిర్మాణం, పేదరిక నిర్మూలన (పి4 కార్యక్రమం) వంటి పథకాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి, విజన్, అభివృద్ధి పట్ల నిబద్ధత, రాష్ట్ర ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తూనే ఉన్నాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు..

# 'జీవో 84"ను సవరించి చిన్న,మధ్య తరహా దిన పత్రికలకు అక్రిడేషన్లు పెంచాలి

....జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్) డిమాండ్.,...

.......స్పందించిన జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా



**కాకినాడకలెక్టరేట్ :విశ్వం వాయిస్ న్యూస్** ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 84ను సవరించి చిన్న,మద్యతరహా పత్రికలకు అక్రిడేషన్లు పెంచాలని జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జాప్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పాత్రికేయుల సమస్యలను గుర్తించి మెరుగైన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడానికి నియమ నిబంధనలను విడుదల చేయడం పట్ల"జాప్"హర్షం వ్యక్తం చేసింది.ఇటీవల విడుదల చేసిన ప్రెస్ అక్రిడేషన్స్ జీవోఎం. ఎస్ నెం. 84/ 2025 సవరించాలని కోరుతూ ప్రభుత్వానికి పంపే నిమిత్తం జాప్ ప్రతినిధి బృందం సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతి పత్రాన్ని అందజేశారు. జెసి రాహుల్ మీనా స్పందిస్తూ ప్రభుత్వానికి పంపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ఎస్.ఎమ్.కృష్ణంరాజు మాట్లాడుతూ ఈ జీవో స్థానిక చిన్న,మద్య తరహా దినపత్రికలకు నష్టం కలిగించే విధంగా ఉందని పేర్కొన్నారు.గత ప్రభుత్వం స్థానిక దినపత్రికల జర్నలిస్టులకు ప్రెస్ అక్రిడిటేషన్లు తగ్గిస్తే ఈ జీవోతో అంతకంటే తగ్గే ప్రమాదం ఉందన్నారు. జిల్లా అధ్యక్షులు ఎం.ఎన్ఎస్.కనకాద్రి మాట్లాడుతూ గతంలో 10 అక్రిడేషన్లు పొందిన నాన్ ఎంప్యానల్డ్ దినపత్రికలకు, పదివేల లోపు సర్కులేషన్ కలిగిన ఎంప్యానల్డ్ దినపత్రికలకు పెంచకపోగా 4కు కుదించడం దారుణమన్నారు. ఆయా పత్రికలకు స్టేట్ హెడ్ క్వార్టర్, పబ్లికేషన్ సెంటర్, ఉమ్మడి జిల్లాలలో నియోజక వర్గాల వారీగాను,ఇతర జిల్లాల్లోనూ అక్రిడేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి (అప్పటి ప్రతిపక్ష నేత)నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తూ జర్నలిస్టులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇస్తామని, గత ప్రభుత్వం ప్రెస్ అక్రిడిటేషన్లు ఘోరంగా తగ్గించి వేసిందని,తాము అధికారంలోకి వస్తే పెంచుతామని నాగ్దానం చేశారని, గత సంవత్సరం నవంబర్ 29న సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అమరావతిలో జర్నలిస్టు సంఘాల ప్రతి నిధులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఇదే విషయంపై మరొకసారి వాగ్దానం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మంతెన శ్రీనివాస వర్మ,కమిటీ సభ్యులు ప్రకాష్,కుమార్,ఫరీద్,బాల, వెంకట్,కెజెడబ్యూ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జగ్గంపేట అన్న క్యాంటీన్ నాలుగో వార్షికోత్సవ వేడుకలు

హాజరై కేక్ కట్ చేసి స్వీట్లు, కూల్ డ్రింక్స్ పంపిణీ చేసి అన్నదానం నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట స్థానిక కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ స్మారక మందిరం గత నాలుగు సంవత్సరాలుగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సహకారంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ నాలుగో వార్షికోత్సవ వేడుకలు టిడిపి యువనేత పాలచర్ల నాగేంద్ర చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి పంపిణీ చేసి పేదలకు అన్నదానం నిర్వహించారు. నాగేంద్ర చౌదరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ గత వైసిపి పాలనలో పేదలకు అన్న క్యాంటీన్ ద్వారా అందుతున్న ఆహారాన్ని లాక్కున్న ఘనత వారికే చెందుతుందని చంద్రబాబు ఆలోచనతో ఉచిత అన్నా క్యాంటీన్ ఏర్పాటుచేసి నాలుగు సంవత్సరాలుగా కొనసాగిస్తున్నామని దీనికి అన్ని విధాల సహకారం అందిస్తున్న పాలచర్ల నాగేంద్ర చౌదరి, నాయకులు, కార్యకర్త ఆర్థిక సహకారంతో నిర్వహించమని అన్నారు. నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ గత రాక్షస ప్రభుత్వం పేదల నోటికాడ అన్నాన్ని లాక్కోవడంతో చంద్రబాబు నాయుడు ప్రతిపక్షం ఉండి కూడా పేదలకు అన్నదానం నిర్వహించాలని ఆదేశించడంతో జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో జగ్గంపేటలో గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి సోమవారం ఉచిత అన్నా క్యాంటీన్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, పో తుల మోహనరావు దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, కందుల చిట్టిబాబు, కుంచె రాజా నియోజకవర్గంలోని 4 మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా పంపిణీ వ్యవస్థను సక్రమంగా నడిపిందుకే స్మార్ట్ రేషన్ కార్డులు





ప్రజల సంక్షేమం కొరకే కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు

జగ్గంపేట శాసనసభ్యులు ,టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి ప్రజల కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చే ప్రజా సంక్షేమ కోసం కృషి చేస్తున్నారని మెగా డీఎస్సీ, అన్నా క్యాంటీన్, దీపం పథకం, తల్లికి వందనం , అన్నదాత సుఖీభవ , స్త్రీ శక్తి ఇలా ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన రామవరం సచివాలయం1 వద్ద స్మార్ట్ కార్డులు పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చేతుల మీదుగా స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంతో పగడ్బందీగా స్మార్ట్ రేషన్ రూపకల్పన జరిగిందన్నారు.ఇప్పుడు వరకు ఉన్న రేషన్ కార్డులో ఆ కుటుంబానికి చెందిన సభ్యులందరితో ఫోటో ఉండేదని, ఇప్పుడు ఆ స్థానంలో కుటుంబ యజమాని ఫోటో ఉంటుందని తెలియజేశారు.స్మార్ట్ కార్డులు బ్యాంక్ డెబిట్ కార్డు ,ఏటీఎం తరహా ఉంటుందన్నారు .స్మార్ట్ ఈ పాస్ మిషన్లను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తేనున్నదని ,ఇప్పుడున్న స్మార్ట్ కార్డులను ఈ యంత్రం ద్వారా స్వైప్ చేస్తే వివరాలు వస్తాయన్నారు.దీనివల్ల గతంలో యంత్రాలతో వచ్చిన సర్వర్ సమస్యలు ఉండవని తెలియజేశారు.సరుకులు తీసుకున్న వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి సమాచారం అందుతుందన్నారు. లబ్ధిదారుడు క్యూఆర్ కోడ్ స్కానింగ్ తో సరుకులు తీసుకున్న సమాచారం మొత్తం తెలుసుకోవచ్చాన్నారు. సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నెంబర్ 1967లో సంప్రదించవచ్చని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు.తాజా పరిణామాలతో రేషన్ పంపిణీ వ్యవస్థ నూతన సాంకేతిక మార్పులతో అత్యంత పకడ్బందీగా అమలు జరుగుతుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీనుమణి బాబు, పోతుల మోహనరావు, బుర్రి సత్తిబాబు, పాండ్రంగి రాంబాబు, బసవ చిన్నబాబు, మండపాక అప్పన్న దొర, అధిక సంఖ్యలో కూటమి నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## ఇండియన్ రెడ్ క్రాస్ క్యాంప్ లో ఆదిత్య విద్యార్థి ప్రవీణ్






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక హర్యాన రాష్ట్రానికి సమీపంలో ఉన్న కురుక్షేత్రలో ఇండియన్ రెడ్ క్రాస్ ట్రైనింగ్ ను పది రోజులు శిక్షణ పూర్తి చేసుకుని విజయవంతంగా ప్రవీణ్ తిరిగి నగరానికి చేరుకున్నాడు. ఈ శిక్షణలో ప్రకృతి వైపరీత్యాలలో ఎలా మెలగాలో సమాజానికి ఎలా ఉపయోగపడాలో, హార్ట్ ప్రాబ్లం వచ్చినప్పుడు ఎలా స్పందించాలో, ఫస్ట్ ఎయిడ్ వంటి తదితర విషయాలలో శిక్షణ కూడా తీసుకోవడం జరిగింది. అనేక సమావేశాలు నిర్వహించి రక్తదానం వలన ఉపయోగాలు సమాజం పట్ల నేటి విద్యార్థులు బాధ్యత వంటివి చర్చించారు. విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కు చెందిన ప్రవీణ్ ఘనతను మెచ్చి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్,ఆదిత్య రెడ్ క్రాస్ కోఆర్డినేటర్స్ డాక్టర్ జి వి ఎస్ నాగేశ్వరరావు డాక్టర్ బి హెచ్ వి రమాదేవి ఆకుల శిరీష, పోలు కొండ సాయి తమ అభినందనలు తెలియజేశారు. ఎంతోమందికి దక్కని అపురూప అవకాశం తమ విద్యార్థికి దక్కినందుకు ఆదిత్య ప్రిన్సిపాల్ సిహెచ్ ఫణి కుమార్,ఎస్. కె.ఎన్.రెహమాన్, ఎం చంద్రశేఖర్, డి రామకృష్ణ లు అభినందించారు.

## చిన్నారికి స్కూల్ పుస్తకాలు అందజేసిన కొమ్ము సత్తిబాబు




**రాజమహేంద్రవరం,విశ్వంవాయిస్ న్యూస్:** రాజమహేంద్రవరం స్థానిక గోరక్షణపేట కు చెందిన ఒక పేదకుటుంబం ఆర్తమూడి హరిత వీరి రెండోవ కుమార్తె చిన్నారి జ్ఞాన జ్యోత్స్న దానవాయిపేటలో లిటిల్ పారడైజ్ స్కూల్లో ఉచిత విద్య పథకం ద్వారా ఉచితంగా విద్యాభ్యాసం చేస్తుంది.వారి కుటుంబం కడు పేదరికంలో ఆ చిన్నారి కి చదువుకోవడానికి పుస్తకాలు కూడా కొనలేక పాపని స్కూలుకు పంపించలేని పరిస్థితిలో ఉన్నప్పుడు విషయం తెలుసుకున్న ఫెస్ప అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు వెంటనే స్పందించి తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు పాపకు పుస్తకాలు కొమ్ము వారు కుటుంబ డబ్బులు,ఉచిత విద్య విద్యార్థుల తల్లితండ్రుల సహకారంతో పుస్తకాలు ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ పేద విద్యార్థులు ఆర్థిక సమస్యలు కారణంగా చదువులు ఆగిపోకూడదు అని,ప్రతివక్కరులు పేదవారిని ఆదుకోవాలని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

# బీసీల సంక్షేమ,అభివృద్ధి కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉంది

**బీసీలను మండల,జిల్లా కమిటీలు నియామకం**

**ఎపి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీ.సీ సెల్ అధ్యక్షుడు సొంటి నాగరాజు వెల్లడి**



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ క్రమంగా పుంజుకుంటుందని త్వరలోనే మండల,జిల్లా కమిటీల నియామకం జరుపుతామని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు సొంటి నాగరాజు వెల్లడించారు. జిల్లాల పర్యటనలో భాగంగా సోమవారం రాజన్న రాజమండ్రిలోని కృష్ణసాయి కళ్యాణ మండపంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది.ఈ సమావేశానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ టీ.కె విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సొంటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలు వారందరి సంక్షేమం అభివృద్ధి కోసం పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. జాతీయస్థాయిలో అగ్ర నాయకులు రాహుల్ గాంధీ బీహార్ ఓట్ల చోరీ ఉద్యమం ఉద్యమం దేశ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి స్పందన వచ్చిందన్నారు.రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యే విధంగా కాంగ్రెస్ పార్టీ వర్గాలుగాతీతంగా ఐక్యతగా ముందుకు కొనసాగాలని ఆయన పిలుపునిచ్చారు.జిల్లా అధ్యక్షుడు టి.కె విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం వస్తుందని దేశ ప్రధానిగా రాహుల్ గాంధీ,రాష్ట్ర ముఖ్యమంత్రిగా షర్మిలారెడ్డి అధికారంలోకి వస్తారని బీసీలు రిజర్వేషన్లు 42 శాతం పెంచుతామని అన్నారు.నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ చేస్తున్న ప్లాస్టిక్ వస్తువుల వ్యాపారంపై తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ తెలుపుతున్నట్లు టి కే తెలిపారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథరు,పిచ్చెట్టి కోటేశ్వర రావు,డాక్టర్ వడియారు, మోత శారద,బెజవాడ రంగారావు, పట్నాల శ్రీనివాసరావు, డాక్టర్ రాజశేఖర్ ఇతరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించిన చంద్రబాబు

**పింఛనుదార్లు"థ్యాంక్యూ సీఎం సార్ "నినాదాలు**

**దివ్యాంగులలో ఆనందం**

**పించన్లు పంపిణీ చేసిన కుడుపూడి సత్తిబాబు వెల్లడి**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** గత వైకాపా ప్రభుత్వం నిర్వాకం వల్ల తొలగించబడి న దివ్యాంగుల పింఛన్లను సీఎం చంద్రబాబు మానవత్వంతో స్పందించి పునరుద్ధరించారని ఏ.పీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. సోమవారం స్థానిక 3వ వార్డులో సుబ్బారావుపేట, నెహ్రూనగర్,రాజేంద్రనగర్ ప్రాంతాలలో సత్తిబాబు ఉదయం ఆరుగంటలకు ఇంటింటికి వెళ్లి దివ్యాంగ పించన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పించన్లు తొలగించారంటూ వైకాపా పేటీఎం బ్యాచ్ దుష్ప్రచారం చేయడంతో పింఛను దారుల్లో భయాంధోనలు వ్యక్తం అయ్యాయని చెప్పారు. వారి అసత్య ప్రచారాలను నమ్మ వద్దని,చంద్రబాబు ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పులలో ముంచి దివాలా తీయించిందని,ఇప్పుడు చంద్రబాబు ఉన్నత లక్ష్యంతో రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారని తెలిపారు. ఏ ప్రభుత్వమూ ఇవ్వని విధంగా కూటమి ప్రభుత్వం చొరవ చూపి, ఎంతో కాలంగా మంచానికే పరిమితమైన వ్యాధి గ్రస్తుల కుటుంబానికి రూ 15 వేలు ఆర్థిక సహాయం చేస్తుందని ఈ సందర్భంగా సత్తి బాబు గుర్తు చేశారు.గత ప్రభుత్వం ఇచ్చిన రూ 3 వేల పించన్ ను కూటమి ప్రభుత్వం రూ 4 వేలకు పెంచిందని, అలాగే వృద్ధాప్య పించన్ ను రూ 6 వేలకు పెంచిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రైతాంగానికి రూ 13 వేలు మాత్రమే ఇవ్వగా చంద్రబాబు దానిని అన్నదాత సుఖీభవ కింద 20 వేలకు పెంచి అన్నదాత కు మేలు చేశారని చెప్పారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం కింద ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వడం కూటమి ప్రభుత్వానికి పేదల పట్ల ఉన్న అభిమానానికి నిదర్శనం అన్నారు.ఇదే సందర్భంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 30 సంవత్సరాలైన శుభ సందర్భంగా కుడిపూడి సత్తిబాబు ప్రజల సమక్షంలో కేక్ కట్ చేసి, వారికి తినిపించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. పింఛనుదార్లు "థ్యాంక్యూ సీఎం సార్ "అంటూ నినాదాలు చేశారు.ఇటు దివ్యాంగ పించన్ల పునరుద్ధరణ, అటు చంద్రబాబు 30 వసంతాల సీఎం సంబరం వెరసి పండుగ వాతావరణాన్ని తలపించింది.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొమ్మన మైన శ్రీనివాస్,జక్కంపూడి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్లు అర్హులందరికీ అందిస్తున్నాం..

**- ఏ ఒక్కరికి అన్యాయం జరగదు...**

**- వైకాపా పార్టీ తప్పుడు కథనాలతో ప్రభుత్వంపై బురద జల్లుతుంది...**

**- ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల,ప్రభుత్వ సలహాదారులు షరీఫ్..**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్:** అర్హులైన వారందరికీ పెన్షన్లు అందిస్తామని, %శ్రీ%కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరికి అన్యాయం జరగదని, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారులు మహమ్మద్ షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం కొంతమూరు గ్రామంలో ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందించే కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల వద్ద నుండి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా దివ్యాంగుల నకిలీ సర్టిఫికెట్లు పుట్టించి, అనర్హులు చాలామంది పెన్షన్ పొందుతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా వారందరిని రీ వెరిఫికేషన్ చేసి అనర్హులను తొలగించి, మరి కొంతమంది అర్హులకు ఇచ్చేందుకు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు.ఆన్లైన్లో జరిగిన చిన్న చిన్న సాంకేతిక కారణాల వల్ల కొంతమంది అర్హులకు కూడా నోటీసులు రావడం జరిగిందని,ఈ విషయం ప్రభుత్వానికి తెలియడంతో దీనిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారు స్పందిస్తూ, నోటీసులు అందిన వారికి కూడా తక్షణమే పెన్షన్ అందించాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. దీనిపై వైకాపా పార్టీ తప్పుడు కథనాలతో ప్రభుత్వంపై బురద జల్లుతూ,బోగస్ ప్రచారాల ను చేస్తుందని, జగన్మోహన్ రెడ్డిని ఆయన పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎద్దేవా చేశారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 4వేల రూపాయల నుండి 15 వేల రూపాయల వరకు 24 రకాల పెన్షన్లు అందిస్తున్న, ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వాన్నిదని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పిన్నమరెడ్డి ఈశ్వరుడు, రాష్ట్ర మైనార్టీ నాయకులు షేక్ సుభాన్,రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, సొసైటీ చైర్మన్ అడ్డాల శ్రీను, డైరెక్టర్ యమన నారాయణ గౌడ్, ఉండవెల్లి బంగార్రాజు, తాడేపల్లి నాగరాజు,షేక్ ఖాసిం,ఉమర్,పాలడుగుల శ్రీనివాస్,గోక శ్రీను, దండమూడి శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ మరియు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విజయ గణపతి ఆలయం నందు గణపతి నవరాత్రి వేడుకలు



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** గణపతి నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని కొవ్వూరు మండలం వేములూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ విజయ గణపతి ఆలయం నందు గణపతి నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆరవ రోజున పురస్కరించుకొని కొవ్వూరు మండలం వేములూరు గ్రామంలోని పురవీధుల గుండా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో బ్యాండ్ మేళాలతో విచిత్ర వేషధారణ నృత్యాలతో శ్రీ విజయ గణపతి స్వామివారి ఊరేగింపు దివ్య శోభాయమానంగా జరిగింది. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వేములూరు గ్రామ శ్రీ విజయ గణపతి ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా వేములూరు గ్రామం నందు శ్రీ విజయ గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ప్రతి సంవత్సరం వేలాదిమంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ తొమ్మిదవ తేదీ మంగళవారం సుమారు 4000 మంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ విజయ గణపతి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కొవ్వూరులో మీ కోసం పిజిఆర్ఎస్" కార్యక్రమం



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** మీ కోసం పిజిఆర్ఎస్" కార్యక్రమంలో ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన "పి జి ఆర్ ఎస్ – మీ కోసం" వేదికలో వచ్చిన అర్జీలను ఆర్డీవో స్వీకరించారు. ఈ సందర్భంగా, ఆర్డీవో రాణి సుస్మిత తెలిపినట్లు, సోమవారం రోజున 18 అర్జీలు మీకోసం పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించడం జరిగిందన్నారు. "మీ కోసం పిజిఆర్ఎస్ , 1100 నెంబర్ ద్వారా స్వీకరించిన ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలియ చేశారు. డివిజన్ , మండల, గ్రామ స్థాయి అధికారులు, మీకోసం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో తప్పనిసరిగా హాజరు కావడం ద్వారా ప్రజల సమస్యలు సమర్థవంతంగా పరిష్కరించాలన్న సూచనలను ఇచ్చారు. ప్రజలు తమ సమస్యలను నమోదు చేయడానికి "1100 – మీకోసం కాల్ సెంటర్" కు ఫోన్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేయవచ్చుని, అలాగే నమోదు చేసిన అర్జీ యొక్క యధార్థ స్థితిగతులను తెలుసుకోవచ్చుని ఆర్డీవో వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రఘుదేవపురం గ్రామంలో నేరుగా పింఛనుదారులకు పింఛన్లను అందజేసిన ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఉదయం నుండి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొని స్థానిక కూటమి నాయకులతో కలిసి పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంను నిరంతరం అభివృద్ధి వైపు తీసుకెళ్లడానికి అన్ని విధాల కృషి చేస్తున్నామని తెలిపారు. అందుకోసం త్వరలో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు మన ఊరు మన యం. యల్. ఏ. మన పల్లెబాట అనే వినూత్న కార్యక్రమం ద్వారా ప్రతి గడపకు వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటానని తెలిపారు. పెన్షన్ల విషయానికొస్తే, మన రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీలో ఏపీ ప్రభుత్వం ఒక పండుగలా నిర్వహిస్తుందని, కొత్తగా వేల సంఖ్యలో వితంతువు మరియు స్పౌజ్ పెన్షన్లు మంజూరు చేసిందని భర్త చనిపోతే వెంటనే భార్యకు పెన్షన్ అందించేలా చర్యలు చేపట్టిందని,గతంలో 6 నెలలకు ఒకసారి కొత్త పెన్షన్లు మంజూరు చేసేవారని కానీ ఇప్పుడు కొత్తగా పెన్షన్ మంజూరు విధానంలో కీలక మార్పులు తీసుకువచ్చి లబ్దిదారులకు పెన్షన్ అందేలా చేస్తున్నామని, అంతే కాకుండా పెన్షన్ ఆగిందని నోటీసులు వచ్చిన వికలగులకు సైతం ఈ రోజు నేరుగా వారి ఇళ్లకు నేరుగా వెళ్లి పెన్షన్లు ఇవ్వడం జరిగిందని అంకితభావం, నిబద్ధత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సొంతమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగు నేల గర్వించే నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**యువ నాయకుడు పెందుర్తి వెంకటేష్**



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తెలుగు నెల గర్వించే నాయకుడు, తెలుగు రాష్ట్రాల ప్రగతి కారకుడు యువతకు భవిష్యత్తు చూపిన మార్గదర్శి నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు స్వీకరించి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం యువ నాయకులు పెందుర్తి అభిరామ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.గత 30 ఏళ్లలో ఎన్నో అద్భుత ఆవిష్కరణలు చేసి తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ ప్రతికూల పరిస్థితిని ఆత్మ విశ్వాసంతో అధిగమిస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే నాయకత్వం ఆయన సొంతమని అభిరామ్ అన్నారు.

## అంగరంగ వైభవంగా శోభాయాత్ర..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** తొలుత రాజమండ్రిలో అంగరంగ వైభవంగా సాగిన బీజేపీ సారధ్యం శోభాయాత్ర జరిగింది. స్థానిక వై జంక్షన్లో నుంచి జరిగిన శోభాయాత్రను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. జానపద కళారూపాల ప్రదర్శనలతో కంబాల చెరువు జంక్షన్, దేవి చౌక్ , గోకవరం బస్టాండ్ మీదుగా సుబ్రమణ్య మైదానం వరకు శోభాయాత్ర జరిగింది.

పెద్ద సంఖ్యలో బైకులు, పాదయాత్రతో బీజేపీ శ్రేణులు పాల్గొన్నాయి.

## సెప్టెంబర్ 13 న జాతీయ లోక్ అదాలత్‌కు సిద్ధం.

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** సోమవారం తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్.శ్రీలక్ష్మి వివిధ చిట్ ఫండ్ సంస్థల మరియు సంబంధిత న్యాయవాదుల తో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా అధిక సంఖ్యలో బాధితులు తగు పరిహారం పొందేలా చర్యలు చేపట్టడానికి అవసరమైన వ్యూహాలను చర్చించారు. ఈ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న చిట్ ఫండ్ మరియు ఇతర సంస్థల సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను గుర్తించి జాబితా తయారు చేయడం,రాజీ పడదగిన ఇతర కేసులను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం పై సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో చిట్ ఫండ్ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీకి రాజకీయాల్లో ఉండే అర్హత లేదు


- రాష్ట్రంలో గ్రామగ్రామాన బీజేపీ పటిష్టతకు కార్యాచరణ సిద్ధం.. ప్రతి గ్రామానికి మన పార్టీ- మనజెండా

ప్రతి ఇంటికి మోదీ పథకాలు ప్రజలకు అందుకుంటున్నారు.. ప్రజలకు బీజేపీ కార్యకర్తలు తెలిపాలి

పోలవరం ప్రాజెక్టు ను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.. గోదావరి పుష్కరాలను కూటమి ప్రభుత్వం వైభవంగా నిర్వహిస్తుంది

రాజమండ్రిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నారు.. దేవాలయాలను అభివృద్ధి చేస్తాం.

కడియం నర్సరీలకు మహర్దశ ... సభలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్









**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాష్ట్రంలో బిజెపి పార్టీని గ్రామ గ్రామాన తీసుకెళ్ళి పటిష్ఠ%శీ% చేసేందుకు ఒక కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.బి.ఎన్. మాధవ్ చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా పర్యటన సందర్భంగా సోమవారం రాజమండ్రి సుబ్రమణ్య మైదానంలో జరిగిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. మన పార్టీ మన జెండా పేరుతో గ్రామస్థాయిల్లో పార్టీని బలోపేతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.కూటమి ప్రభుత్వంలో ఉన్నాం కానీ సరైన ప్రాతినిధ్యం లేదనే అభిప్రాయం మూడు పార్టీల కేడర్ లో అభిప్రాయం వుందని,కూటమిలో సముచిత స్థానం స్థానిక సంస్థల్లో పదవులు తెచ్చు కోవలసిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామ,మండల,నియోజక వర్గ స్థాయిలో నాయకులు కింగ్ అవ్వాలి లేదా కింగ్ మేకర్ కావాలని ఆయన సూచించారు.ప్రజాక్షేత్రం లో పార్టీ నాయకులు తిరిగి ప్రజల సమస్యలను పరిష్కారంలో చొరవ చూపాలని,కేంద్ర,రాష్ట్ర కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ప్రతి ఇంటికి కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ పథకాలు అందుతున్నాయని కార్యకర్తలు ప్రచారం చేయాలని మాధవ్ కోరారు.గోదావరిపుష్కరాలను మరో కుంభమేళా తరహాలో నిర్వహిస్తామని చెప్పారు.రాజమండ్రి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నారని, దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన అన్నారు.కడియం నర్సరీలకు మహర్దశ వచ్చిందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆయన మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం వచ్చాక పోలవరం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన చేపట్టిందని కేంద్రం రూ.15 వేల కోట్లు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు.వచ్చే రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టు ను పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇప్పటికే 15 వేల కోట్లు పోలవరం ప్రాజెక్టు కు కేంద్రం ఇచ్చిందని ఆయన అన్నారు.రాయలసీమకు ,ఉత్తరాంధ్రకు నీళ్ళు ఇచ్చేందుకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని ఆయన అన్నారు.డబుల్ ఇంజిన్ ప్రభుత్వం తో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని,జాతీయ రహదారులు, ఫ్లే ఓవర్ బ్రిడ్జి లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపట్టామని,రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి నేరుగా నిధులు ఇస్తోందని, ప్రధాని మోడీ 11 ఏళ్ల పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, పార్టీ పటిష్ఠంచేసేందుకు ఒక కార్యక్రమం చేపడుతున్నామని మాధవ్ చెప్పారు.

**రాహుల్ గాంధీకి రాజకీయాల్లో ఉండడానికి అర్హత లేదు:** దేశానికి కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందని, రాహుల్ గాంధీకి రాజకీయాల్లో ఉండే అర్హత లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ధ్వజమెత్తారు. ఓట్లు చోరీ చేసి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ను అడ్డుకుని,నెహ్రూ ను ప్రధానిని చేసిన ఘనత కాంగ్రెస్ కే దక్కుందుందని ఆయన ఆరోపించారు. ఈ కాంగ్రెస్ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న పార్టీ కాదని, ఇది కేవలం నకిలీ కాంగ్రెస్ అని ఆయన విమర్శించారు.సభ్యసమాజం తలదించుకునేలా పరమపధించిన ప్రధాని నరేంద్ర మోడీతల్లిని రాహుల్ గాంధీ విమర్శించడం చూస్తే ఆయన రాజకీయానికి అర్హుడా అనిపిస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో పిల్ల కాంగ్రెస్ వైసీపీ..గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని దోచేసిందని ఆయన విమర్శించారు.

రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ

మూల సిద్ధాంతం వదలకుండా నాయకత్వం పటిమతో సమగ్ర విధానాలతో బిజెపి ముందుకు వెళ్తోందని అన్నారు. 1980లో కేవలం రెండు స్థానాల నుంచి ప్రారంభమై, అధికారానికి చేరువైన బిజెపి ప్రస్థానంలో కార్యకర్తల భాగస్వామ్యం ప్రధానమని ఆమె అన్నారు. స్థానిక డా బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్య మైదానంలో సోమవారం జరిగిన బిజెపి జిల్లా స్థాయి విస్తృత సభలో ఆమె మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో అందరికీ ఫలాలు అందాలన్న అంత్యోదయ సిద్ధాంతంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయేకు 324సీట్లు వస్తాయని ఇండియా టుడే మూడ్ ఆఫ్ సర్వే తేల్చిందని, ఇప్పటికీ మోదీ పట్ల 58శాతం ప్రజలు విశ్వాసం కనబరుస్తున్నట్లు తేలిందని ఆమె ప్రస్తావించారు. ప్రపంచ స్థాయిలో సైతం మోడీ పట్ల 72శాతం మంది విశ్వాసం కల్గి ఉంటె, తాజాగా అది 78శాతానికి పెరిగిందన్నారు. 370అధికరణం రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని , 500ఏళ్లకు పైగా ఎదురుచూస్తున్న అయోధ్యలో రామ మందిర నిర్మాణం కూడా జరిగిందని ఎంపీ పురందేశ్వరి గుర్తుచేసారు. బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటామని మోదీ ప్రకటించి ఆమేరకు కార్యక్రమాలు చేస్తున్నారని, పలు కార్యక్రమాలను ఎంపీ పురందేశ్వరి ప్రస్తావించారు. రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వ అవినీతి , అరాచక పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన ఘనత బిజెపి కార్యకర్తలకే దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. మన కార్యకర్తల పోరాటానికి మద్యం కుంభకోణం లో వెలుగు చూస్తున్న అంశాలే నిదర్శనమని అన్నారు. మోడీ తల్లి గురించి రాహుల్ గాంధీ మాట్లాడిన తీరు దారుణమని ఆమె అన్నారు. సంస్కారం లేకుండా చేస్తున్న ఇలాంటి విమర్శలను తిప్పికొట్టాలన్నారు. సారధ్యం పేరిట మాధవ్ చేపట్టిన పర్యటన అభినందనీయమన్నారు. ఆయనకు అందరూ అండగా ఉండి పార్టీని పటిష్టం చేయాలన్నారు.ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ

రాబోయే రోజుల్లో మరింత విస్తృతంగా కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. మాధవ్ పర్యటనకు గత 15రోజుల నుంచి కార్యకర్తలు పడిన శ్రమను ఆయన అభినందించారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోడీ ఎంతో సహకరిస్తున్నారని అన్నారు. ఆనాడు ఎమర్జెన్సీలో పివి చలపతిరావు వేషాలు మారుస్తూ ఇందిరాగాంధీ ప్రభుత్వానికి దొరకకుండా ఎంతో ధైర్యంగా పోరాటం చేశారు, బిజెపి ఆవిర్భావం తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బిజెపి తొలి అధ్యక్షునిగా పనిచేశారని, ఇప్పుడు అయన తనయుడు మాధవ్ హయాంలో పార్టీకి దిశా నిర్దేశం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేసారు. కూటమి ప్రభుతంలో కొన్ని ఇబ్బందులు సహజమని, అయితే సర్దుకుంటూ ముందుకువెళ్లాలని సోము వీర్రాజు సూచించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి మాట్లాడుతూ కేంద్రంలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపక్వత లేని విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయేకు 324సీట్లు వస్తాయని, ఇండి కూటమి 208స్థానాలకు పరిమితం అవుతుందని ఇండియా టుడే మూడ్ ఆఫ్ సర్వే లో తేలిందని అన్నారు. అలాగే రాష్ట్రంలో మరో రెండు ఎంపీ సీట్లు కూటమికి పెరుగుతాయని కూడా ఆ అసర్వే తేల్చిందన్నారు. అన్ని రంగాల్లో దేశాన్ని ప్రధాని మోడీ అభివృద్ధి చేస్తున్నారని, రాష్ట్రానికి అవసరమైన్ సహకారాన్ని అందిస్తున్నారని అన్నారు.బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అధ్యక్షత వహించిన సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, ప్రధాన కార్యదర్శి రేలంగి శ్రీదేవి,దయాకరరెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగల శ్రీనివాస్,ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పరకాల సురేష్, సీనియర్ నాయకులు గరిమెళ్ళ చిట్టిబాబు, రామ్మోహనరావు, కంటి వీరన్న చౌదరి,ఎపిఆర్ చౌదరి,ఆకుల శ్రీధర్,పరిమి రాధాకృష్ణ, కంటిపూడి సర్వారాయుడు,నర్సిపల్లి హారిక, వీరాంజనేయులు, కాలేపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# నవయుగ వైతాళికుడు, స్వర్ణాంధ్రప్రదేశ్ సృష్టికర్త, ముఖ్యమంత్రి చంద్రబాబు

**ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న చంద్రబాబుకి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు గర్వకారణమైన రోజు ఇది అని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి 30 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూనేటి రోజు రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయి సరిగ్గా 30 సంవత్సరాల క్రితం, 1995 సెప్టెంబర్ 1న నారా చంద్రబాబు నాయుడు తొలిసారిగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు అని అన్నారు.గత మూడున్నర దశాబ్దాలుగా నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన, రాష్ట్ర పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శక పరిపాలన, పేదరిక నిర్మూలన వంటి రంగాలలో ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ 30 ఏళ్ల కాలంలో చంద్రబాబు గారు చేపట్టిన 30 అతి కీలకమైన పథకాలు, సంస్కరణలు, కార్యక్రమాలు ఇవి:1. ప్రజల వద్దకే పాలన ప్రత్యక్ష పరిపాలన



2. జన్మభూమి కార్యక్రమం ప్రజల భాగస్వామ్య పాలన
3. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం
4. బాలికా విద్యా ప్రోత్సాహం దీపం పథకం
5. బిసిలకు ఆదరణ కులవృత్తుల ప్రోత్సాహం
6. ఎస్సీల రక్షణ పున్నయ్య కమిషన్ అమలు
7. స్థానిక సంస్థల్లో బిసిలు, మహిళలకు రిజర్వేషన్లు
8. మైనారిటీలకు ప్రత్యేక సంక్షేమ పథకాలు
9. తొలి సారి డ్వాక్రా మహిళా సంఘాలు
10. విద్యుత్ రంగసంస్కరణలు
11. తొలి ప్రైవేట్ విమానాశ్రయం
12. టెలికాంసంస్కరణలకుసూచనలు
13. పిపిపి మోడల్తో నేషనల్ హైవేస్ గ్రామ రోడ్లు
14. హైటెక్ సిటీ నిర్మాణంఐటీ విప్లవం
15. ఇంజనీరింగ్ కాలేజీల విస్తరణ
16. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీలు
17. విజన్ 2020 రూపకల్పన
18. విద్యా రంగ సంస్కరణలు 1.80 లక్షల టీచర్ల నియామకం
19. టూరిజం ప్రోత్సాహం దేవాలయాల పరిరక్షణ
20. డిజిటల్ గవర్నెన్స్
21. డిజిటల్ కరెన్సీ కమిటీ చైర్మన్గా సేవలు
22. స్వచ్ఛభారత్ కమిటీకి నేతృత్వం
23. అన్నా క్యాంటీన్లు
24. రైతులకు డ్రిప్ ఇరిగేషన్ టెక్నాలజీ
25. రైతులకు సబ్సిడీలు, యాంత్రీకరణ, సాగునీటి ప్రాజెక్టులు
26. నదుల అనుసంధానం
27. ఎస్సీ వర్గీకరణ అమలు
28. రియల్ టైం గవర్నెన్స్
29. అమరావతి రాజధాని నిర్మాణం30. పేదరిక నిర్మూలన
30. %ూ%4 కార్యక్రమంచంద్రబాబు గారి దూరదృష్టి, విజన్, అభివృద్ధి పట్ల నిబద్ధత రాష్ట్ర ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తూనే ఉన్నాయి. మరొక 30 సంవత్సరాలు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేయాలని అని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు

## రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్

**స్మార్ట్ గవర్నమెంట్స్మార్ట్ ఆలోచన**

**జగ్గంపేటశాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ**




**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా కిర్లంపూడి రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెడుతూ రేషన్ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా లబ్ధిదారులకు స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. సోమవారం కిర్లంపూడి మండలం సోమరాయణం పేట గ్రామం నందు నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఇది తమ కూటమి ప్రభుత్వానికి వచ్చిన స్మార్ట్ ఆలోచన అని, గతంలో మాదిరిగా పెద్ద పుస్తకాల వలే కాకుండా ఏటిఎం, ఆధార్ కార్డుల తరహాలో రాజముద్రతో పాటు లబ్ధిదారుడు చిత్రం ఉండే విధంగా స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతోందని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ స్మార్ట్ రైస్ కార్డులను రూపొందించడం జరుగుతుందని, సదరు కార్డుపై ముద్రించిన క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల వివరాలు, ఈకేవైసీ స్థితి, రేషన్ సరుకుల వివరాలు, కేటాయించిన పరిమాణం, రేషన్ పొందిన స్థితి, డిపో వివరాలు తెలుస్తాయన్నారు . అంతే కాకుండా రాష్ట్రంలో ఎక్కడి వారైనా ఎక్కడి నుంచ్కెనా రేషన్ తీసుకునే సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు . కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా త్వరలో అర్హులందరికీ కొత్త కార్డులు అందజేయడం జరుగుతుందని, గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవని, వైకాపా జారీ చేసిన రేషన్ కార్డుల్లో వారు ఫొటోలు ముద్రించుకున్నారని, నేడు కూటమి ప్రభుత్వం ప్రభుత్వ రాజముద్ర, లబ్ధిదారుల ఫొటోలను మాత్రమే ముద్రించిందన్నారు . ఈ కార్యక్రమంలో అడపా భరత్, బస్వా వీరబాబు, వీరంరెడ్డి కాశిబాబు, తోట రవి, తోట గాంధీ, పోతుల మోహనరావు, నీలం శ్రీను, ఎమ్మార్వో చిరంజీవి, ఎండిఓ హరికృష్ణ, పాఠం శెట్టి మురళీకృష్ణ, పెనగంటి బాబ్జి, పీలా మహేశ్వరరావు, అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రాందేవ్బాబా భక్తులకు ఘన సత్కారం

**రాజస్థానీ యాత్రికులకు వసతి, భోజన వసతి కల్పించిన పాలచర్ల నాగేంద్ర చౌదరి**




**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేటలో తెలుగుదేశం యువ నాయకులు, భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, పాలచర్ల నాగేంద్ర చౌదరి వారి మోహన్ సాయి కృష్ణ రెసిడెన్సి నందు రాజమండ్రి నుండి కాలినడకన తీర్థయాత్ర చేసుకుంటూ తుని బాబా రాందేవ్ టెంపుల్ కి వెళ్తున్న రాజస్థాన్ మార్వాడి సోదరీ సోదరీమణులు అందరికీ జగ్గంపేటలో రాత్రి వారికి బస ఏర్పాటు చేసి ఉదయాన్నే పూజా కార్యక్రమం ముగించుకుని అల్పాహారం టి కాఫీ ఏర్పాటు చేసి, వారిని యాత్ర విజయవంతం కావాలని బాబా రాందేవ్ వారి ప్రతిమ మోస్తూ సామలమ్మ టెంపుల్ వరకు తీసుకువెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి అక్కడినుండి వారికి వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా రాజమండ్రి నుండి తుని పాదయాత్ర చేస్తున్న రాజస్థానీ హిందూ బంధువులు అందరికీ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా వారికి షెల్టర్ ఉండడానికి వసతి, భోజన వసతి కల్పిస్తానని ఈ సందర్భంగా వారికి తెలియజేశారు, మార్వాడి సోదరులు అందరూ నాగేంద్ర చౌదరి చేసే సేవా కార్యక్రమాలను అభినందించి వారితో బాబా రాందేవ్ వారికి ప్రత్యేక పూజలు చేయించారు, వారు ఆరాధ్య దైవమైన బాబా రాందేవ్ వారి ప్రసాదం అందజేశారు. రాజస్థానీ పద్ధతులు సన్మానించి వారికి చత్రపతి శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో నడుస్తున్న నాగేంద్ర చౌదరికి శివాజీ మహారాజ్ యొక్క కత్తి బహు గురించి సన్మానించడం జరిగింది.

### 2 న జనసేనాని పవన్ జన్మదినంలో సేవాకార్యక్రమాలు

# పవన్ జన్మదినం జనసైనికులకు పండుగ దినం

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మ దినోత్సవమైన సెప్టెంబర్ 2 న కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వ్యాప్తంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను అత్యంత ఘనంగా, సమాజ హితంగా నిర్వహించేందుకు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి) ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనసేన పార్టీ ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు కరణం సుబ్రహ్మణ్యం మార్గనిర్దేశంలో నియోజకవర్గం జనసేన పార్టీ శ్రేణులు స్వతఃసిద్ధంగా ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. శంఖవరం మండలం సీతయ్యమ్మపేట రిఫరల్ హాస్పిటల్లో ఉదయం 9 గంటలకు కరణం సుబ్రహ్మణ్యం నిర్వహణలో వృద్ధులకు, గర్భిణీ స్త్రీలకు ఫ్రూట్స్, రొట్టెల పంపిణీ చేస్తారు. ఏలేశ్వరం మండలం ఏలేశ్వరం పట్టణంలో ఏలేశ్వరం మండలం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గండిరెడ్ల మణికంఠ, మండల పార్టీ ఉపాధ్యక్షులు, పలివెల వెంకటేష్, మరొక ఉపాధ్యక్షులు అచ్చే వీరబాబు సంయుక్త ఆధ్వర్యంలో 10 గంటలకు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. మేడిశెట్టి సూర్యకిరణ్ కూడా 104 వ సారి రక్తదానం చేస్తారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో ఏలేశ్వరం మండలం జనసేన పార్టీ అధ్యక్షులు, లింగంపర్తి గ్రామ సహకార సంఘం ఛైర్మన్ పెంటకోట మోహన్ ఆద్వర్యంలో 10.30 గంటలకు రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేస్తారు. ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో జనసేన పార్టీ నాయకులు మోర్త లాజర్, బొబ్బర ప్రసాద్ ఆధ్వర్యంలో 11 గంటలకు రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేస్తారు. ప్రత్తిపాడు మండల జనసేన పార్టీ నాయకులు గోపిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో 11.30 గంటలకు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ ముఖ్య అతిధిగా ఆమె ద్వారా 150 మంది వికలాంగులకు ఒక్కొక్కరికి ఒకొక్క బియ్యం బస్తా చొప్పున పంపిణీ చేస్తారు. శంఖవరం ప్రభుత్వ ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో శంఖవరం మండలం జనసేన పార్టీ అధ్యక్షులు గాబు సుభాష్, గొంధి కొత్తపల్లి గ్రామ జనసేన పార్టీ నాయకులు కోన సతీష్ ఆధ్వర్యంలో వృద్ధులకు, గర్భిణీలకు



పండ్లు, రొట్టెలను పంపిణీ చేస్తారు. రౌతులపూడి జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో మధ్యాహ్నం 1 గంటకు వృద్దులు, గర్భిణీలకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేస్తారు. జనసేన రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జన్మదినం మన అందరికీ జన్మదినం. ఈ సందర్భంగా నిర్వహించే ఈ సామాజిక సేవా కార్యక్రమాల్లో నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జన సైనికులు, పార్టీ అభిమానులు, ప్రజలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనసేన పార్టీ ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు కరణం సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో కోరారు.

# సీపీఎస్ రద్దు చేయకపోతే ఉద్యమం తప్పదు

**ఏపీలో ప్రభుత్వ ఉద్యోగుల హక్కులకు భంగం**
**ఉద్యోగులతో చాకిరీ, వేధింపులు**
**రెవెన్యూ, పోలీస్ అధికారులను పార్టీ కార్యకర్తలుగా మారుస్తున్నారు**
**బీసీవైకు ఒక్క అవకాశం ఇస్తే ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు**
**బీసీవై అధినేత బోడే రామచంద్ర యాదవ్**




విజయవాడ

ఏపీలో ప్రభుత్వాలు మారినా.. నాయకులు మారినా.. అధికారం మారుతున్నా ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందని బీసీవై జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ విమర్శించారు. సోమవారం ఏపీసీపీఎస్ పెన్షన్ మార్చ్ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం రైలు అయితే.. ఉద్యోగస్తులు ఇంజన్ లాంటి వారని కానీ ఈ రోజు ప్రభుత్వాలు తీసుకుంటోన్న నిర్ణయాల వల్ల, ఉద్యోగస్తుల పట్ల అనుసరిస్తోన్న విధానాలు, వేధింపులతో ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దినదినగండంగా మారిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే ఆర్థిక, ఉద్యోగ భద్రతతో పాటు పదవీ విరమణ తర్వాత పెన్షన్ భద్రత ఉంటుందన్న నమ్మకం ఉద్యోగస్తుల్లో పోయిందని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్న ప్రతిసారి ఉద్యోగులపై వేధింపులు ఎక్కువ అవుతున్నాయని.. ఉద్యోగుల హక్కులు అణిచివేతకు గురవుతున్నాయని రామచంద్ర యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోజు రాష్ట్రంలో ఉపాధ్యాయులను నాన్ టీచింగ్ పనులకు వాడుకుంటూ.. పోలీసు, రెవెన్యూ ఉద్యోగులను అధికారంలో ఉన్న పార్టీ కార్యకర్తల్లా ట్రీట్ చేసే పరిస్థితికి ప్రభుత్వాలు దిగజారిపోయాయన్నారు. ఆర్థిక సంస్కరణల పేరుతో ఉద్యోగస్తు జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. గత యూపీఏ ప్రభుత్వంలో వేసిన భట్టాచార్య కమిషన్ ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ తర్వాత తీసుకోవాల్సిన చర్యల గురించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తే.. వీళ్లు సీపీఎస్ విధానంతో 20 లక్షల మంది ఉద్యోగుల జీవితాలతో చెలగాడం ఆడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులపై నాడు కేంద్ర ప్రభుత్వానికి నిర్ణయం తీసుకునే అవకాశం ఉండి కూడా.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అభీష్టానికి వ్యతిరేకంగా సీపీఎస్ అమల్లోకి తీసుకువచ్చారన్నారు. నాటి నుంచి నేటి వరకు కూడా దీనిపై ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో
అనేక పోరాటాలు చేస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేదని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దు చేస్తామని గతంలో జగన్మోహన్‌రెడ్డి, తర్వాత కూటమి నాయకులు అందరూ.. ఉద్యోగస్తుల ఓట్లతో గద్దె నెక్కాక ఉద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. సీపీఎస్ రద్దు విషయంలో ఏ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని.. 2003లో డీఎస్సీ ద్వారా ఎంపికైన 16 వేల మంది ఉద్యోగులను కూడా 2004 తర్వాత అమలులోకి వచ్చిన సిపిఎస్ విధానంలోకి తీసుకువచ్చి వారికి తీవ్ర అన్యాయం చేశారని రామచంద్ర యాదవ్ వాపోయారు. దీనిపై తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో అక్కడ ఉద్యోగులకు న్యాయం జరిగినా.. ఏపీ ఉద్యోగస్తుల విషయంలో ఏ ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరిగిన డీఎస్సీ, గ్రూప్స్ నియామకాల్లో వచ్చే ఉద్యోగులకు సీపీఎస్ అమలు చేస్తారా ? లేదా గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీపీఎస్ అమలు చేస్తారో ఇప్పటికీ సరైన స్పష్టత లేదన్నారు. ఇప్పటికి అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు కళ్లు తెరచి సీపీఎస్‌ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని.. ఈ విషయంలో ఏపీ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పోరాటానికి బీసీవై పార్టీ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ సీపీఎస్ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయనిపక్షంలో భవిష్యత్తులో బీసీవై పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని.. రాష్ట్ర ప్రజలు తమకు ఒక్క అవకాశం ఇస్తే ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతామని కూడా రామచంద్ర యాదవ్ ప్రకటించారు.

# కష్టకాలంలోనూ కలిసే ఉన్నాం

తియాన్‌జిన్

అత్యంత కష్టకాలంలోనూ భారత్-రష్యా కలిసే ఉన్నాయని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇరు దేశాలూ భుజంభుజం కలిపి నడిచాయన్నారు. ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్త సుస్థిరతకు రెండు దేశాల మధ్య భాగస్వామ్య బంధం మూలస్తంభంగా నిలుస్తుందని చెప్పారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనడానికి చైనాలోని తియాన్‌జిన్‌కు చేరుకున్న మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం ఆ కార్యక్రమం ముగిశాక విడిగా భేటీ అయ్యారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలు, ఉక్రెయిన్ యుద్ధం, పుతిన్‌తో ఇటీవల ట్రంప్ భేటీ వంటి పరిణామాల నేపథ్యంలో వీరి చర్చలు ఆసక్తి రేకెత్తించాయి. భారత్-రష్యా అనేక దశాబ్దాలుగా ప్రత్యేక స్నేహబంధం కొనసాగిస్తున్నాయని, ఇవి ఇంకా అభివృద్ధి చెందడానికి తాజా భేటీ పునాది వేస్తుందని పుతిన్ పేర్కొన్నారు. ఇరుదేశాల బంధాలు రాజకీయాలకు పూర్తిగా అతీతమన్నారు.

**10 నిమిషాలు నిరీక్షించి.. తోడ్కొని వెళ్లి..**

మోదీ, పుతిన్ ఒకే కారులో హెూటల్ వరకు ప్రయాణిస్తూ ముచ్చటించుకున్నారు. మోదీని కారులోకి తోడ్కొని వెళ్లేందుకు పుతిన్ పది నిమిషాలు నిరీక్షించారు. పావుగంటలోనే హెూటల్‌కు చేరిన ఇద్దరు నేతలు కారు నుంచి కిందికి దిగకుండా చాలాసేపు లోపలే కూర్చొన్నారు. వారు ముప్పావుగంటసేపు ఏకాంతంగా మాట్లాడుకున్నారని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. పుతిన్‌తో కారు ప్రయాణం ఫొటోను మోదీ 'ఎక్స్'లో పంచుకున్నారు. 'మా ఇద్దరి మధ్య చర్చలు ఎప్పుడూ వివేకంతో జరుగుతాయి. ఈసారీ అద్భుతంగా సాగింది' అని ఆయన పేర్కొన్నారు. కొన్ని కీలకాంశాలపై వీరు కారులో మాట్లాడుకుని ఉంటారని రష్యాలోని వర్గాలు భావిస్తున్నాయి. పేరుకు అది కారే అయినా ఇంట్లో సౌకర్యవంతమైన గదిలో ఉన్నట్లే ఉంటుందని తెలిపాయి. అమెరికా అధ్యక్షుడు వాడే 'బీస్ట్'లా పుతిన్ వాడే ఆరస్ లిమోసీన్ కారులో భద్రతపరంగా అనేక వ్యవస్థలు ఉంటాయి. తుపాకీ గుళ్లను, బాంబుదాడులను, క్షిపణులను తట్టుకోగలదు. రసాయన దాడి నుంచి రక్షించేందుకు ప్రత్యేక సౌకర్యాలున్నాయి. సదస్సు ప్రారంభ సమయంలో పుతిన్‌ను మోదీ ఆత్మీయంగా పలకరించారు. ఆలింగనం చేసుకున్నారు.

**ఉక్రెయిన్ యుద్ధాన్ని త్వరగా ముగించాలి**

ద్వైపాక్షిక చర్చల్లో ఉక్రెయిన్ యుద్ధం ప్రస్తావనకు వచ్చింది. యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించాల్సిందిగా మానవత్వ పిలుపు ఇస్తున్నట్లు మోదీ తెలిపారు. డిసెంబరులో పుతిన్‌ను స్వాగతించేందుకు భారత్‌లోని 140 కోట్లమంది ఆత్రుతగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి, మోదీకి మధ్య రెండ్రోజుల క్రితం జరిగిన ఫోన్ సంభాషణ సారాంశాన్ని పుతిన్‌కు భారత ప్రతినిధి బృందం వివరించింది. అమెరికా సుంకాలపై అధికారిక ప్రకటనలో ప్రస్తావన లేకపోయినా దానిపై మోదీ, పుతిన్‌లు కారులోనే మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది.


**షెహబాజ్‌ను పట్టించుకోని భారత ప్రధాని మోదీ**

సదస్సులో ఒకే వేదికపై మోదీ, పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా ఈ సదస్సులో భారత్, పాక్ ప్రధానులు ఎదురుపడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మోదీ, పుతిన్ మాట్లాడుకుంటూ కలిసి వెళ్తుండగా పాక్ ప్రధాని షెహబాజ్ అక్కడే నిల్చున్నప్పటికీ.. మోదీ పట్టించుకోకుండా, పలకరించకుండా వెళ్లిపోయిన దృశ్యాలు బయటకొచ్చాయి. చాలా సందర్భాల్లో పాక్ ప్రధానికి దూరంగా మోదీ ఉన్నారు.

# హిమాచల్, ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సం

న్యూఢిల్లీ

హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో సోమవారం భీకర వర్షాలు, కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో ఏడుగురు చనిపోయారు. ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ మార్గంలో సోమవారం ఉదయం కొండచరియలు విరిగి వాహనంపై పడగా ఇద్దరు యాత్రికులు చనిపోయారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. సోన్‌ప్రయాగ్%-%గౌరీకుండ్ మార్గంలోని ముంకాటియా వద్ద కొండప్రాంతం పక్క నుంచి వెళ్తున్న వాహనంపై ఒక్కసారిగా బండరాళ్లు పడ్డాయని అధికారులు తెలిపారు. బాధితులంతా ఉత్తరకాశీ జిల్లాకు చెందిన వారేనన్నారు. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థి తి విషమంగా ఉందన్నారు. భారీ వర్షాలు కొనసాగుతుండటంతో ఛార్ ధామ్ యాత్ర, సిక్కుల హేమ్‌కుండ్ సాహిబ్‌కు వెళ్లే దారిని ఈ నెల 5వ తేదీ వరకు మూసివేసినట్లు అధికారులు వివరించారు. వాతావరణం మెరుగయ్యాక, రహదారులు పూర్తి సురక్షితమని భావించిన తర్వాతే తిరిగి రాకపోకలను అనుమతిస్తామన్నారు. సోమవారం ఉదయం 8 గంటల వేళకు చంపావత్ జిల్లా బన్‌బాసాలో 25.64 సెంటీమీటర్లు, ఖతిమాలో 18.1 సెంటీమీటర్లు, తనక్‌పూర్‌లో 17.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వివరించారు. రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశమున్న డెహ్రాడూన్, ఉత్తరకాశీ, తెహ్రీ, పౌడీ, నైనిటాల్ తదితర 9 జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు.



**హిమాచల్‌లో ఐదుగురు..**

హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా జిల్లాలో 24 గంటల వ్యవధిలో వేర్వేరు చోట్ల కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఐదుగురు చనిపోయారు. వీరిలో ఒక మహిళ, ఏడేళ్ల ఆమె కుమార్తె ఉన్నారు. జుంగాలోని డబ్లూ ప్రాంతంలో కొండచరియలు విరిగి ఇల్లు కూలడంతో తండ్రి, అతడి పదేళ్ల కుమార్తె మరణించారు. సిమ్లాలోని కోట్‌ఖైలో ఇల్లు కూలి వృద్ధ మహిళ మరణించారు. కొండచరియలు విరిగిపడటంతో సిమ్లా%-%కల్కా మార్గంలో నడిచే ఆరు రైళ్లను రద్దు చేశారు. దెబ్బతిన్న ఐదు జాతీయ రహదారులు సహా 793 రహదారులను మూసివేశారు. మంగళవారం వరకు ఆరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ విభాగం హెచ్చరించింది.

**కశ్మీర్‌లో అమిత్ షా పర్యటన**

జమ్మూకశ్మీర్‌లోని కత్రాలో భారీ వర్షం కురియడంతో మాతా వైష్ణోదేవి ఆలయాన్ని వరుసగా ఏడో రోజూ మూసి ఉంచారు. జమ్మూకశ్మీర్‌లోని వరద ప్రభావిత
ప్రాంతాల్లోని వారి పునరావాసానికి అన్ని విధాలుగా సాయమందిస్తామని
హెూం మంత్రి అమిత్ షా తెలిపారు. సోమవారం జమ్మూలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు.
అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా, సీనియర్ నేతలతో రాజ్‌భవన్‌లో జరిగిన సమావేశంలో పరిస్థితిని సమీక్షించారు.

## హైడ్రోజన్ బాంబు త్వరలో పేలుస్తా!

పాట్నా

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ సంచలన ప్రకటన చేశారు. దేశంలో జరుగుతున్న ఓట్ల చోరీపై ఇప్పటికే అణుబాంబు పేల్చానని, త్వరలో హైడ్రోజన్ బాంబు పేలుస్తానని పేర్కొన్నారు. ఓట్ల దొంగతనంపై మరిన్ని నిజాలు బయటపెట్టిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ముఖం చూపించలేని పరిస్థితి వస్తుందని, ఆయన తలెత్తుకోలేరని చెప్పారు. సోమవారం బిహార్ రాజధాని పాట్నాలోని గాంధీ మైదాన్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపు సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు.
ఓట్ల చోరీని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని విప్లవాత్మక రాష్ట్రమైన బిహార్ యావత్ దేశానికి స్పష్టమైన సందేశం ఇచ్చిందని వెల్లడించారు. మహాత్మాగాంధీని హత్య చేసిన దుష్ట శక్తులే నేడు రాజ్యాంగాన్ని హత్య చేయడానికి కుట్రలు సాగిస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగం జోలికి వస్తే సహించబోమని బీజేపీని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని, ఓటు హక్కును రక్షించడానికే యాత్ర చేపట్టానని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందని, ఓటు చోర్, గద్దీ ఛోడ్ అంటూ వారు ముక్తకంఠంతో నినదించారని అన్నారు. రాహుల్ గాంధీ ఇంకా ఏం మాట్లాడారంటే...

**రేషన్ కార్డును, భూమిని లాక్కుంటారు**

"బీజేపీ నాయకులు మాకు నల్లజెండాలు చూపించారు. వారు ఒక విషయం తెలుసుకోవాలి. ఓట్లచోరీపై మహాదేవపురలో అణుబాంబు ప్రయోగించా. త్వరలో హైడ్రోజన్ బాంబు రాబోతోంది. అందుకోసం బీజేపీ నేతలు సిద్ధంగా ఉండాలి. ఓట్ల దొంగతనంపై బీజేపీ అసలు రంగు ఏమిటో ప్రజలకు తెలిసిపోతుంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమికి దక్కాల్సిన విజయాన్ని బీజేపీ కూటమి దొంగిలించింది.
ఇది వంద శాతం నిజం. బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ఓట్ల చోరీకి పాల్పడ్డాయి. బిహార్ యువతకు చెప్పదల్చుకున్నది ఏమిటంటే.. ఓటు చోరీ అంటే హక్కుల చోరీ, రిజర్వేషన్ల చోరీ, ప్రజాస్వామ్యం చోరీ, ఉద్యోగాలు%-%ఉపాధి అవకాశాల చోరీ, విద్య చోరీ, భవిష్యత్తు చోరీ. కేవలం ఓటునే కాకుండా మీ రేషన్ కార్డును, భూమిని సైతం లాక్కొని అదానీకి, అంబానీకి కట్టబెట్టాలని చూస్తున్నారు" అని రాహుల్ గాంధీ బీజేపీపై నిప్పులు చెరిగారు.

**తప్పుడు విధానాలు నమ్ముకుంటున్న మోదీ: ఖర్గే**

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తీరుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో సోషలిజం గురించి మాట్లాడిన నితీశ్ ఇప్పుడు బీజేపీ%-%ఆర్‌ఎస్‌ఎస్‌ల ఒడిలో సేదతీరుతున్నారని ధ్వజమెత్తారు. పనికిరాని చెత్తను ఎక్కడ పారేస్తారో నితీశ్‌ను బీజేపీ%-%ఆర్‌ఎస్‌ఎస్‌లు అక్కడే పారేయడం తథ్యమని స్పష్టంచేశారు. ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సభలో ఖర్గే మాట్లాడారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ నెగ్గడానికి ప్రధాని మోదీ ఓట్ల చోరీకి ఆలోచనతోనే ఉంటారని ఆరోపించారు. ఎన్నికల్లో విజయం కోసం బోగస్ ఓట్లను, తప్పుడు ప్రచారాన్ని, తప్పు డు హామీలు, తప్పుడు పథకాలను నమ్ముకుంటారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## శిథిలాల దిబ్బగా అఫ్గానిస్థాన్

-మొదటిపేజీ తరువాయి

చేపడుతున్న సహాయక చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వేల సంఖ్యలో ప్రజలు ఇంకా శిథిలాల కిందే చిక్కుకొని ఉంటారని అనుమానిస్తున్నారు. జలాలాబాద్ నగరానికి ఈశాన్యంలో 27 కిలోమీటర్ల దూరంలో కేవలం 8 కిలోమీటర్ల లోతులోనే భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ లోతు తక్కువగా ఉండటంతోనే తీవ్రత అధికంగా ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 11.37 గంటలకు సంభవించిన భూకంపం.. కునార్, నంగర్‌హార్ ప్రావిన్స్‌లను కుదిపేసింది. ఆ సమయంలో చాలా మంది నిద్రలో ఉండటంతో ఇళ్ల పైకప్పులు కూలి చాలా మంది సజీవ సమాధి అయిపోయారు. చాలా ప్రాంతాల నుంచి ఇంకా సమాచారం అందడం లేదని, పూర్తి వివరాలు లభ్యమైతే మృతులు, క్షతగాత్రుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తాలిబన్ ప్రతినిధి తెలిపారు. 2023 అక్టోబరులోనూ 6.3 తీవ్రతతో అఫ్గాన్‌లో భూకంపం సంభవించింది. ఆ విపత్తులో దాదాపు 4 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. భూకంపం తాకిన తూర్పు అఫ్గానిస్థాన్.. పర్వత ప్రాంతం. దీంతో మారుమూల గ్రామాల్లో ఇంకా సహాయక చర్యలు ప్రారంభం కాలేదు. చాలా ప్రాంతాల్లో ప్రజలు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. శిథిలాల కింద అనేకమంది ఇంకా సజీవంగా ఉన్నారని అనుమానిస్తున్నారు. సాయం అందడంలో జరుగుతున్న జాప్యం కారణంగా వీరంతా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రంతా పలు మార్లు భూమి కంపిస్తూనే ఉందని తెలిపారు. భూకంప కేంద్రానికి దగ్గరలో ఉన్న జలాలాబాద్ పాకిస్థాన్ సరిహద్దులకు సమీపంలోని అతిపెద్ద వాణిజ్యనగరం. దాదాపు 3 లక్షల మందికి నివాస ప్రాంతం. పాకిస్థాన్‌లోనూ పలు ప్రాంతాల్లో భూమి కంపించింది.
అఫ్గానిస్థాన్ భూకంపంలో భారీ ప్రాణనష్టం సంభవించడంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ విపత్తులో కుటుంబసభ్యులను, సన్నిహితులను కోల్పోయిన వారికి తగిన శక్తినివ్వాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. భూకంపం ధాటికి నష్టపోయిన అఫ్గాన్‌కు అన్ని రకాల సాయం అందించి ఆదుకుంటామని పేర్కొన్నారు. ఇప్పటికే మానవతా సాయాన్ని భూకంప ప్రభావిత ప్రాంతాలకు పంపించడం ప్రారంభించామని విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు.

## 99.5% ఓటర్లు సరైన ధ్రువీకరణలను సమర్పించారు

న్యూఢిల్లీ




బిహార్‌లోని 7.24 కోట్ల మంది ఓటర్లకుగాను ఇప్పటి వరకు 99.5 శాతం మంది వెరిఫికేషన్ కోసం ధ్రువీకరణ పత్రాలను అందజేసినట్లు ఎన్నికల కమిషన్ (ఈసీ) సోమవారం వెల్లడించింది.
ముసాయిదా ఓటరు జాబితాలో అనర్హుల పేర్ల తొలగింపులో ఆర్‌జేడీ, సీపీఐఎంఎల్‌లు మాత్రమే తమకు సాయం చేశాయని ఈసీ వివరించింది. రాష్ట్రంలో గుర్తింపు పొందిన సీపీఐ ఎంఎల్ 103 మంది పేర్లను తొలగించాలని కోరగా, ఆర్‌జేడీ, సీపీఐఎంఎల్‌లు కలిసి 25 పేర్లను కలపాలని దరఖాస్తులను అందించాయని పేర్కొంది. గుర్తింపు జాతీయ పార్టీ అయిన బీజేపీ మాత్రమే ఓటరు ముసాయిదాకు సంబంధించిన 16 అభ్యంతరాలను అందజేసిందని వివరించింది. బిహార్ ఎస్‌ఐఆర్‌పై మార్పులు, చేర్పులకు ఆఖరు రోజైన సోమవారం భారీగా దరఖాస్తులు అందాయని వెల్లడించింది. జాబితా నుంచి తొలగించాలని ఏకంగా 2.17 లక్షల దరఖాస్తులు అందగా, తమ పేర్లను చేర్చాలని 36 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించింది. ముసాయిదా జాబితాలో పొరపాటున చేర్చిన తమ పేర్లను తొలగించాలంటూ 2.17 లక్షల మంది వ్యక్తులు ఇప్పటి వరకు దరఖాస్తులను అందజేశారని ఈసీ అధికారులు తెలిపారు. బిహార్ ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్‌ఐఆర్) ముసాయిదాపై అభ్యంతరాలు, మార్పులు చేర్పులకు సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత కూడా అవకాశమిస్తున్నట్లు ఈసీ సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపింది.

## గుడ్లు తినడం వల్ల డయాబెటిస్ వస్తుందా..?



గుడ్లు పోషకాలతో నిండి ఉంటాయి. కాబట్టి దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. అందుకే ఉదయం అల్పాహారం నుండి లంచ్, డిన్నర్ వరకు వివిధ రకాల వంటలలో ఉపయోగిస్తారు. కానీ, ఇటీవలి కాలంలో ప్రతిరోజూ గుడ్లు తినడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుందా అనే ప్రశ్న తలెత్తింది. ఇంతకీ గుడ్లు తినడం ఆరోగ్యానికి హాని చేస్తుందా.?గుడ్లు పోషకాలతో నిండి ఉంటాయి. కాబట్టి దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. అందుకే ఉదయం అల్పాహారం నుండి లంచ్, డిన్నర్ వరకు వివిధ రకాల వంటలలో ఉపయోగిస్తారు. కానీ, ఇటీవలి కాలంలో ప్రతిరోజూ గుడ్లు తినడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుందా అనే ప్రశ్న తలెత్తింది. అమెరికన్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. ప్రతిరోజూ గుడ్లు తినేవారిలో టైప్ 2 డయాబెటిస్ ప్రమాదం 7శాతం నుండి 15శాతం వరకు పెరుగుతుందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా ప్రజల నుండి డేటాను పరిశీలించిన తర్వాత ఈ ఫలితం వచ్చింది. అయితే, ప్రమాదం ప్రతిచోటా ఒకేలా ఉండదు. పాశ్చాత్య దేశాలలో గుడ్లను తరచుగా బేకన్, సాసేజ్, తెల్ల రొట్టె, వెన్నతో తింటారు. వీటిలో కొవ్వు, శుద్ధి చేసిన చక్కెర అధికంగా ఉండటం వల్ల డయాబెటిస్ ప్రమాదం పెరుగుతుంది. అయితే, ఆసియా దేశాలలో గుడ్లను కూరగాయలు, బియ్యం లేదా చిక్కుళ్ళతో తింటారు. ఇది గుడ్ల వల్ల కలిగే హానిని తగ్గిస్తుందని అధ్యయనం పేర్కొంది. కాబట్టి, గుడ్లు తినడం హానికరం కాదు. మీరు వాటిని ఎలా తింటారనేది ముఖ్యం. ఉదాహరణకు, గుడ్లను నూనె, నెయ్యి లేదా వెన్నలో వేయించడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. అంతే కాదు, ప్రాసెస్ చేసిన మాంసాన్ని వాటితో కలిపి తినడం వల్ల ప్రమాదం మరింత పెరుగుతుంది. కానీ ఉడికించిన గుడ్లను కూరగాయలు లేదా ధాన్యాలతో తినడం ఆరోగ్యానికి మంచిది. గుడ్లలో అధిక-నాణ్యత ప్రోటీన్, విటమిన్ బి 12, కోలిన్, మంచి కొవ్వులు ఉంటాయి. కాబట్టి గుడ్లు తినడం పూర్తిగా మానేయవలసిన అవసరం లేదు. మీరు ఆరోగ్యంగా ఉంటే మీరు వారానికి 3 నుండి 6 గుడ్లు తినవచ్చు. కానీ, వాటిని ఉడికించిన లేదా కొద్దిగా నూనెతో తినడం మంచిది. మొత్తంమీద గుడ్లు హానికరం కాదు. డయాబెటిస్ ప్రమాదం మీరు వాటిని ఎలా తీసుకుంటారు, వాటితో మీరు ఎలాంటి ఆహారాన్ని కలిపి తింటున్నారు అనే దానిపై ఆధారపడి ఉంటుంది.

## ఈ సమస్యలు ఉన్నాయా? దానిమ్మ జోలికి అస్సలు వెళ్లకండి!



దానిమ్మ తినడం వల్ల మన ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే వైద్యుడు కూడా తరచూ వీటిని తనమని చెప్తూ ఉంటారు. అయితే వీటిని తినడం అందరికీ మంచిదికాదని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. అవును, కొన్ని వ్యాధులతో బాధపడేవారు, వ్యాధుల నివారణకు మందులు వాడేవారు దానిమ్మ తినడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే చాన్స్ ఉందని చెబుతున్నారు. దానిమ్మ తినడం వల్ల మన ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వీటిలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండటం వల్ల దీనిని సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. ఇది మన గుండె ఆరోగ్యానికి, రక్త ప్రసరణను మెరుగుపరచడానికి, మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. అందుకే వైద్యులు కూడా దానిమ్మపండు తినాలని సిఫార్సు చేస్తూ ఉంటారు. కానీ కొన్ని వ్యాధులతో బాధపడేవారు వీటిని తినకపోవడమే మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దానిమ్మలో పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి రక్త నాళాలను సడలించి రక్తపోటును తగ్గించేందుకు సహాయపడతాయి. అందుకే ఇది అధిక రక్తపోటు ఉన్నవారికి ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. కానీ తక్కువ రక్తపోటు (హైపోటెన్షన్) వంటి సమస్యతో బాధపడేవారు దానిమ్మను ఎక్కువగా తినడం హానికరమని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇప్పటికే రక్తపోటుతో బాధపడుతుంటే.. దానిమ్మను తినడం వారిలో రక్తపోటును మరింత తగ్గిస్తుంది. దీని వల్ల దృష్టిలోపం, మూర్ఛపోవడం వంటి సమస్యలు రావచ్చు. చాలా మంది వైద్యులు మీకు ఏదైనా ఆపరేషన్ చేయాల్సి ఉంటే.. కనీసం రెండు వారాల ముందు నుంచే రోగులను దానిమ్మపండు తినకూడదని చెప్పతారు. ఎందుకంటే దానిమ్మ రక్తం గడ్డకట్టే ప్రక్రియను ప్రభావితం చేస్తుంది. దీని కారణంగా ఆపరేషన్ సమయంలో అధిక రక్తస్రావం వంటి సమస్యలు ఏర్పడవచ్చు. దానిమ్మలో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియకు మంచిది, కానీ కడుపు సమస్యలు ఉన్నవారు దీనిని ఎక్కువగా తినకూడదు. ఎందుకంటే ఇందులో ఉండే టానిన్లు కడుపు నొప్పి, గ్యాస్, ఉబ్బరం లేదా విరేచనాలు వంటి సమస్యలను కలిగిస్తాయి. అందుకే జీర్ణసమస్యలు ఉన్నవారు. ఈ పండ్లను ఎక్కువగా తింటున్నట్టుయితే ఒకసారి వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం. కొందరు వ్యక్తులకు దాని పండు తింటే అలర్జీ కలుగుతుంది. వీరు ఒకవేళ దానిమ్మ పండును తింటే ముఖం, గొంతులో వాపు, దురద, చర్మంపై దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా అనాఫిలాక్సిస్ వంటి సమస్యలు రావచ్చు. శరీర రోగనిరోధక వ్యవస్థ దానిమ్మలో ఉండే కొన్ని ప్రోటీన్లకు ఎక్కువగా స్పందించడం వల్ల ఈ సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. దానిమ్మపండు తిన్నా లేదా దాని జ్యూస్ తాగినా మీకు చికాకు, దురద లేదా ఏదైనా చర్మ సమస్య ఉంటే మీరు వెంటనే దానిని తినడం మానేసి వైద్యుడిని సంప్రదించం ఉత్తమం.

## ఈ అలవాటు ఆరోగ్యానికి చాలా డేంజర్..!



ఆరోగ్యానికి ఆహారం ఎంత ముఖ్యమో నిద్ర కూడా అంతే అవసరం. అయితే కొంత మంది అధికంగా నిద్రపోతుంటారు. ఇది సాధారణమని అందరూ అనుకుంటారు. మీరు తెలుసా ఇది విటమిన్ లోపాల వల్ల కలిగే ఓ రుగ్మత. విటమిన్ బి12, ఐరన్, విటమిన్ డి, మెగ్నీషియం లోపాలు అలసట, అధిక నిద్రకు కారణమవుతాయి. నిద్ర లేకపోవడం జీర్ణవ్యవస్థను కూడా ప్రభావితం చేస్తుంది. నిద్రలేమితో బాధపడేవారు తరచుగా మలబద్ధకాన్ని ఎదుర్కొంటారు. దీనికి సకాలంలో చికిత్స చేయకపోతే, ఇది పేగు అవరోధం వంటి తీవ్రమైన పరిస్థితికి దారితీస్తుంది. నిద్ర లేకపోవడం జీర్ణవ్యవస్థను కూడా ప్రభావితం చేస్తుంది. నిద్రలేమితో బాధపడేవారు తరచుగా మలబద్ధకాన్ని ఎదుర్కొంటారు. దీనికి సకాలంలో చికిత్స చేయకపోతే, ఇది పేగు అవరోధం వంటి తీవ్రమైన పరిస్థితికి దారితీస్తుంది. అతిగా నిద్రపోవడం ఆరోగ్యానికి ప్రమాదకరం. విటమిన్ లోపాలు కూడా అతిగా నిద్రపోవడానికి కారణమవుతాయి. విటమిన్ బి12 శక్తికి అతిపెద్ద వనరు. ఇది ఎర్ర రక్త కణాలను పెంచుతుంది. దీని లోపం అలసట, అధిక నిద్రకు కారణమవుతుంది. విటమిన్ బి12 లోపాన్ని అధిగమించడానికిపాలు, పెరుగు, గుడ్లు, చేపలు, జున్ను తీసుకోవడం మంచిది. ఐరన్ లోపం వల్ల కూడా మెదడు, శరీరానికి తగినంత ఆక్సిజన్ అందదు. దీని వలన అలసట, అధిక నిద్ర వస్తుంది. ఆరోగ్యంగా ఉండటానికి ఆరోగ్యకరమైన ఆహారం ఎంత ముఖ్యమో, నిద్ర కూడా అంతే ముఖ్యం. సరైన నిద్ర లేకపోతే వివిధ ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ నిద్రలేమి మానసిక చికాకును కలిగించడమే కాకుండా గుండె, కడుపు సంబంధిత సమస్యలను కూడా కలిగిస్తుంది. అంతేకాదు నిద్ర లేమి ఆరోగ్యాన్ని నేరుగా ప్రభావితం చేస్తుందని అనేక అధ్యయనాలు సైతం నిరూపించాయి. ఇది కొన్ని లక్షణాల ద్వారా స్పష్టంగా కనిపిస్తుంది. కానీ మనం వాటిని సకాలంలో గుర్తించకపోతే వేలకట్టలేని మూల్యం చెల్లించవల్సి వస్తుంది. దీనితో పాటు నిద్ర లేకపోవడం కూడా కళ్ళపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ స్థాయి శరీరంలో విపరీతంగా పెంచుతుంది. చర్మం సున్నితంగా ఉండే ప్రాంతాల్లో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఫలితంగా కళ్ళ కింద నల్లటి వలయాలు, మచ్చలు ఏర్పడతాయి.

## కానీ ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు!



ప్యాంక్రియాస్ మన శరీరంలో ఆహారం అరిగించడంలో, రక్తంలో చక్కెర నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ఇందులో కణాలు అదుపు లేకుండా పెరిగితే ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ వస్తుంది. ఈ వ్యాధి మొదట్లో లక్షణాలు తెలియకపోయినా.. తరువాత తీవ్రమవుతుంది. కాబట్టి కొన్ని ముఖ్యమైన సంకేతాలను ముందుగానే గమనించడం అత్యంత అవసరం. ప్యాంక్రియాస్ అనేది మన పొట్ట వెనుక ఉండే ఒక ముఖ్యమైన అవయవం. ఇది మనం తిన్న ఆహారాన్ని అరిగించడంలో, అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ప్యాంక్రియాస్‌లోని కొన్ని కణాలు అదుపు లేకుండా పెరిగితే ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ వస్తుంది. మొదట్లో ఈ వ్యాధి లక్షణాలు బయటపడవు. కానీ అది ముదిరే కొద్దీ ఇతర శరీర భాగాలకు వ్యాపించే ప్రమాదం ఉంది. ఈ వ్యాధిని ముందుగా గుర్తించడానికి కొన్ని ముఖ్యమైన లక్షణాలు ఉన్నాయి. మీ చర్మం, కళ్ళు పసుపు రంగులోకి మారితే అది కామెర్లకు సంకేతం. ప్యాంక్రియాస్‌లో కణితి (ట్యూమర్) ఏర్పడితే అది పిత్త వాహికను అడ్డుకుంటుంది. దీని వల్ల రక్తంలో పసుపు రంగు పదార్థం పేరుకుపోతుంది. దీంతో మూత్రం ముదురు రంగులో, మలం రంగు మారడం, చర్మం పసుపు రంగులోకి మారడం జరుగుతుంది. పొట్ట పైభాగంలో మొదలయ్యే నొప్పి వెనుక వైపుకు వ్యాపిస్తే అది ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌కు ఒక ముఖ్యమైన సంకేతం. కణితి పెరిగే కొద్దీ నరాలపై ఒత్తిడి పెరిగి నొప్పి తీవ్రంగా ఉంటుంది. ఈ నొప్పి పదే పదే వస్తుంటే వెంటనే డాక్టర్‌ను కలవాలి. చర్మంపై బిలిరుబిన్ అనే పదార్థం పేరుకుపోతే దురద వస్తుంది. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ ఉన్నవారిలో ఇది కామెర్లతో కలిపి ఎక్కువగా ఉంటుంది. చర్మం బాగా దురదగా ఉంటే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. మీ ఆహారపు అలవాట్లు, వ్యాయామంలో ఎలాంటి మార్పులు లేకుండా బరువు తగ్గుతుంటే అది ప్రమాద సంకేతం. క్యాన్సర్ పెరిగే కొద్దీ శరీరానికి ఎక్కువ శక్తి అవసరం అవుతుంది. అందుకే బరువు తగ్గుతారు. అలాగే కణితి వల్ల పొట్టపై ఒత్తిడి పెరిగి త్వరగా కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీని వల్ల ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. మీ కుటుంబంలో ఎవరికీ డయాబెటిస్ లేకపోయినా.. మీకు ఒక్కసారిగా డయాబెటిస్ వస్తే అది ఈ వ్యాధికి ఒక సంకేతం కావచ్చు. కణితి కారణంగా ప్యాంక్రియాస్‌లోని ఇన్సులిన్ తయారు చేసే కణాలు దెబ్బతింటాయి. దీని వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. మామూలుగా అలసట చాలా కారణాల వల్ల వస్తుంది. కానీ బరువు తగ్గడం, కడుపు నొప్పి, ముదురు మూత్రం లాంటి లక్షణాలతో పాటు తీవ్రమైన అలసట ఉంటే ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేయకూడదు. ఎంత బాగా నిద్రపోయినా అలసటగా అనిపిస్తే ఇది గమనించాల్సిన లక్షణం.

## గుండె ఆరోగ్యాన్ని కాపాడే దివ్యౌషధం..!





నేటి బిజీ లైఫ్‌లో ప్రజల్లో ఒత్తిడి, ఆందోళన సర్వసాధారణం. దీంతో పాటుగా హార్ట్ ఎటాక్ మరణాల సంఖ్య కూడా పెరిగింది. పెరుగుతున్న గుండెపోటు కేసులను నివారించడానికి ఆయుర్వేదం అద్భుతమైన పరిష్కారాన్ని అందిస్తుంది. ఆయుర్వేదం ప్రకారం అర్జున బెరడు గుండె సమస్యలకు ఒక వరం అంటున్నారు నిపుణులు.. టానిన్లు, ఫ్లేవనాయిడ్లు, కౌమరిన్ వంటి దాని ఔషధ గుణాలు గుండె కండరాలను బలపరుస్తాయి. ఆధునిక జీవనశైలి, ఒత్తిడి, సరైన ఆహారం లేకపోవడం వల్ల ఇటీవలి కాలంలో గుండె జబ్బులు సర్వసాధారణంగా మారాయి. ఈ సమస్యకు ప్రధాన కారణం గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్త నాళాలలో ప్లాక్ ఏర్పడటం. పెరుగుతున్న గుండెపోటు కేసులను నివారించడానికి ఆయుర్వేదం అద్భుతమైన పరిష్కారాన్ని అందిస్తుంది. ఆయుర్వేదం ప్రకారం అర్జున బెరడు గుండె సమస్యలకు ఒక వరం అంటున్నారు నిపుణులు.. టానిన్లు, ఫ్లేవనాయిడ్లు, కౌమరిన్ వంటి దాని ఔషధ గుణాలు గుండె కండరాలను బలపరుస్తాయి. అధిక రక్తపోటు గుండె జబ్బులకు ప్రధాన కారణం. అర్జున బెరడు రక్తపోటును సమర్థవంతంగా నియంత్రిస్తుంది. కేవలం రూ. 15 కి లభించే అర్జున బెరడు గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. నేటి బిజీ లైఫ్‌లో ప్రజల్లో ఒత్తిడి, ఆందోళన సర్వసాధారణం. అర్జున బెరడుతో తయారు చేసిన కషాయం ఒత్తిడిని తగ్గించి, మనశ్శాంతిని అందిస్తుంది. అర్జున బెరడులో మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఇవి రక్తపోటును నియంత్రించడంలో, గుండె పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. శరీరంలో మనకు తెలియకుండా ఏర్పడే కణతుల పెరుగుదలను నియంత్రించడంలోఉపయోగపడుతుంది. అర్జున బెరడులోని విటమిన్ ఈ కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల అర్జున బెరడు తోడ్పడుతుంది. అర్జున బెరడుతో పాటు, అశ్వగంధ వంటి ఇతర ఆయుర్వేద మూలికలు కూడా గుండె ఆరోగ్యానికి మంచివి. అవి ఒత్తిడిని తగ్గించి గుండెను రక్షిస్తాయి. అందువల్ల అర్జున బెరడును ఉపయోగించడం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించవచ్చునని ఆయుర్వేదం చెబుతోంది.

## బిజినెస్

# కొత్త బంకులకు జియో-బీపీ నోటిఫికేషన్

### జీమెయిల్ వినియోగదారులకు గూగుల్ వార్నింగ్

ప్రపంచ వ్యాప్తంగా సుమారు 250 కోట్ల జీమెయిల్ వినియోగదారులకు గూగుల్ వార్నింగ్ ఇచ్చింది. అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల నుండి హ్యాకింగ్ దాడులు భారీగా పెరిగిపోయాయని, ఖాతాలపై తక్షణమే ప్రతిఒక్కరూ దృష్టి పెట్టాలని సూచించింది. యూజర్లు తమ పాస్‌వర్డ్‌లను మార్చుకోవడంతో పాటు టూ స్టెప్ వెరిఫికేషన్ అనే అదనపు ఫీచర్ ఖచ్చితంగా ఆన్ చూసుకోవాలని సూచించింది. చిన్నపాటి జాగ్రత్తల ద్వారా సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఖాతాలను సురక్షితంగా ఉంచుకోవాలని పేర్కొంది. ముఖ్యంగా సైబర్ దాడుల వెనుక షైనీహంటర్స్ అనే అంతర్జాతీయ హ్యాకర్ల ముఠా ఉందని గుర్తించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ ముఠా అనేక సంస్థలపై దాడులు చేసి సైబర్ మోసాలకు పాల్పడినట్టు పేర్కొంది. గతంలో ఐటీ అండ్ టీ, మైక్రోసాఫ్ట్, టికెట్ మాస్టర్ లాంటి దిగ్గజ సంస్థల నుండి కీలక సమాచారాన్ని దొంగలించడంతో షైనీ హంటర్స్ ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. హ్యాకర్లు ఫిషింగ్ అనే పద్ధతి ఉపయోగిస్తూ యూజర్లను నమ్మించేలా మెయిల్స్ పంపి వాటి ద్వారా మోసపూరిత పేజీలకు మళ్లిస్తున్నట్టు గుర్తించారు. ఆ పేజీలోకి యూజర్లు వెళితే యూజర్ నేమ్, పాస్‌వర్డ్ ఎంటర్ చేయగానే వివరాలు హ్యాకర్ల చేతికి వెళతాయి. ప్రమాదాన్ని ముందే పసిగట్టిన గూగుల్ యూజర్లకు ఆగస్ట్ 8వ తేదీన ఈమెయిల్స్ పంపి వారిని అలర్ట్ చేసింది.

### సెప్టెంబరు చివర్లో టాటా కేపిటల్ ఐపీఓ




బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) టాటా కేపిటల్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈ నెలాఖర్లో ఉండనుంది. సెప్టెంబరు 22తో ప్రారంభమయ్యే వారంలో పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు కంపెనీ సిద్ధమవుతోంది. ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ ద్వారా టాటా కేపిటల్ 2 బిలియన్ డాలర్లను (సుమారు రూ.17,200 కోట్లు) సమీకరించాలని అనుకుంటోంది. పబ్లిక్ ఇష్యూ అనంతరం కంపెనీ షేర్లు సెప్టెంబరు 30 కల్లా ఎక్స్ఛేంజీల్లో నమోదుకా వచ్చు. ఇష్యూలో భాగంగా మొత్తంగా 47.58 కోట్ల షేర్లను విక్రయించనుండగా.. ఇందులో తాజా షేర్ల విభాగంలో 21 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) ద్వారా 47.58 కోట్లను కంపెనీ జారీ చేయనుంది. ఓఎఫ్‌ఎస్ విభాగంలో టాటా సన్స్ 23 కోట్ల షేర్లను, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) 3.58 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను మూలధన స్థాయిని బలోపేతం చేసేందుకు, భవిష్యత్ మూలధన అవసరాల కోసం వినియోగించనుంది. ఈ పబ్లిక్ ఇష్యూ విజయవం తంగా పూర్తయితే.. దేశీయ ఆర్థిక సేవల రంగంలో అతిపెద్ద ఐపీఓగా నిలుస్తుంది. అంతేకాకుండా టాటా గ్రూపు నుంచి ఇటీవలి కొన్నేళ్లలో పబ్లిక్ ఇష్యూకు వచ్చిన రెండో సంస్థ అవుతుంది. 2023 నవంబరులో టాటా టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూకు వచ్చిన సంగతి తెలిసిందే. తొలి పబ్లిక్ ఆఫర్‌కు వచ్చేందుకు సెబీకి ముసాయిదా పత్రాలను సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్ సమర్పించింది. ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) రూపేణా జరగనుంది. అందువల్ల కంపెనీ ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎటువంటి నిధులు రావు. ఓఎఫ్‌ఎస్‌లో ప్రమోటరు మోహన్ అగర్వాల్, ప్రమోటర్ గ్రూపులోని మరికొందరు, గ్లోబల్ స్క్రాప్ ప్రాసెసర్స్ కలిపి 4.28 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ప్రస్తుతం సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్‌లో ప్రమోటర్లు, ప్రమోటరు గ్రూపునకు 87 శాతం వాటా ఉండగా.. గ్లోబల్ స్క్రాప్ ప్రాసెసర్స్‌కు మిగతా 13 శాతం వాటా ఉంది. రెండేళ్ల పాటు లాభాల్లో కొనసాగడంతో పాటు రూ.800 కోట్ల ఆదాయానికి చేరిన తర్వాత పబ్లిక్ ఇష్యూకు వస్తామని ఎడ్యుటెక్ సంస్థ విన్‌స్పార్క్ ఇన్నోవేషన్స్ లెర్నింగ్ తెలిపింది.




కొన్ని వ్యాపారాలు నిర్వహిస్తే నిత్య కల్యాణం పచ్చ తోరణంలా సాగుతాయి సంవత్సరం పొడవునా గిరాకీ ఉంటుంది. అలాంటి వ్యాపారాల్లో పెట్రోల్ పంప్ ఒకటని చెప్పవచ్చు. మంచి లొకేషన్‌లో పెట్రోల్ పంప్ ఏర్పాటు చేసినట్లయితే 24 గంటలు గిరాకీ ఉంటుంది. మంచి లాభాలు అందుకోవచ్చు. దీంతో చాలా మంది పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలని అనుకుంటారు. కానీ, ప్రాసెస్ తెలియగా వెనకడుగు వేస్తుంటారు. ఈ బిజినెస్‌లో ఒకసారి పెట్టుబడి పెట్టినట్లయితే ఆ తర్వాత ప్రతి ఏటా ఆదాయం వస్తూనే ఉంటుంది. అయితే ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయాల్సి వస్తుంది. కొంత అనుభవం సైతం ఉండాలి. అన్ని అర్హతలు ఉంటే పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం చాలా సులభమే అని చెప్పవచ్చు. మీరు సైతం పెట్రోల్ బంక్ పెట్టాలని అనుకుంటుంటే మీకో బెస్ట్ డీల్ అందుబాటులో ఉంది. ప్రముఖ ప్రైవేట్ చమురు రిటైలింగ్ కంపెనీ రిలయన్స్ జియో- బీపీ సంస్థ కొత్త బంకులు ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పిస్తోంది. మున్సిపల్ పరిధి, సహా గ్రామీ ప్రాంతాల్లోనూ ఈ బంకులు ఏర్పాటు చేసే అవకాశం ఇస్తోంది. జియో- బీపీ పెట్రోల్ బంకు ఏర్పాటు చేయాలనుకునే వారు అక్టోబర్ 31, 2025 వరకు దరఖాస్తులు సమర్పించే అవకాశాన్ని ఇచ్చింది. ఈ మేరకు సోషల్ మీడియా ఖాతాల్లో అవగాహన కల్పిస్తోంది. పూర్తి వివరాలకు జియో బీపీ అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి తెలుసుకోవడంతో పాటు పేజీ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.జియో బీపీ మొబిలిటీ స్టేషన్ డీలర్‌షిప్ కోసం ప్రత్యేక బ్రోచర్ విడుదల చేసింది జియో బీపీ సంస్థ. నేషనల్, స్టేట్ హైవేల పక్కన లేదా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే దారుల పక్కన భూమి కలిగి ఉండి పెట్టుబడి పెట్టే సామర్థ్యం ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. డీలర్ ఓన్డ్ డీలర్ ఆపరేటెడ్ ప్రాతిపదికన ఈ రిటైల్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేస్తోంది. దరఖాస్తు చేసుకునే సంస్థ యాజమాన్య సంస్థ అయితే యజమాని ఫారమ్ నింపాల్సి ఉంటుంది. భాగస్వామ్య సంస్థ అయితే ప్రతి భాగస్వామి ప్రత్యేక ఫారమ్ నింపాలి. ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అయితే, ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఎంటిటీగా నింపాల్సిన ఫారమ్. పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ అయితే, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ అనే సంస్థతో నింపాల్సిన ఫారమ్. అలాగే సీఏ ద్వారా తాజా నెట్‌వర్త్ స్టేట్మెంట్ లెటర్ తీసుకురావాలి. కేవైసీ డాక్యుమెంట్లు పాన్, ఆధార్ కార్డు, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ ఉండాలి. అఫిడవిట్ ఉండాలి. ల్యాండ్ డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఇతర ఆయిల్ మార్కెటింగ్ కంపెనీతో సంబంధాలు ఉన్న వారు, దివ్యాగులు, ఏదైనా కేసులో నేరం రుజువైన వారు, ఎన్‌ఆర్‌ఐలకు అర్హత ఉండదు. నాన్-రిఫండబుల్ అమౌంట్ రూ.5000 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని వెబ్‌సైట్లో జియో-బీపీ సంస్థ పేర్కొంది.

# జీఎస్‌టీ రేట్లపై స్పష్టత వస్తే అమ్మకాలు పుంజుకుంటాయ్

కొత్త జీఎస్‌టీ రేట్లపై సాధ్యమైనంత త్వరగా స్పష్టత వస్తే మొత్తం వాహన పరిశ్రమకు లబ్ధి చేకూరుతుందని, ప్రస్తుత త్రైమాసికంలోనే విలాస కార్లతో విభాగంతో పాటు మొత్తం విక్రయాలు పుంజుకుంటాయని దిగ్గజ సంస్థలు అంచనా వేస్తున్నాయి. సాధారణంగా పండగల సీజన్‌లో విలాస కార్ల విక్రయాలు ఎక్కువగా ఉంటాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో సెప్టెంబరు 3-4 తేదీల్లో జీఎస్‌టీ మండలి భేటీ కానుంది. ఈ సమావేశంలో జీఎస్‌టీ రేట్ల మార్పులపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇటీవల జీఎస్‌టీ రేట్లలో మార్పులు చేయనున్నట్లు వచ్చిన మార్పులతో కొనుగోలుదారులు అనిశ్చితిలో పడ్డారని బీఎండబ్ల్యూ ఇండియా గ్రూప్ అధ్యక్షుడు, సీఈఓ హర్దీప్ సింగ్ బరార్ పేర్కొన్నారు. కొనుగోలుదార్ల ఆసక్తి, గిరాకీ బలంగా ఉన్నాయని.. అయితే పన్ను రేట్లలో మార్పులు చేయొచ్చన్న అంచనాలతో వేచి చూసే ధోరణి పాటిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల కొత్త వాహన విక్రయాలపై ప్రభావం పడుతోందన్నారు. అన్ని ప్రయాణికుల విద్యుత్ కార్లను ప్రస్తుత 5 శాతం జీఎస్‌టీ శ్లాబ్‌లోనే ఉంచడం ద్వారా వాటి విక్రయాలను ప్రోత్సాహిస్తున్నట్లు అవుతుందని వెల్లడించారు. జీఎస్‌టీ రేట్ల నుంచి ప్రతికూల ప్రభావం ద్వారా విద్యుత్ కార్ల విక్రయాలు, దేశీయ ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతింటాయన్నారు. సెప్టెంబరు మొదటి వారంలో జీఎస్‌టీపై స్పష్టత రావొచ్చని, తద్వారా వినియోగదారుల విశ్వాసం పెరిగి, గిరాకీ అధికం కావొచ్చని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ అంచనా వేశారు. పండగల సీజన్‌పై కొనుగోలుదార్లలో భారీ అంచనాలు ఉన్నాయని, వచ్చే వారం నుంచి కంపెనీ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను ప్రారంభించనుందని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ పేర్కొన్నారు. జీఎస్‌టీ రేట్లను తగ్గించే దిశగా ప్రభుత్వం సంస్కరణలు చేపట్టనుండటంతో.. కొందరు కొనుగోలుదార్లు తమ కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటున్నారని విశ్లేషకు లు చెబుతారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు కొనుగోలు చేయాలనుకునే వారిలో ఈ ధోరణి కనిపిస్తోందని అంటున్నా రు. అయితే ఈ కొనుగోళ్ల వాయిదా తాత్కాలికమేనని, జీఎస్‌టీ రేట్లపై స్పష్టత వస్తే అమ్మకాలు పుంజుకుంటాయని విశ్లేషిస్తున్నారు. ఇందుకు పండగ సీజను కూడా కలిసి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




# టాప్-5 క్రికెటర్లలో కోహ్లికి నో ఛాన్స్.. సారీ చెప్పిన డివిలియర్స్



సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్, టీమిండియా స్టార్ విరాట్ కోహ్లి మధ్య ఉన్న ఫ్రెండ్‌షిప్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సి అవసరం లేదు. ఐపీఎల్‌లో ఆర్సీబీకి ప్రాతినిథ్యం వహించినప్పటి నుంచి మొదలైన వారిద్దరి స్నేహ బంధం ఇప్పటికి అలానే కొనసాగుతోంది. అయితే ప్రతీసారి కోహ్లికి సపోర్ట్‌గా ఉండే ఏబీడీ.. ఈసారి మాత్రం కింగ్ అభిమానులను నిరాశపరిచాడు. డివిలియర్స్ ఇటీవల బియర్డ్ బీఫోర్ వికెట్ పాడ్ కాస్ట్‌లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా తన కెరీర్‌లో తాను చూసిన టాప్-5 బెస్ట్ టెస్టు క్రికెటర్లు ఎవరన్న ప్రశ్న హోస్ట్ నుంచి డివిలియర్స్‌కు ఎదురైంది. ఆశ్యర్యకరంగా డివిలియర్స్ ఎంచుకున్న ఆటగాళ్ల జాబితాలో విరాట్ కోహ్లి పేరు లేదు. నేను చాలా మంది దిగ్గజ క్రికెటర్లతో కలిసి ఆడాను. టాప్-5లో అగ్రస్థానం కచ్చితంగా జాక్ కల్లిస్(సౌతాఫ్రికా)కే దక్కుతుంది. ఆ తర్వాత మొహమ్మద్ ఆసిఫ్(పాకిస్తాన్) ఉంటాడు. జీవితంలో నేను ఎదుర్కొన్న అత్యుత్తమ సీమర్ అతడే. ఇక మూడో స్థానం షేన్ వార్న్(ఆస్ట్రేలియా). వార్నీ బౌలింగ్‌ని ఆడటాన్ని ఆస్వాదిస్తా. కానీ అతడి బౌలింగ్‌లో నేను ఎప్పుడూ ఇబ్బంది పడలేదు. అతడు బంతిని రిలీజ్ చేసే విధానం, అతడి హెయిర్ స్టైల్.. వర్ణించడానికి మాటలు చాలవు. ఇక నాలుగో స్థానంలో ఆండ్రూ ఫ్లింటాఫ్(ఇంగ్లండ్) ఉంటాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో కల్లిస్‌కు ఫ్లింటాఫ్ వేసిన యార్కర్ ఇప్పటికీ నాకు గుర్తు ఉంది. నా జీవితంలో నేను చూసిన అత్యుత్తమ యార్కర్ అదే. చివరగా మరో స్థానం మిగిలి ఉంది. ఈ ప్లేస్ ఇండియన్ లెజెండరీ బ్యాటర్ సచిన్ టెండూల్కర్‌కు ఇవ్వాలనకుంటున్నాను. నేను అతడికి ఒక అభిమానని. సచిన్ బ్యాటింగ్ స్టైల్ చాలా అందంగా ఉంటుందని డివిలియర్స్ పేర్కొన్నాడు. అయితే పక్కన ఉన్న ఇంగ్లండ్ స్టార్ స్పిన్నర్ అదిల్ రషీద్.. కోహ్లికి ఛాన్స్ ఇవ్వలేదని గుర్తించాడు. అందుకు ఏబీడీ స్పందిస్తూ.. సారీ విరాట్. ఇటువంటి ప్రశ్నలకు సమాధానం చెప్పడం చాలా కష్టమని అన్నాడు. కాగా ఇటీవల ముగిసిన వరల్డ్ ఛాంపియన్ షిప్ ఆఫ్ లెజెండ్స్ 2025లో సౌతాఫ్రికాను డివిలియర్స్ ఛాంపియన్‌గా నిలిపాడు.

## స్పోర్ట్స్

### ప్రత్యర్థుల పాలిట సింహస్వప్నం.. హ్యాట్రిక్ ట్రోఫీలతో సరికొత్త చరిత్ర!



పొట్టి క్రికెట్‌లో సంచలన విజయాలు మామూలే. కానీ, ఒకేఒక జట్టు వరుసపెట్టి టైటిళ్లు గెలవడం మాత్రం దాదాపు అసాధ్యమే. అయితే.. ఒక జట్టు మాత్రం నభూతో నభవిష్యత్ అనేలా.. కొన్ని తరాలు నిలిచిపోయే ప్రదర్శనతో ఔరా అనిపించింది. 'ది హండ్రెడ్ లీగ్' లో తమ ఆధిపత్యాన్ని చాటుతూ వరుసగా మూడో ఏడాటి టైటిల్ కొల్లగొట్టింది. ప్రత్యర్థుల పాలిటి సింహస్వప్నంలా నిలుస్తూ హ్యాట్రిక్ ట్రోఫీతో చెక్కుచెదరని రికార్డు నెలకొల్పింది ఓవల్ ఇన్విన్సిబుల్స్ వన్డే వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా మాదిరిగా ఈ వంద బంతుల టోర్నీలో అజేయ శక్తిగా ఎదిగిన ఓవల్ జట్టు విజయ ప్రస్థానమిది. ఐపీఎల్ స్ఫూర్తిగా ఇంగ్లండ్ గడ్డపై 'ది హండ్రెడ్ లీగ్' ఏమంట మొదలైందోగానీ.. ఓవల్ ఇన్విన్సిబుల్స్ జట్టు టైటిళ్ల వేటతో దడపుట్టిస్తోంది. 2023 ఆరంభ సీజన్‌లో ఛాంపియన్‌గా నిలిచిన ఓవల్.. నిరుడు కూడా దుమ్మురేపి ట్రోఫీని తన్నుకుపోయింది. ఈ ఏడాది కూడా ఫేవరెట్‌గా బరిలోకి దిగి హ్యాట్రిక్ టైటిల్‌తో నవ చరిత్రకు నాంది పలికింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ట్రెంట్ రాకెట్స్‌కు సామ్ బిల్లింగ్స్ నేతృత్వంలోని ఓవల్ టీమ్ చెక్ పెట్టింది. దాంతో తొలిసారి విజేతగా నిలవాలనుకున్న రాకెట్ జట్టు కల కలగానే మిగిలిపోయింది. మొదట విల్ జాక్స్(72) విధ్వంసంతో 5 వికెట్ల నష్టానికి 168 రన్స్ చేసింది. దాంతో, రాకెట్స్ బ్యాటర్లు లక్ష్యాన్ని తేలికగా ఛేదిస్తారని.. ఈసారి ఓవల్ ఇన్విసిబుల్స్ రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సిందే అని అనుకున్నారంతా. కానీ బౌలింగ్‌లో నాథన్ సోవ్టర్ (3-250)తో ప్రత్యర్థిని దెబ్బకొట్టాడు. దాంతో, రాకెట్స్ టీమ్‌ను 26 పరుగుల తేడాతో మట్టికరిపించిన ఓవల్ జట్టు ముచ్చటగా మూడోసారి ఛాంపియన్‌గా మురిసిపోయింది.

**రెండో జట్టుగా రికార్డు..**

పొట్టి క్రికెట్‌లో వరుసగా మూడు టైటిళ్లు గెలుపొందిన రెండో జట్టుగా ఓవల్ ఇన్విసిబుల్స్ అవతరించింది. ఈ జట్టు కంటే ముందు కరీబియన్ టీ20 కప్‌లో ట్రినిడాడ్ టొబాగో ఇలానే హ్యాట్రిక్ టైటిళ్లతో రికార్డు నెలకొల్పింది. దినేశ్ రామ్‌దిన్ నేతృత్వంలోని ట్రినిడాడ్ 2011, 2012, 2013లో ఛాంపియన్‌గా నిలిచింది.

# ఒలింపిక్స్ పతకమే టార్గెట్.. రైజింగ్ షూటర్ తనిష్క్




హైదరాబాద్: తెలంగాణ యువ షూటర్ తనిష్క్ మురళీధర్ నాయుడు టాప్ షూటర్‌గా ఎదుగుతున్నాడు. ఈ హైదరాబాదీ క్రీడాకారుడు తాజాగా ముగిసిన ఆసియా జూనియర్స్ షూటంగ్ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు సాధించాడు. ఒలింపిక్స్‌లో పతకమే టార్గెట్‌గా తనిష్క్ తన ట్యాలెంట్‌కు పదును పెడుతున్నాడు. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరిగిన ఆసియా షూటింగ్ పోటీల్లో అతను 25 మీటర్ల స్టాండర్డ్ పిస్తోల్ వ్యక్తిగత, టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకాలు సాధించాడు. గత రెండేళ్ల నుంచి టాప్ ఫామ్‌లో ఉన్న ఆ షూటర్ ఇప్పుడు ఒలింపిక్స్‌ను టార్గెట్‌గా పెట్టుకున్నాడు. ప్రస్తుతం జూనియర్ స్థాయిలో ఆడుతున్న అతను.. త్వరలోనే సీనియర్స్ కేటగిరీలోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు. హైదరాబాద్‌లో ఉన్న ఒలింపిక్ షూటర్ గగన్‌నారంగ్ అకాడమీలో తనిష్క్ శిక్షణ పొందుతున్నాడు. గన్ ఫర్ గ్లోరీ అకాడమీ నుంచి తనిష్క్ రాటుదేలుతున్నాడు. ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించడమే కాదు.. ఆ మెగా ఈవెంట్‌లో దేశానికి పతకాన్ని తీసుకురావాలన్న కాంక్షతో ట్రైనింగ్ తీసుకుంటున్నట్లు తనిష్క్ చెప్పాడు. నమస్తే తెలంగాణతో మాట్లాడిన తనిష్క్.. ఇటీవల ముగిసిన ఆసియా చాంపియన్‌షిప్ ఫలితంపై సంతోషం వ్యక్తం చేశాడు. తన ప్లానింగ్, ప్రిపరేషన్ గురించి అతను వెల్లడించాడు. చాలా నిలకడగా, ఫోకస్డ్‌గా షూటింగ్ ప్రాక్టీస్ కొనసాగిస్తున్నట్లు తనిష్క్ తెలిపాడు. ఖేలో ఇండియా, ప్రాజెక్టు లీప్ ప్రస్తుతం స్పాన్సర్‌షిప్ కల్పిస్తున్నాయన్నాడు. మును ముందు మరింత ప్రోత్సాహం లభిస్తే, షూటింగ్ ఫీల్డ్‌లో మరిన్ని పతకాలు గెలవడం ఖాయమని తనిష్క్ చెప్పాడు. తనిష్క్ తండ్రి శ్రీనివాస్ రావు. ఆయన భారతీయ నౌకాదళంలో పనిచేసి రిటైర్ అయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న రక్షణశాఖకు చెందిన డిజైన్ ఇంజినీర్ శాఖలో పనిచేస్తున్నారు. షూటర్ తనిష్క్ తల్లి అనురాధ. ఆమె ఇంటిపని చూసుకుంటూ.. కుమారుడిని తీర్చిదిద్దుతున్నారు. తనిష్క్‌కు అన్నిరకాలుగా ఆమె మనోధైర్యాన్ని ఇస్తున్నారు.



# మంచు విష్ణు ఓటీటీకి టైం ఫిక్స్.. ఎప్పటి నుండి స్ట్రీమింగ్ అంటే..!

మంచు విష్ణు ప్రధాన పాత్రలో మైథలాజికల్ నేపథ్యంలో తెరకెక్కిన భారీ చిత్రం 'కన్నప్ప' థియేటర్లలో మంచి విజయాన్ని నమోదు చేసింది. పాన్-ఇండియా స్థాయిలో రూపొందిన ఈ సినిమాను ఐదు భాషల్లో విడుదల చేశారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంలో విడుదలైన ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. బాలీవుడ్‌కి చెందిన ప్రముఖ దర్శకుడు అయిన ముఖేష్, 'మహాభారతం' సీరీస్‌తో మంచి గుర్తింపు పొందారు. ఇక ఈ చిత్రానికి మోహన్ బాబు నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. ఈ చిత్రంలో గెస్ట్ రోల్స్ లో మోహన్ బాబు, శివబాలాజీ, ప్రభాస్ (రుద్రుడిగా), అక్షయ్ కుమార్ (శివుడిగా), కాజల్ అగర్వాల్ (పార్వతిగా), మోహన్‌లాల్, శివరాజ్ కుమార్, శరత్ కుమార్, ప్రీతి ముకుందన్,మధుబాల,బ్రహ్మానందం, రఘుబాబు తదితరులు నటించారు. సినిమా అధిక భాగం న్యూజిలాండ్‌లో చిత్రీకరించబడింది. అనేక వాయిదాల తర్వాత చివరకు జూన్ 27న థియేటర్లలో విడుదలైంది. ఓటీటీ రిలీజ్ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్న అభిమానులకి గుడ్ న్యూస్ చెప్పారు మేకర్స్. సెప్టెంబర్ 4 నుండి అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ మూవీ స్ట్రీమింగ్ కానుంది. కన్నప్ప సినిమా థియేటర్లలో ఓ మోస్తరు విజయం సాధించింది. అయితే ఈ సినిమా ఓటీటీ విడుదలపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. సాధారణంగా సినిమా విడుదలై 7-8 వారాల వ్యవధిలో ఓటీటీలోకి వచ్చేస్తుంది. అయితే కన్నప్ప విడుదలై దాదాపు 10 వారాలు గడుస్తున్నా ఓటీటీ రిలీజ్‌పై క్లారిటీ రాలేదు.ఎట్టకేలకి ఈ రోజు మేకర్స్ ప్రకటించారు. ఇక ఈ మూవీని థియేటర్స్‌లో మిస్ అయిన వారు ఓటీటీలో చూసి ఎంజాయ్ చేయవచ్చు. ముఖ్యంగా ప్రభాస్ కోసం ఈ మూవీని ఎక్కువగా చూసే ఛాన్స్ ఉంది.



# నీతో అద్భుతమైన జ్ఞాపకాలు.. ఇక గుడ్ బై

విక్టరీ వెంకటేశ్ ఎమోషనల్ అయ్యాడు. తన పెంపుడు శునకం గూగుల్ చనిపోవడంతో బాధపడుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. దానితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నాడు. ఇక వీడ్కోలు అని రాసుకొచ్చాడు. 'మా ప్రియమైన గూగుల్. గత 12 ఏళ్లుగా మా జీవితాల్లో నువ్వు భాగమయ్యావు. ఎంతో ప్రేమని పంచావు. అందమైన జ్ఞాపకాలని ఇచ్చావు. నువ్వే మా సన్‌షైన్. ఇక నీకు వీడ్కోలు. నువ్వు లేని శూన్యత మాటల్లో వర్ణించలేనిది. నేను నిన్ను ఎప్పటికీ మిస్ అవుతూనే ఉంటాను డియర్ ఫ్రెండ్' అని వెంకటేశ్ తన ఇన్ స్టాలో పోస్ట్ పెట్టాడు. దీనికి నటి ఖుష్బూ కూడా కామెంట్ చేసింది. ఓం శాంతి అని రాసుకొచ్చింది. వెంకటేశ్ సినిమాల విషయానికొస్తే ఈ ఏడాది సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం' అనే సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించాడు. రీసెంట్‌గానే త్రివిక్రమ్‌తో మూవీ చేయబోతున్నట్లు ప్రకటించాడు. ఇది కూడా కుటుంబ కథా చిత్రం అని తెలుస్తోంది. త్వరలో షూటింగ్ మొదలుకానుంది. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమాని థియేటర్లలో రిలీజ్ చేయబోతున్నారు.








# ఆర్జీవీతో డ్యాన్స్ చేయించిన జగపతి బాబు



టాలీవుడ్ సీనియర్ హీరో జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న జీ తెలుగు రియాలిటీ టాక్ షో జయమ్ము నిశ్చయమ్మురా శ్రోతలను ఎంతగానో అలరిస్తోంది. ప్రతి వారం ప్రత్యేక అతిథులతో వినోదాన్ని పంచే ఈ షోకు తాజా ఎపిసోడ్ మరింత స్పెషల్‌గా మారింది. ఈ వారం గెస్టులుగా సెన్సేషనల్ డైరెక్టర్లు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ), సందీప్ రెడ్డి వంగా హాజరై షోకు హైలైట్‌గా మారనున్నారు. ఇద్దరూ సినిమాల పరంగా ఎంత విభిన్నమైన శైలిలో ఉన్నా ఒకే స్టేజ్‌పై కలిసినప్పుడు మాత్రం నవ్వులు, సరదా, కాస్త ఫైర్‌తో ప్రేక్షకులని అలరిస్తుంటారు. తాజాగా షోకి సంబంధించిన ప్రోమో విడుదల కాగా, ఇందులో ఇద్దరూ కలిసి చేసిన చిలిపితనం, జోక్స్, బోల్డ్ కామెంట్లు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా సందీప్ వంగా "ఆర్జీవీ నా ఫేవరెట్ డైరెక్టర్" అని కొన్నిసార్లు చెప్పిన నేపథ్యంలో, వీరిద్దరూ కలిసి మాట్లాడిన అంశాలు ఆసక్తికరంగా మారాయి. ఆర్జీవిని సైతాన్ అని జగపతి బాబు అనడం, డెవిల్-యానిమల్ పక్క పక్కనే ఉంటే ఎంత ముద్దుగో ఉందో అని చెప్పడం ప్రోమోకి హైలైట్‌గా మారాయి.మరోవైపు ప్రోమో మొదట్లో ఆర్జీవి డ్యాన్స్ వేయడం కూడా షోకి హైలైట్. మొత్తానికి ఈ ఎపిసోడ్ మాత్రం ప్రేక్షకులకి ఫుల్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ మాస్ కాంబినేషన్ ఎపిసోడ్‌ను సెప్టెంబర్ 7, ఆదివారం రాత్రి 9 గంటలకు జీ తెలుగులో ప్రసారం చేయనున్నారు. ప్రోమో చూసినవాళ్లు మాత్రం .. "ఫుల్ ఎపిసోడ్ ఎప్పుడొస్తుందా?" అంటూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com